

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM


హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


17-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 137 పేజీలు: 10+4 వెల: 6.50


టైమ్స్ మేగజైన్ జాబితాలో క్రికెటర్ స్మృతి మంథాన 2







మంగళవారం ఫ్రాన్స్‌లోని ఎవియన్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ తదితర దేశాధినేతలు

## చేయి చేయి కలిపిన ట్రంప్, మోడీ

### జి-7 సమ్మిట్‌లో ఉభయుల భేటీ

### 16 నెలల తర్వాత ఇద్దరు అధినేతలు ముఖాముఖి

### నేడు ఇద్దరి మధ్య ద్వైపాక్షిక సమావేశం

**ప్యారిస్ జూన్ 16:** ఫ్రాన్స్‌లోని ఎవియన్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌లు మంగళవారం పరస్పరం కలుసుకుని మాట్లాడారు. గత 16 నెలల తర్వాత ఈ ఇద్దరు నేతలు ముఖాముఖిగా సమావేశమవడం విశేషం. ఇద్దరు నేతలు చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్‌లో భేటీ అయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం జరిగిన ఆ సమావేశం తర్వాత ఇదే తొలి ప్రత్యక్ష సమావేశం. జీ7 సదస్సు వేదికపై ఒకరినొకరు పలకరించుకున్న మోడీ, ట్రంప్ కొద్దిసేపు చర్చించారు. సదస్సు సందర్భంగా బుధవారం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనున్నట్లు సమాచారం. జీ7 >>2

## సాగుమేలుకు ప్రత్యేక కమిటీ

### విత్తనాల నుంచి కొనుగోళ్లదాకా సమగ్ర కార్యాచరణ

### రైతు వేదికల్లో విత్తనాలు, ఎరువుల పంపిణీ

### ఎంపీలతో కలిసి కేంద్రం వద్దకు మంత్రుల టీం

### వ్యవసాయ శాఖ సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి



మంగళవారం వ్యవసాయ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్16:** రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి,వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటివరకు >>2

7

### ఫ్యూచర్ సిటీలో రైల్వే స్టేషన్

బుల్లెట్‌రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్టుపై సమీక్ష జరిపిన సిఎం రేవంత్




## 'నీట్' ముగిసేదాకా 'టెలిగ్రామ్' బ్యాన్

### ఎన్‌టిఎ హర్షం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 16:** ఈనెల 21న నీట్ రీ ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మే3న జరిగిన నీట్ ప్రశ్నాపత్రం లీకైన నేపథ్యంలో ఇపుడు అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని భావించిన కేంద్రం టెటిగ్రామ్ యాప్‌పై బ్యాన్ విధించింది. ఈ నెల 21న నీట్ రీ ఎగ్జామ్ ఉన్నందున ఈ నెల 22 వరకు టెలిగ్రామన్ యాప్‌ను బ్యాన్ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ నెల 30 వరకు దేశంలో టెలిగ్రామ్ యాప్‌కి సంబంధించిన మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని కేంద్ర ఐటీ శాఖ ఆదేశాలు జారీ చేసింది. టెలిగ్రామ్ యాప్ నిలిపివేతపై నీట్ పరీక్షను >>2

## రేవంత్ సర్టిఫికెట్ మాకెందుకు?



### నేను ఆపితే ప్రాజెక్టులు ఆగుతాయా?

### ఆధారాల్లేని ఆరోపణలు ముఖ్యమంత్రికి తగవు

### తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నాం


### సిఎంతో ఖట్టర్ వద్దకు నేనూ వస్తా: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత కొన్నిరోజులుగా మెట్రోప్రాజెక్టు విషయంలో అనేక రకాలుగా తన మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, గత ఏడేళ్లుగా కేంద్ర సహాయమంత్రిగా, కేబినెట్ మంత్రిగా తాను తెలంగాణప్రయోజనాల కోసం పనిచేశానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాలు బాగా జరగాలనే కోరుకున్నాను తప్ప ఏనాడూ అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. సిఎం రేవంత్ రెడ్డి సోమవారం మాట్లాడుతూ మెట్రో ఫేజ్ 1, ఫేజ్ 2 విషయంలో తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫేజ్ 2 విషయంలో 50:50 నిష్పత్తిలో ముందుకెళ్లాలని సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నాతో, ముఖ్యమంత్రి కలిసినప్పుడు >>2

**అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించండి**
కిషన్‌రెడ్డికి సిఎం బహిరంగ లేఖ 7

## కాంట్రాక్టర్ల ఆత్మహత్యలు బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాపమే

### వారి సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్,జూన్ 16,,ప్రభాతవార్త:** కాంట్రాక్టర్ల ఆత్మహత్య బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాపమే అని గత ప్రభుత్వం రూ.400కోట్లు ఒక్క ఆర్ అండ్‌బిలోనే బకాయిపెట్టారనిరోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బిల్డర్స్, కాంట్రాక్టర్‌లతో మంత్రుల నివాస సముదాయంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశమై కాంట్రాక్టర్లు 18న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించుకోవాలని కోరారు. యాదాద్రి దేవస్థానం నిర్మాణ పనులు చేపట్టిన సంస్థలకు సైతం ఇప్పటికీ రూ.350 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రం ఆర్థిక ఒత్తిడులను ఎదుర్కొంటున్నప్పటికీ, గత30నెలల్లో కాంట్రా క్టర్లకు రూ.3,000 కోట్లకు పైగా బిల్లులు చెల్లించడానికి సిఎం రేవంత్‌రెడ్డి ఆర్ అండ్ బి కి విడుదలు ఇచ్చారని ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కెసిఆర్ బకాయిపెట్టిన బిల్లులు కారణంగా నాగర్ కర్నూ ల్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి సహా ఆరుగురు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారనీ వారి మరణం తీవ్రంగా కలచివేశాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజోపయోగంలేని కాళేశ్వరం కట్టి లక్షన్నర కోట్లు దుర్వినియోగం చేశారుకానీ కానీ రైతాంగానికి, ప్రజలకు అత్యంత అవసరమైన బ్రాహ్మణ వెల్లంల, ఎస్‌ఎల్‌బిసిసొరంగం, పాలమూరురంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టులను నిరక్ష్యం చేశారన్నారు. అందుకే ఆ మూడు జిల్లాల్లో ఉన్న 30 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 3 స్థానాలకే పరిమితమయ్యారని" మంత్రి విమర్శించారు. చిన్నకాంట్రాక్టర్లు, ఎల్ఇడి లైట్ల పనులు చేసిన సంస్థలు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన బకాయిల పరిష్కారానికి కూడా ప్రభుత్వం >>2

## హరీష్, ప్రవీణ్ ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా

### ఎన్ని కోట్లో బిఆర్‌ఎస్ నేతలే క్లారిటీ ఇవ్వాలి

### ప్రతి నిర్ణయం పారదర్శకంగానే: మంత్రి అడ్లూరి



మంగళవారం మీడియాతో మంత్రి అడ్లూరి

**హైదరాబాద్,జూన్ 16,ప్రభాతవార్త:** గురుకుల విద్యా సంస్థల కొనుగోళ్లకు సంబంధించిన టెండర్ల విషయంలో మాజీ మంత్రి హరీష్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అబద్ధాల ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తాననీ సాంఘికశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఒకే అంశంపై బిఆర్‌ఎస్ నాయకులు మూడు రకాల అంకెలు చెబుతున్నారని విమర్శించారు.హరీష్ రావు రూ.2,000 కోట్ల కుంభకోణమని చెబుతుండగా, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రూ.3,000 కోట్ల వరకు కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్నారని, మరోవైపు వారి అనుబంధ మీడియా సంస్థలు రూ.200 కోట్ల వ్యవహారమని ప్రచారం చేస్తున్నాయని అన్నారు."అసలు నిజమైన అంకె ఏది..? రూ.200 కోట్లా..? రూ.2,000 కోట్లా..? రూ.3,000 కోట్లా..? మీకే క్లారిటీ లేకపోతే ప్రజలు ఎలా నమ్మాలి?" అని ప్రశ్నించారు. "హరీష్ రావు చెప్పింది నిజమని ఆధారాలతో నిరూపిస్తే ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి ప్రజల సమక్షంలోనే మంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని సవాల్ విసిరారు.టెండర్లపై ముఖ్యమంత్రి సమీక్ష తర్వాతే నిర్ణయాలుటెండర్ల గురించి తనకు, >>2




## ప్రశాంతంగా 'టెట్'

### 16 జిల్లాల్లో 61 పరీక్షా కేంద్రాలు

**హైదరాబాద్,ప్రభాతవార్త, జూన్ 16:** తెలంగాణ రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)-2026 పరీక్షలు మంగళవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.మొదటి రోజు పరీక్షలకు 72.99శాతం హాజరైనట్టు టెట్-2026 కన్వీనర్ టి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షలను 5 రోజులపాటు10 సెషన్‌లలో నిర్వహించనున్నారు. >>2



## నెలాఖరున రైతు భరోసా

### ఏడున్నర ఎకరాలకే పరిమితం

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాత వార్త:** రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా నిధులను ఈ నెలాఖరులోగా విడుదల >>2

## ఎసిబి వలలో మరో బడా అవినీతి అధికారి

### సర్వే లాండ్ రికార్డుల డిప్యూటీ డైరక్టర్ నరహరి

### ఇంట్లో రూ.150 కోట్ల అక్రమాస్తులు

### భారీగా నోట్ల కట్టలు, బంగారు, వెండి నగలు



నరహరి (ఫైల్)

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** సర్కారీ విభాగాల్లో బడా అవినీతి అధికారుల భరతం పడుతున్న ఎసిబి మరో అధికారిని మంగళవారం అరెస్టు చేసింది. మల్టీ జోన్ 2 సర్వే లాండ్ రికార్డుల డిప్యూటీ డైరక్టర్ సుంకరి నరహరి అక్రమాస్తుల చిట్టాను ఎసిబి రట్టు చేసింది. ఈ సంద ర్భంగా ఛత్రి నాకలోని ఆయన ఇంట్లో కోటీ 54 లక్షల రూపాయల నగదు, కిలోన్నర బంగారు, ఎనిమిది కిలోల వెండి నగలు పట్టుబడగా జంట నగరాలు, శివార్లలోని పలుచోట్ల ఆయన పేరిట వున్న 13 కోట్ల ఐదు లక్షల రూపాయలకు పైగా అక్రమాస్తులను వెలికితీశారు. దీనికి సంబ ంధించిన వివరాలను ఎసిబి డిజి చారు సిన్హా మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వ విభాగాల్లో అక్రమార్కులుగా ముద్రపడ్డ అధికారులను ఎసిబి వరుసగా కటకటాల్లో నెడుతుండడం తెలిసిందే. గత నెల 19వ తేదీన వాటర్ వర్క్స బోర్డులో ఇంజనీరింగ్ విభాగంలో జిఎంగా వున్న అనంత లక్ష్మీ కుమార్‌ను అరెస్టు >>2

# ప్రశాంతంగా 'టెట్'

>>మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 41 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 11.30 గంటల వరకు 15032 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా.. వారిలో 10,959 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌కి 72.9 శాతం హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 14,162 మంది హాజరు కావల్సి ఉండగా.. వారిలో 10,352 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కి 73.10 శాతం మంది హాజరయ్యారు. మొదటి రోజు 29,194 మంది పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా వారిలో 21,311 మంది హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 72.99శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండవ రోజైన బుధవారం 55కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్టు రమేష్ ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 10 నిమిషాల ముందుగానే గేట్లను మూసి వేస్తామని అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోనికి 10 నిమిషాల ముందుగానే చేరుకోవాలని, ఉదయం సెషన్‌లో 8.50 తరువాత, మధ్యాహ్న సెషన్‌లో 1.50 తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబోమని ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,53,752 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు వచ్చాయి. 5 దరఖాస్తులు ట్రాన్స్ జెండర్ల నుంచి వచ్చాయి.

# నెలాఖరున రైతు భరోసా

>> చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే వ్యవ సాయ శాఖ నుంచి రైతుల వివరాలను సేకరించింది. కొత్తగా పట్టాలు పొందిన వారికి నోటిఫికేషన్ విడుదలైన వారం రోజుల్లోనే ఒక ఎకరానికి సాయం జమ చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో పంట సీజన్ ప్రారంభమవడంతో రైతులు ఇప్పటికే వానాకాలం సాగు నిమిత్తం విత్తనాలు, ఎరువులు, భూములను దుక్కుదున్నడం వంటి పెట్టుబడుల కోసం రైతులు అప్పులు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. గత యాసంగి సీజన్‌లో గరిష్ఠంగా రెండెకరాల వరకు ప్రభుత్వం సాయం అందించగా, ప్రస్తుత వానాకాలం సీజనులో మాత్రం ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇక ప్రతి సీజన్‌లోను రైతు భరోసా కింద దాదాపు రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఇక రాష్ట్రంలో 1.40 కోట్ల ఎకరాల భూమి ఉండగా, 70 లక్షల మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నాయి. సాగు చేయని భూములను జాబితా నుంచి తొలగిస్తే సుమారు రూ.1,200 కోట్లు ఆదా అవుతాయని అంచనా. గతేడాది సాగు చేయని సుమారు 3.50 లక్షల ఎకరాలను గుర్తించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, గ్రామ పరిసరాల్లోని భూములు, రోడ్లు, కాలువల కిందికి వెళ్లిన భూములు కలిపి సుమారు 2 లక్షల ఎకరాలు సాగుకు పనికిరావని తేల్చారు. దీంతో వీటికి రైతు భరోసా సాయం అందించకూడదని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా ఇప్పటివరకు పట్టా పాస్‌బుక్‌లో ఉన్న మొత్తం భూమికి సాయం అందించగా, ఇకపై ఐదు నుంచి ఏడున్నర ఎకరాల వరకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

# సర్టిఫికెట్ మాకెందుకు?

>> సైతం ఈ విషయాన్ని తెలియజేశారు. మెట్రో ఫేజ్ 1కు కేంద్ర ప్రభుత్వం రూ.1,250 కోట్లు ఇచ్చింది. మోడీ స్వయంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. దేశంలోని మిగిలిన నగరాల్లాగే.. హైదరాబాద్ విషయంలోనూ సాంకేతికతంగా చర్చించి కేంద్రం సహకరిస్తుందన్నారు. అంతే తప్ప కిషన్ రెడ్డి ఆపమంటే ఆపరని, తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉందన్నారు. మాకు ఈ విషయంలో ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. నాకు, మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్, రేవంత్ రెడ్డి సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. నేను తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా ఉంటానన్నారు. తెలంగాణలో మేం ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా మేం అమలు చేస్తున్నారు. జాతీయరహదారులైనా, రైల్వేలైనా.. ఇతర మౌలికవసతుల ప్రాజెక్టులైనా, అభివృద్ధి పనులైనా కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. తాను కేంద్రమంత్రులను కలిసి నిధులు రాకుండా ఆపానని సిఎం విమర్శించారు. తాను ఖట్టర్‌ని కలిసిన ప్రతిసారి మీడియాలో, సోషల్ మీడియాలో పెట్టాను. నా తేదీలను.. నాకే చెబుతున్నాడు అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ బిడ్డగా నేను ఉద్యమాలు చేశాను. అమరణ నిరాహార దీక్ష చేశాను. బిల్లు పాసైన తర్వాతే దీక్ష విరమించాను. ఏదైనా చెప్పాలనుకుంటే.. ప్రాజెక్టు విషయంలో మార్పులు అవసరమైతే.. ధైర్యంగా చెబుతాం తప్ప.. ఇలా ప్రాజెక్టులను అడ్డుకోం. తెలంగాణ అభివృద్ధికోసం ప్రాజెక్టులకు సహకరిస్తాం. అందులో సందేహం అక్కర్లేదు. జనవరి 15న సిఎంకు లేఖ రాశాను. అనేక సార్లు లేఖలు రాశాను. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో ఫేజ్ 2 కోసం ముందుకు రావాలని అందులో పేర్కొన్నాను. ఇవాళ ఐఆర్ఎఫ్‌సి గురించి సిఎం మాట్లాడారు. ఈ రుణాలకు సంబంధించి నేను ఏనాడూ మాట్లాడలేదు. రూ.13,500 కోట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇది వాళ్ల, వాళ్ల తేల్చుకోవాల్సిన అంశం. తాను దీనిపై ఖట్టర్‌తో మాట్లాడాను. మెట్రో ఆదాయంలో ముందుగా ఐఆర్ఎఫ్‌సికి రుణాలను చెల్లించడానికి సిఎం ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం పలు సూచనలు చేసిందని చెప్పారు. తెలంగాణకు స్వాతంత్రం వచ్చిన తర్వాత అసలు ప్రభుత్వమే లేదు, పాలన లేదన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాకే ప్రజాస్వామ్యం వచ్చిందన్నట్లు వ్యవహరిస్తున్నాడు. రేవంత్ రెడ్డి మీరిచ్చిన 6 గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీలు ఏమయ్యాయి? దాని గురించి ఏనాడూ మాట్లాడటం లేదు ఎందుకు?తెలంగాణకు రూపాయి వచ్చినా సంతోషపడే మొదటి వ్యక్తిని నేనన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం.. స్పెషల్ సెల్ పెట్టుకుని పనిచేస్తున్నాం. మెట్రోకు సంబంధించి. ఫైనాన్షియల్ ఫీజిబిలిటీ, టెక్నికల్ ఫీజిబిలిటీ విషయంలో కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకోవాలని, తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. నేను రెగ్యులర్‌గా తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మంత్రులను కలుస్తున్నాను. ఈ విషయంలోనూ మీతో కలిసి వచ్చేందుకు నేను సిద్ధమేనన్నారు. ఫేజ్ 1కు లోన్ విషయంలో.. ఫేజ్ 2 విషయంలో కలిసి పనిచేసే విషయంలో కూర్చుని నిర్ణయించుకోవాలి. తాను మంగళవారం ఖట్టర్‌తో మాట్లాడినపుడు.. ఈ లోన్ విషయంలో.. ఇరు పార్టీలకు స్పష్టత రాలేదన్నారు. దీన్ని చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఎన్‌ఓసి విషయంలోనూ.. చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు.

# టైమ్స్ మేగజైన్ జాబితాలో క్రికెటర్ స్మృతి మంధాన

**న్యూఢిల్లీ,జూన్ 16:** భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ 2026 సంవత్సరానికి గాను ప్రకటించిన క్రీడారంగంలో 100 మంది అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబితాలో ఆమెకు చోటు దక్కింది. ఈ జాబితాలో స్థానం పొందిన ఏకైక భారత క్రీడాకారిణిగా స్మృతి నిలవడం విశేషం. ఈ ఘనతతో ఆమె ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనెల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో, బాస్కెట్‌బాల్ స్టార్ లెబ్రాన్ జేమ్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుల సరసన చేరింది. ప్రపంచ క్రీడారంగాన్ని తమ ప్రతిభ, నాయకత్వ పటిమ, పెట్టుబడులతో ప్రభావితం చేస్తున్న క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులతో ఈ జాబితాను రూపొందించినట్లు టైమ్ మ్యాగజైన్ వివరించింది.

# 'టెలిగ్రామ్' బ్యాన్

>> నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) హర్షం ప్రకటించింది. నీట్- 2026 రీఎగ్జామ్‌కు ముందు పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రం లీకేల పేరుతో జరుగుతున్న మోసాలు, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై కేంద్రం తాత్కాలిక ఆంక్షలు విధించింది. ఈ నెల 22 వరకు దేశంలో టెలిగ్రామ్ సేవలను పరిమితం చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చేసిన సిఫార్సుల మేరకు, సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 69ఏ కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 21న జరగనున్న నీట్ రీఎగ్జామ్ జరగనున్న నేపథ్యంలో ఈ నెల 22 వరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయని కేంద్రం ప్రకటించింది. పరీక్షలు రాసే విద్యార్థులను మోసం చేస్తున్న గ్రూపులు టెలిగ్రామ్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయని, అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. టెలిగ్రామ్‌లో ఇప్పటికే పంపిన సందేశాలను సవరించే సదుపాయాన్ని కూడా ఈ నెల 30 వరకు భారతదేశంలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

పరీక్ష ముగిసిన తర్వాత అసలు ప్రశ్నాపత్రాలను పాత సందేశాల్లో జతచేసి, అవి ముందుగానే లీక్ అయ్యాయని తప్పుడు ఆధారాలు సృష్టించే ఘటనలు ఇటీవల పెరిగినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు నిర్వాహకులు పరీక్ష అనంతరం అసలు ప్రశ్నాపత్రాన్ని పాత పోస్టుల్లో జతచేసి, వాటి స్క్రీన్‌షాట్లను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపింది. టెలిగ్రామ్‌ను విద్య, ఉద్యోగ, వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించే లక్షలాది మంది వినియోగదారులకు ఈ నిర్ణయం కొంత అసౌకర్యం కలిగించవచ్చని ఎన్‌టీఏ అంగీకరించినప్పటికీ నీట్ రీ ఎగ్జామ్ పారదర్శకత, భద్రత కోసం ఈ చర్యలు తప్పనిసరి అయ్యాయని స్పష్టం చేసింది.

నీట్- 2026 రీఎగ్జామ్

ఈ నెల 21న జరగనున్న నేపథ్యంలో ప్రశ్నా పత్రాల లీకేజీ వదంతులను నమ్మవద్దని ఎన్‌టిఏ విద్యార్థులకు సూచించింది. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను కోరింది. నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## వారం - వర్జ్యం

17-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
తదియ రా.9.43, పునర్వసు మ.1.41,
వర్జ్యం : రా.2.58-తె.4.24,
దు. ఉ.8.11-ఉ.9.03, 2)రా.11.56-రా.12.48
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:**యోగక్షేమాల పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. తద్వారా లాభపడతారు. ప్రయాణాలు లభిస్తాయి. వస్త్రాలు కొంగోలు.

**వృషభం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మిథునం:**పొదుపు పథకాలలో వైఫల్యం చెందకుండా జాగ్రత్తలు పాటించండి. అప్రయత్నంగా కార్యక్రమాలు పూర్తికాగలవు.

**కర్కాటకం :** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి శుభ వర్తమానాలు అందుకుంటారు.

**సింహం:**నిర్మాణాత్మక, వ్యూహాత్మక విషయ వ్యవహారాలలో ఆచి తూచి నిర్ణయాలు తీసుకోండి.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కన్య :** ఏదయినా ఒక అద్భుత కార్యక్రమం చేసి నలుగురిలో అఖండ ఖ్యాతిని ఆర్జించాలనే కోరిక బలపడుతుంది.

**తుల :** కళారంగాల వారికి సన్మాన, సత్కారాలు పొందుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఆస్తి లాభం.

**వృశ్చికం:** సంతానం పేరు మీద స్థిరాస్తులు బదిలీ చేయడం లేక కొనుగోలు చేయడం జరుగుతుంది. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** కార్యాలయంలో మీ ప్రతిపాదనలను అందరూ ఏకగ్రీవం ఆమోదిస్తారు. శ్రమ తగిన ప్రతిఫలాలు అందుకుంటారు.

**మకరం:** ఈ రోజు తనఖాలో ఉన్న వస్తువులను విడిపించుకుంటారు. ఆర్థికంగా ఎటువంటి ఒడిదుడుకులు ఉండవు.

**కుంభం:** ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పు చేస్తారు. అహంభావం ధోరణి విడనాడడం వలన లాభపడతారు.

**మీనం :** కృత్రిమముగా, ప్రభుత్వ సంబంధమైన ఇబ్బంధులు రావచ్చును. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఫ్రాన్స్‌లో జరుగుతున్న జి-7 సదస్సులో ప్రధాని మోడీతో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా గెర్ట్రూడ్ డేర్ లేయన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్

# చేయి చేయి కలిపిన ట్రంప్, మోడీ

>> సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్ చేరుకున్న ప్రధాని మోడీ, ప్రపంచ నాయకులతో కీలక అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకోవాలని ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్‌మీడియా వేదికగా సందేశం విడుదల చేశారు. ట్రంప్ ప్రభుత్వం భారతదేశంపై అదనపు సుంకాలు విధించడం, 2025 మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక ఉద్రిక్తతలను తగ్గించడంలో తన పాత్ర ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో ఇరుదేశాల సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది.అయితే గత నెలలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత పర్యటన అనంతరం ఇరుదేశాలు సంబంధాల పునరుద్ధరణ దిశగా చర్యలు ప్రారంభించాయి. ఒమాన్ తీరంలో జరిగిన అమెరికా దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించిన ఘటన తర్వాత కూడా ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో రుబియో, ప్రధాని మోడీతో సమావేశమై అధ్యక్షుడు ట్రంప్ తరఫున త్వరలో వైట్ హౌస్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో అమెరికా వ్యూహానికి భారత్ కీలక స్తంభమని రుబియో పేర్కొన్నారు.ఇతర ప్రపంచ నేతలతోనూ సమావేశాలుజీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రత, వాణిజ్యం, ఇంధన సరఫరాలు తదితర కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి.

**అణ్వస్త్రాలుండవని ఇరాన్ అంగీకరించింది: ట్రంప్**

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. అయితే అణ్వాయుధాలను కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించినట్లు సోమవారం డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇక తమ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు 300 మిలియన్ల డాలర్ల ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో స్పందించారు. ఇరాన్‌తో కుదిరే డీల్‌లో అణ్వస్త్రాలను డెవలప్ చేయబోమని ఆ దేశం అంగీకరించనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఎంవోయూ కుదిరినట్లు వార్తలు వెలుబడుతున్న విషయం తెలిసిందే. జెనీవాలో శుక్రవారం అధికారికంగా రెండు దేశాల మధ్య సంతకాలు జరిగే అవకాశం ఉన్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి రోజు నుంచి స్పష్టంగా ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అణ్వాయుధ సేకరణ కోసం ఇరాన్‌కు అనుమతి ఇవ్వబోమని ఇజ్రాయల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండవద్దు అని దశాబ్ధాలుగా పోరాటం చేస్తున్నానని, దీన్ని జీవిత మిషన్‌గా భావించానని అన్నారు. డీల్ కుదిరినా, కుదరకపోయినా, ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండబోదన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా తాను ఉన్నంత కాలం ఇలా జరగబోదన్నారు.



బ్రాటిస్లావాలో ప్రధాని మోడీకి స్లోవేకియా అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తున్న ఆ దేశ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రి

# ప్రధానిమోడీకి స్లోవేకియా అత్యున్నత పురస్కారం

**బ్రాటిస్లావా, జూన్ 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది.భారత ప్రధానికి స్లోవేకియా దేశ అత్యున్నత జాతీయ పురస్కారమైన ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ (ఫస్ట్ క్లాస్)ను ప్రదానం చేశారు. బ్రాటిస్లావాలో జరిగిన ఒక కార్యక్రమంలో స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని ఈ అవార్డును మోదీకి అందజేశారు. ప్రధాని మోదీ అందుకున్న 33వ అంతర్జాతీయ పురస్కారం ఇది. ఈ గౌరవంపై ప్రధాని మోదీ స్పందిస్తూ ఈ పురస్కారం 140 కోట్ల మంది భారతీయులకు చెందిందని అన్నారు. ఈ సాయంత్రం ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ గౌరవానికి స్లోవేకియా ప్రజలకు, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. భారత్, స్లోవేకియా మధ్య శాశ్వత స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నానని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ది ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ అనేది విదేశీ పౌరులకు మాత్రమే స్లోవేకియా ప్రభుత్వం అందించే అత్యున్నత పౌర, సైనిక పురస్కారం. యూరప్ పర్యటనలో భాగంగా మోదీ స్లోవేకియాలో పర్యటిస్తున్నారు. ఒక భారత ప్రధాని ఈ దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య వలసలు, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు 11 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచినట్టు అధికారులు తెలిపారు.

# వలలో మరో బడా అవినీతి అధికారి

>> చేసి ఆయన వద్ద వున్న 100 కోట్ల రూపాయ ల అక్రమాస్తులను బట్టబయలు చేయగా ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు భుజంగ రావును మరోసారి అరెస్టు చేసి ఆయన వ ద్ద వున్న 5.92 కోట్ల రూపాయల అక్రమాస్తులను జప్తు చేయడం విదితమే. దీని తరువాత ఈ నెల తొమ్మిదవ తేదీన ఆర్ అండ్ బి ఈఎన్‌సి మోహన్ నాయక్‌ను అరెస్టు చేసి ఆయన వద్ద వున్న 200 కోట్ల రూపాయల ఆస్తులను రట్టు చేయడం మరింత సంచలనం రేపింది. ఈ మూ డు ఘటనలు మరువక ముందే మంగళవారం ఉదయం మల్టీ జోన్ 2 సర్వే లాండ్ రికార్డుల డిప్యూటీ డైరక్టర్ సుంకరి నరహరి ఇంటితో పాటు కార్యాలయం, బంధువుల ఇళ్లపై, ఆయన పనిచేసే కార్యాలయంలో మొత్తం 14 బృందాలుగా విడిపోయి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. సుంకరి నరహరిపై వచ్చి అవినీతి ఆరోపణలపై పక్కా సమాచారం సేకరించిన ఎసిబి అధికారులు దీనిపై అంతే పక్కాగా దాడులు నిర్వహించా రు. దాడుల సందర్భంగా నరహరి ఇంటిని ఎసిబి అధికారులు కొన్ని గంటల పాటు మూసివేశారు. నరహరి మంచం కింది భాగంలో ప్రత్యేకం గా అమర్చిన ర్యాక్‌లలో కోటీ 20 లక్షల రూపాయల నగదు లభ్యమవడంతో ఎసిబి అధికారులు షాక్‌కు గురయ్యారు. దీంతో పాటు ఇదే గదిలో మరో చోట వుంచిన 34 లక్షల రూపాయల నగదు కూడా లభ్యమయ్యింది. నగదుతో పాటు పలు బ్యాంకు ఖాతాల్లో రెండు కోట్ల 29 లక్షల రూ పాయల నగదు, 1.3 కిలోల బంగారు నగలు, ఎనిమిది కిలోల వెండి నగలు లభిం చాయి. ఇంట్లో ఖరీదైన కియా కారు లభ్యమయ్యింది. దీం తో పాటు రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ పొలం, పుప్పాల్‌గూడలో 2500 చదరపు గజాల స్థలం, నార్సింగిలో 1.860 చదరపు గజాల మరో ప్లాట్, రాజేంద్రనగర్‌లో 1,377 చదరపు గజాల మరో ప్లాట్, గచ్చిబౌలిలో జి ప్లస్ 3 ఖరీదైన భవనం, ఛత్రినా కలో జి ప్లస్ 2 భవనం వెలుగు చూసింది. మొత్తం అక్రమాస్తుల విలువ 13 కోట్ల ఐదు లక్షల 67 వేల 100 రూపాయలుగా ఎసిబి అధికారు లు తేల్చారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ 150 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికా రులు చెబుతున్నారు. సర్కారీ విభాగాల్లో అక్రమాలు, అక్రమార్కులపై 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి చారు సిన్హా తెలిపారు.

# సాగుమేలుకు ప్రత్యేక కమిటీ

>> ఉన్న అనుభవాలు, రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలను సమీక్ష సమావేశంలో చర్చించారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్లానింగ్ విభాగం కార్యదర్శి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. విత్తనాల పంపిణీ మొదలు పంట వేసినప్పటి నుంచే అన్ని గ్రామాల్లో రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, పంట ఉత్పత్తుల అంచనాలు, ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షి ంచడంతో పాటు ఈ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటుంది. ఏ రైతు ఏ పంట వేశాడు.. ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు కచ్చితంగా క్షేత్ర స్థాయి పరిశీలనతో నమోదు చేయాలని చెప్పారు. కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని చెప్పారు. రైతు వేదికల్లోనే సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి డేటా సేకరించాలని, ధాన్యం దిగుబడిపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. రైతు వేదికలను ఇకపై రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖతో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాల్లో వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని, రైతులకు ఉపయోగంగా ఉంటే మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యాప్ ద్వారా రైతులు బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. యూరియా పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ముఖ్యమంత్రి సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, వాస్తవ పరిస్థితిని వివరించాలని సూచించారు. అవసరమైతే మంత్రులు, ఎంపీల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని చెప్పారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వ్యాపారులకు తలొగ్గకుండా ఈ సారి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించిన కారణంగా మొక్క జొన్న కొనుగోళ్లతో వచ్చే నష్టం తగ్గించగలిగామని సీఎం వివరించారు. గతంలో రూ.13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని, ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభలదిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు.

# నేడు వరంగల్‌కు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బుధవారం వరంగల్‌కు వెళ్తున్నారు. వరంగల్‌లో పవన్‌కల్యాణ్ హనుమకొండలో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న బాలుడు నిరంజన్‌ని పవన్ పరామర్శించనున్నారు. నిరంజన్‌కు పవన్ కల్యాణ్ అభిమాన హీరో. ఆ బాలుడు తనకు పవన్ కల్యాణ్‌ను చూడాలని కోరికను వ్యక్తం చేసాడు. దాంతో విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్ వరంగల్ వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. నిరంజన్ కోరిక మేరకు వారి ఇంటికి పవన్ వెళ్లనున్నాడు.

# నిరూపిస్తే రాజీనామా

>> మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలియదని ప్రచారం చేయడం పూర్తిగా అబద్ధమని మంత్రి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ముగ్గురు మంత్రులతో , అధికారులతో అలాగే ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి సమీక్ష నిర్వహించిన అనంతరమే కొనుగోలు ప్రక్రియ చేపట్టామని తెలిపారు."ఇది మంత్రులకు తెలియకుండా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం కాదు. ప్రతి నిర్ణయం పారదర్శకంగా జరుగుతోంది" అని మంత్రి అడ్లూరి అన్నారు.కెంద్రీకృత కొనుగోలు విధానాన్ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, న్యాయస్థానం ఈ విధానాన్ని సమర్థించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గుర్తు చేశారు. టెండర్లన్నీ ఈప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా, సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించామని వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 2న విద్యార్థులకు అవసరమైన యూనిఫాం క్లాత్ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు ట్రంక్ బాక్సులు స్కూల్ బ్యాగులు బూట్లు, సాక్సులు బెడ్డింగ్ మెటీరియల్ నోట్‌బుక్స్ స్టేషనరీ కిట్లు పీటీ డ్రెస్ ట్రాక్ సూట్లు టైలు, బెల్టులు ఐడీ కార్డ్ వంటి 27 రకాల వస్తువుల కొనుగోలుకు ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచినట్లు తెలిపారు. బెడ్ షీట్లు, కార్పెట్లు, బ్లాంకెట్లు, టవల్స్ కొనుగోలు కోసం వచ్చిన టెండర్లలో పోటీ ప్రక్రియ అనంతరం ధరలను తగ్గించినట్లు తెలిపారు.బెడ్ షీట్ ధర రూ.425 నుండి రూ.405కు తగ్గించారనీ, కార్పెట్ ధర రూ.412 టవల్ ధరపై కూడా చర్చల అనంతరం తగ్గించారనీ తెలిపారు. బెడ్ షీట్లు మూడు లక్షలు 2.29లక్షలకార్పెట్లు 6.49లక్షల బ్లాంకెట్లు 1500 టవల్స్‌కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ మొత్తం కొనుగోలు విలువ రూ.70.86 కోట్లు అని వెల్లడించారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వ పాపమే

>>ప్రాధాన్యం ఇస్తోందని వారికి ఇప్పటికే రూ.140 కోట్ల మేర చెల్లింపులు జరిపామని వెల్లడించారు.3,4 రోజులలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటిసిఎం భట్టి విక్రమా ర్కతో సమావేశం ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల సమస్యలపై సమగ్ర చర్చ జరిపి, మూడు నెలల వ్యవధిలో పెండింగ్ బకాయిల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు.హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని రూ.10,410 కోట్ల వ్యయంతో ఆరు లేన్లు, రెండు సర్వీస్ రోడ్లతో విస్తరించనున్నట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, త్వరలో టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు.

# నేడు ఆరుట్ల టిపిఎస్‌ను ప్రారంభించనున్న సిఎం

## విద్యార్థులతో కలిసి రేవంత్‌రెడ్డి బ్రేక్‌ఫాస్ట్

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులతోపాటు బ్రేక్‌ఫాస్ట్ చేయనున్నారు. నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ఒకే క్యాంపస్‌లో విద్యను కొనసాగించనున్నారు. 1,814 మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో చదువు కుంటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వవిద్యకు కొత్తరూపు చూపించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా విద్యా సంస్కరణలు చేపట్టిన ప్రభుత్వం తొలి అడుగుగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు నాంది పలికింది. సిఎం రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)ను ముఖ్యమంత్రి రేవంత్ ఆరుట్లలో ప్రారంభించనున్నారు. బుధవారం ఉదయం 9:30 గంటలకు ఆరుట్లకు చేరుకోనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం పాఠశాలలోని డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, డైనింగ్‌హాల్, క్రీడా మైదానాలను పరిశీలించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జ్యోత్స్నా శివారెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూపుదిద్దుకుంది. ఇక్కడ విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించనున్నారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన జరగనుంది. ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతిక సహాయంతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా తెలంగాణ విద్యకు రోల్ మోడల్‌గా తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూపుదిద్దుకుంది. పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం నాలుగు పాఠశాలలను ఎంపిక చేసింది. మొదటి విడతలో రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల, మంచాల పాఠశాలలతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసింది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రజా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రంలో దశలవారీగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆధునిక వసతులు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, విద్యార్థులకు విశాలమైన ప్లేగ్రౌండ్స్, ల్యాబ్స్, గాలివెలుతురు పుష్కలంగా ఉండే తరగతి గదులు, లైబ్రరీ, జిమ్, డైనింగ్ హాల్స్‌తో పాటు క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, క్యారమ్స్ వంటి ప్రతి క్రీడకు సంబంధించిన మైదానాలను ఏర్పాటు చేశారు. ఆయా క్రీడలకు ప్రత్యేక శిక్షకులను కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో మొత్తం 1,814 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రీప్రైమరీ విభాగంలో 150 మంది, ప్రైమరీ స్కూల్‌లో 600 మంది, హైస్కూల్ రెండు విభాగాల్లో కలిపి 800 మంది, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 160 మంది, రెండో సంవత్సరంలో 104 మంది విద్యార్థులు ఉన్నారు. తల్లిదండ్రుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోలేక నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి టీపీఎస్‌లో నెలకొంది.

# జనగామ డిఇఒ చేసిన బదలీలను నిలిపివేయాలి

## పాఠశాల విద్య డైరెక్టర్‌కు టిఎస్ యుటిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా జనగామ జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) చేపట్టిన కెజిబివి ప్రత్యేక అధికారుల అక్రమ బదిలీలను రద్దు చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ డిమాండ్ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల కాంట్రాక్టు సిబ్బంది సర్వీసులను ఏప్రిల్ నుండి రెన్యువల్ చేయకుండా, రెన్యువల్ చేయాలంటే బదలీకి ఆప్షన్ పెట్టాలని స్పెషల్ ఆఫీసర్(ఎస్‌వో)లనుండి బలవంతంగా ఆప్షన్లు తీసుకుని మంగళవారం బదలీ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. పిజి సిఆర్టీలు, సిఆర్టీల బదలీలకు రంగం సిద్ధం చేస్తున్నారని, వారికి ఇప్పటికే వ్రాత పరీక్ష కూడా నిర్వహించారన్నారు. ఏ జిల్లాలో లేని సాంప్రదాయం జనగామ జిల్లాలో అమలు చేయడం పట్ల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, కెజిబివి సిబ్బంది బదలీలకు, రెన్యువల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సి ఉంటుంది కానీ జిల్లా స్థాయిలో బదలీలు చేసే అధికారం లేదన్నారు.

# గాంధీభవన్‌లో నేడు మంత్రి అజారుద్దీన్ ముఖాముఖి

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు గాంధీ భవన్ లో ప్రజలతో ముఖాముఖి కార్యాక్రమంలో పాల్గొననున్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన ఈ వినూత్నమైన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. అలాగే అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉంది. గతంలో ప్రతి బుధవారం గాంధీ భవన్ లో ఒక మంత్రితో ప్రజలకు ముఖాముఖి కార్యక్రమాలు కొనసాగించారు. ఇటీవల వివిధ కారణాలరీత్యా ప్రజలతో ముఖాముఖి చేపట్టలేదు బుధవారం నుంచి తిరిగి ప్రారంభం చేస్తున్నారు.

# పాఠశాల ప్రారంభం రోజే ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

**మిర్యాలగూడ, జూన్ 16, ప్రభాతవార్త:** విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలను బోధించాల్సిన ఉపాధ్యాయులే ప్రిన్సిపల్ ఛాంబర్ లో మాటల యుద్ధంతో మొదలుపెట్టి గాడి తప్పి గల్లాలు పట్టుకొని పరస్పరం దాడికి పాల్పడి కొట్టుకున్న ఘటన సీసీ కెమెరాల్లో ఘర్షణ దృశ్యాలు రికార్డు అవుతున్న అవేమి పట్టించుకోకుండా నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంటూ ఘర్షణకు దిగిన నేపథ్యంలో ఇద్దరు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సస్పెండ్ కు గురైన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పాఠశాల కళాశాల ప్రారంభం రోజే సస్పెండ్ కావడం గమనార్హం. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడు మోడల్ స్కూల్ ( పీఎం శ్రీ) లో టీజీటీ( గణితం) విజయ్ కుమార్, పీజీటీ( సివిక్స్) కోటయ్య ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కాగా ఈనెల 15 నుంచి స్కూల్స్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. దీంతో సోమవారం ఓ విద్యార్థి మోడల్ స్కూల్ లో ప్రవేశం పొందేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఎంపీసీ లేదా సీఈసీ విభాగంలో చేరాలన్న విషయమై తల్లిదండ్రులు, విద్యార్థి మధ్య చర్చ నడుస్తోంది. అయితే విద్యార్థికి గణితం రాదని సీఈసీలో చేరాలని ఓ ఉపాధ్యాయుడు విద్యార్థికి సూచించాడు. విద్యార్థుల ప్రవేశాల కు వేసిన కమిటీ నిర్ణయం మేరకు ప్రవేశాలు జరగాలని మరో ఉపాధ్యాయుడు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరువురు ఉపాధ్యాయుల మధ్య ప్రిన్సిపల్ ఛాంబర్ లోనే తీవ్ర వాగ్వివాదం జరిగి గల్లాలు పట్టుకున్నారు. ప్రిన్సిపల్ సమక్షంలోనే ఈ కొట్లాట జరగడంతో సదరు ప్రిన్సిపల్ జరిగిన సంఘటనపై పూర్తి వివరాలతో తెలంగాణ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస చారికి వాట్సప్ ద్వారా నివేదిక పంపించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన తెలంగాణ మోడల్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస చారి ఘర్షణకు పాల్పడిన ఉపాధ్యాయులు కోటయ్య, విజయ్ కుమార్ లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలోనే వీరిద్దరి మధ్య జరిగిన ఘర్షణ మిర్యాలగూడ గ్రామీణ పోలీస్ స్టేషన్ కు చేరడంతో నిర్వహించడంతో గొడవ తాత్కాలికంగా సద్దు మనిగింది. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాలయంలో ఉపాధ్యాయ తమ వ్యక్తిగత ప్రతిష్టకు పోయి వీధిరౌడీల్లా బాహాబహికి దిగటం డివిజన్ వ్యాప్తంగా చర్చ నీయంశ మైంది. ఈ విషయమై ప్రిన్సి పాల్‌ను వివరణ కోరగా ఫోన్ స్పందించలేదు.

# రెబెల్స్ రాజీనామాలపై హైకోర్టులో అన్నాడిఎంకె పిటిషన్

**చెన్నై, జూన్ 16:** తమిళనాడు ప్రతిపక్ష పార్టీ అన్నాడీఎంకే నుంచి తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలు అధికార పార్టీ తమిళగ వెట్రికళగంలో చేరిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ తిరుగుబాటు ఎమ్మెల్యేల వ్యవహారం కోర్టుకు చేరింది. రాజీనామా చేసిన నలుగురు ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదించడాన్ని సవాల్ చేస్తూ ఏఐడీఎంకే మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఏఐడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలను స్పీకర్ ఖాళీగా ప్రకటించారు. దాంతో ఆ నాలుగు నియోజకవర్గాలను ఖాళీగా ప్రకటిస్తూ స్పీకర్ జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలంటూ పార్టీ విప్ అగ్రి కృష్ణమూర్తి పేరిట పిటిషన్ దాఖలైంది. ఈ వివాదం తేలే వరకూ ఆ నాలుగు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ హైకోర్టును అభ్యర్థించారు. ఏఐడీఎంకే దాఖలు చేసిన పిటిషన్‌పై మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.వైద్యనాథన్ ధర్మాధికారి, న్యాయమూర్తి జి. అరుల్ మురుగన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసును జూన్ 17న విచారించాలని కోర్టు నిర్ణయించింది.

# పరిపాలనను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారు

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వారి అనుచర బృందం ఏది నోటికి వస్తే అది మాట్లాడే పరిస్థితికి చేరుకున్నారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నాయకులు అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్ర పరిపాలనను పూర్తిగా గాలికొదిలేశారని అన్నారు. ఎండాకాలంలో చేయాల్సిన పనులను వర్షాకాలంలో చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ప్రతి ఏడాది వర్షాలు వస్తాయని తెలిసినా, ముందుగానే రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలను సరిచేసి వర్షాకాలం వరకు ప్రజలను రక్షించే ప్రయత్నం చేయాలి. కానీ అలాంటి దూరదృష్టి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ఇవాళ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందంటే, అధికారుల సమావేశాల్లో ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏం చేయాలో, ఎలా చేయాలో చెప్పలేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. దాని పర్యవసానం ఏమిటంటే, తొలకరి చినుకులు పడంగనే ఆరుగురు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో కొత్తగా ఒక్క కొత్త ఇటుక వేసిన పాపానపోలేదన్నారు. ఒక ప్రాజెక్టు కట్టిందిలేదు. కానీ పేదల ఇళ్లను కూల్చివేయడంలో మాత్రం అత్యుత్సాహం చూపుతున్నారు. ఇది వారి నియంతృత్వ ధోరణికి పరాకాష్టగా కనిపిస్తుందన్నారు. ఇటీవల రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొని వచ్చారు. అక్కడ ఏ ఫైల్ సమర్పించారో, ఏ ప్రాజెక్ట్ నివేదిక ఇచ్చారో, తెలంగాణ కోసం ఏం కోరారో ప్రజలకు తెలియదు. కానీ తెలంగాణకు తిరిగి వచ్చిన తర్వాత మాత్రం గొడవలు పెట్టడం, రాజకీయ ఆరోపణలు చేయడం మాత్రమే చేస్తున్నారు. రాజకీయ అసహనం, ఫ్రస్ట్రేషన్ పూర్తిగా రేవంత్ రెడ్డిని ఆవహించిందన్నారు. ఏ విషయమైనా భారతీయ జనతా పార్టీపై, కేంద్ర ప్రభుత్వంపై, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అసహనం ఎందుకు వచ్చిందో కాంగ్రెస్ నాయకులనే అడిగితే చెబుతున్నారు. ప్రతి నెల ఏఐసిసికి కప్పం కట్టలేక ఇబ్బంది పడుతున్నారని, అదే సమయంలో రాష్ట్ర ఉద్యోగులకు నెలకు రూ.2,000 నుంచి రూ.3,000 కోట్ల వరకు జీతాలు చెల్లించడంలో కూడా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇది వారి పరిపాలన స్థితి అన్నారు.

# తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం వెంటనే చేపట్టాలి

## ఆ ప్రాంతాన్ని సందర్శించిన టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

## కార్మికుల దీక్షకు సంఘీభావం తెలిపిన వైనం

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రభాతవార్త :** కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి ప్రాంతాన్ని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ఆమె అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కట్టే ఉద్దేశం లేకనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి పేరుతో సాకులు చెబుతున్నారని విమర్శించారు. వాస్తవానికి 148 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు ఒప్పందం సిద్ధంగా ఉన్నట్లు ఆమె అన్నారు. ముఖ్యమంత్రి మాత్రం 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టాలని కాలయపాన చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని, యాజమాన్యం హైకోర్టులో దాఖలు చేసిన కేసును బేషరతుగా వెనక్కి తీసుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.



తుమ్మిడిహెట్టి ప్రాంతాన్ని సందర్శించిన టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

పేపర్ మిల్లు కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టిన దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్లు పునఃప్రారంభం వల్ల స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని భావించి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని గుర్తు చేశారు. మిల్లులో ఉన్న యంత్రాల విలువ కంటే ఎక్కువ మొత్తాన్ని వెచ్చించి పరిశ్రమను తిరిగి ప్రారంభించారని పేర్కొన్నారు. అయితే మిల్లు ప్రారంభమైన వెంటనే కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించారని ఆరోపించారు. మిల్లులో సుమారు 450 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు ఉన్నారని, కాంట్రాక్ట్ కార్మికుల్లో కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అధికంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ సాధన అనంతరం తీసుకొచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, ఆ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 27 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, అవి అమల్లోకి వస్తే కార్మికుల హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల పాత్ర బలహీనపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్మికులు ఇప్పటికే కోర్టులో విజయం సాధించినప్పటికీ యాజమాన్యం మళ్లీ హైకోర్టును ఆశ్రయించడం సరికాదన్నారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు పొందిన యాజమాన్యం కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. హైకోర్టులో వేసిన కేసును వెంటనే ఉపసంహరించుకుని కార్మికులకు తగిన వేతనాలు, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల తరఫున తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని, యాజమాన్యానికి కూడా కార్మికుల సమస్యలపై లేఖ రాస్తామని కవిత తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ముందుకు వస్తున్న తమకు కార్మికుల ఆశీర్వాదం, మద్దతు అవసరమని పేర్కొన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# విద్యార్థులను ఒత్తిడికి గురిచేసేలా నీట్ బందోబస్తు

## వుయ్ ది లీడర్స్ వ్యవస్థాపకుడు అన్నామలై

**చెన్నై, జూన్ 16:** బీజేపీకి రాజీనామా చేసి వుయ్ ది లీడర్స్ పేరుతో కొత్త రాజకీయ వేదికను ప్రారంభించిన తమిళనాడు నేత అన్నామలై తాజాగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈనెల21న నిర్వహించనున్న నీట్ రీటెస్ట్ కోసం చేపట్టిన భారీ భద్రతా ఏర్పాట్లు విద్యార్థుల్లో విశ్వాసం పెంచడం కంటే ఒత్తిడికి గురి చేసే ప్రమాదం ఉందని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఎన్నడూ లేని విధంగా భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు.



సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ భద్రత, భారత వైమానిక దళం ద్వారా ప్రశ్నపత్రాల రవాణా, ఏఐ ఆధారిత సీసీటీవీ పర్యవేక్షణ, బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ తనిఖీలు, పలుదశల తనిఖీలు వంటి చర్యలను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి ఏర్పాట్లు అత్యంత సున్నితమైన భద్రతా ఆపరేషన్లలో కనిపిస్తాయని, విద్యార్థుల పరీక్షలకు మాత్రం అరుదుగా ఉంటాయని అన్నారు. పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థులు ఇప్పటికే ఒత్తిడిలో ఉంటారని, ఇలాంటి కఠిన తనిఖీలు వారిలో మరింత ఆందోళన పెంచే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే పరీక్ష సమయాన్ని 180 నిమిషాల నుంచి 195 నిమిషాలకు పెంచడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ2020) లక్ష్యం విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించడమేనని, ప్రస్తుత చర్యలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. పరీక్షల పారదర్శకతను కాపాడుతూనే విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని అన్నామలై సూచించారు.

# కూటమి విజయాలను ప్రతి గడపకు చేర్చాల్సిన బాధ్యత టిడిపి కేడర్‌దే

- మంత్రి నుంచి బూత్ స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ జనంలోకి వెళ్లాల్సిందే
- 25నుంచి ఆగస్టు 10వరకు ప్రతి గడపకు వెళ్లి చేసిన మంచిని చెబుదాం
- సర్ ప్రక్రియలో ఒక్క ఓటు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత నాయకులదే
- టిడిపి ఎంపి, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో యువనేత లోకేష్ విడియో కాన్ఫరెన్స్

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రతిగడపకు వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత పార్టీ కేడర్‌పై ఉందని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయం నుంచి టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో లోకేష్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఈనెల 25నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 45రోజులపాటు ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి బూత్ స్థాయి వరకు నాయకులంతా రాష్ట్రంలోని ప్రతిగడపకు వెళ్లి చేసిన మంచిని చెప్పాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేలా ప్రతి ఇంటికి కరపత్రాలు, బుక్ లెట్లు అందించాలన్నారు. కూటమిలోని జనసేన, బీజేపీ కేడర్ ను కలుపుకొని వెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని, ఇది అధినేత చంద్రబాబు ఆదేశంగా ఆయన చెప్పారు.

చంద్రబాబునాయుడు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్, దీంతోపాటు గత రెండేళ్లలో పెద్దఎత్తున చేపట్టిన సంక్షేమాన్ని జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్‌పై ఉందన్నారు. తల్లికి వందనం, దీపం 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, దేశంలో మరేరాష్ట్రంలో లేనివిధంగా రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశా మన్నారు. చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతే మనం చేసిన కష్టం బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలిపోతుందని తెలిపారు. 2014-19 నడుమ చేసిన మంచిపనులను చెప్పుకోలేక పోవడం, ప్రత్యర్థుల విషప్రచారం వల్లే ఓటమి పాలయ్యామని లోకేష్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రతిగడపకు వెళతామని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విజయోత్సవ సభలు నిర్వహించి కూటమి ప్రభుత్వ విజయాలపై ప్రజలను జాగృతం చేయాలన్నారు. ఇప్పటికే ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలి, దీనిపై ఇప్పటికే కేడర్‌కు శిక్షణా తరగతులు నిర్వహించడంతోపాటు బీఎల్ఏలను కూడా నియమించామని తెలిపారు. ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులదేనని స్పష్టం చేశారు. శాసనసభ్యులు బీఎల్ఏలతో టచ్‌లో ఉండి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలి, ఎక్కడైనా సమస్య తీవ్రంగా ఉంటే పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఓటర్ వెరిఫికేషన్ సెల్‌ను సంప్రదించాలని లోకేష్ చెప్పారు.

# తెలంగాణలో మహిళలకు రక్షణ లేదు : గొంగిడి సునీత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 16:** రాష్ట్రంలో చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగాయి. ఆడ పిల్లల్ని కనాలంటే భయపడే పరిస్థితి రాష్ట్రంలో ఉందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితా మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మోదీ భేటీ బచావో భేటీ పడావో అంటారు. కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర హోం మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. ఫోక్సో కేసులు దేశంలో 6 శాతం నమోదు అయితే ఒక్క తెలంగాణలో 16శాతం ఫోక్సో కేసులు నమోదు అయ్యాయని విమర్శించారు. తెలంగాణలో క్రైమ్ రేట్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఇప్పటి వరకు సమీక్ష చేయలదని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ చిన్నారిపై దాడి చేస్తే పోలీసు వాళ్లు సెటిల్ మెంట్ చేశారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం అంటున్నారు.

**ముందు తెలంగాణలో చిన్నారులను కాపాడండి**

తెలంగాణలో మహిళలపై జరుగుతున్న దాడులు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీకి తెలియవా అని ప్రశ్నించారు. బండి భగీరథ్ కేసు విషయంలో తొలుత వీక్ సెక్షన్లు పెట్టారు. రాష్ట్రంలో మహిళలు రోడ్డు ఎక్కితే అప్పుడు సెక్షన్లు మార్చారని గుర్తు చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలపై పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలిన డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహిళలకు ధైర్యం ఉండేదన్నారు.

# రేరా ట్రైబ్యునల్ సభ్యురాలిగా విద్యుల్లత

## పట్టణాభివృద్ధి రంగ అనుభవానికి మరో గౌరవం



**విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:** పట్టణ ప్రణాళిక, నగరాభివృద్ధి రంగాల్లో విశేష అనుభవం కలిగిన సీనియర్ అధికారి విద్యుల్లతకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించనున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా ఆమెను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)గా పనిచేస్తున్న విద్యుల్లత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నట్లు తెలిసింది. తన సుదీర్ఘ ప్రభుత్వ సేవా కాలంలో ఆమె పట్టణాభివృద్ధి, నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజకీయాలకు అతీతంగా విధి నిర్వహణలో నిబద్ధత, పనితీరు, ఫలితాలపై దృష్టి సారించే అధికారిగా విద్యుల్లతకు మంచి పేరు ఉంది. క్లిష్టమైన పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు, ప్రణాళికా అంశాల్లో ఆమె చూపిన చొరవకు సహచర అధికారులు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభించాయి. రేరా ట్రైబ్యునల్‌లో టెక్నికల్ సభ్యురాలిగా ఆమె నియామకం జరిగితే, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన వివాదాల పరిష్కారం, సాంకేతిక అంశాల పరిశీలన, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసుల్లో ఆమె అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. ప్రభుత్వ పరిపాలనలో సమర్థత, వృత్తిపరమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన విద్యుల్లతకు ఈ బాధ్యత దక్కడం ఆమె సేవలకు లభించిన మరో గౌరవంగా భావిస్తున్నారు. రేరా ట్రైబ్యునల్ పనితీరు మరింత సమర్థవంతంగా మారడంలో ఆమె పాత్ర కీలకంగా ఉండనుందని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పదోన్నతి పొందిన అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు

**విజయవాడ, జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పదోన్నతి పొందిన పలువురు అదనపు ఎస్పీలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ మేరకు డిజిపి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అనకాపల్లి అదనపు ఎస్పీ కె.వి.మహేశ్, అదనపు ఎస్పీ ఈగల్‌గా చొక్కా శ్రీనివాసరావు, విశాఖ అదనపు డిసిపిగా పి.రామచంద్రరావు, అనంతపురం అడ్మిన్ అదనపు ఎస్పీగా ముత్యాల నాగభూషణం, తిరుపతి అదనపు ఎస్పీ శాంతి భద్రతలుగా జె.బాబు ప్రసాద్, తిరుపతి అదనపు ఎస్పీ అడ్మిన్‌గా ఆర్ల శ్రీనివాసులు, తిరుపతి క్రైమ్ అదనపు ఎస్పీగా డి.బాలచంద్రారెడ్డిని నియమించారు. పదోన్నతి పొందిన పోలీసు అధికారులు వెంటనే విధుల్లో చేరవలసి ఉంటుంది.

# ఐదు దశాబ్దాల తర్వాత లేటు వయసులో కలుసుకున్న భార్యాభర్తలు

**పాట్నా, జూన్ 16:** ఐదు దశాబ్దాల కాలం అర్ధాంగి కోసం ఆ భర్త కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురు చూశాడు. ఆమె జ్ఞాపకాలతోనే కాలం వెళ్లదీస్తూ మరో పెళ్లి చేసుకోకుండా ఉండి పోయాడు. 48 ఏళ్ల క్రితం ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయిన భార్య ఇంటి ముందు ప్రత్యక్షమైంది. మొదట్లో ఆమెను గుర్తు పట్టలేకపోయిన ఆ భర్త భార్య చేతి మీద ఉన్న టాటూను చూసి ఆమెనే తన అర్ధాంగి అని తెలుసుకున్నాడు. ఆమెతో ఉన్న పిల్లలు తన పిల్లలే అని గుర్తించి అందరినీ ఒక్కసారిగా హత్తుకున్నాడు. ప్రస్తుతం బీహార్‌లోని బరియార్‌పూర్ గ్రామానికి చెందిన లలన్ మిశ్రాకు 1977 మార్చిలో నిర్మలా దేవితో ఎంతో వైభవంగా వివాహం జరిగింది. మొదట్లో వీరి కాపురం బాగానే సాగగా ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు.



ఇలా హాయిగా సాగుతున్న వీరి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. దీంతో 1983లో నిర్మలా దేవి తన ఇద్దరు పిల్లలతో సహా భర్తను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. కానీ అక్కడ తోబుట్టువుల నుంచి సమస్యలు ఎదురు కావడంతో పుట్టింటిని సైతం వదిలేసి వేరే రాష్ట్రానికే వెళ్లిపోయింది. ముఖ్యంగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లిపోయింది. నిర్మలా దేవి బాగా చదువుకోవడంతో ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరి తన పిల్లలను పెంచుకుంది. ఇక అప్పటి నుంచి ఆమె పిల్లలతో కలిసి నాగ్‌పూర్‌లోనే స్థిరపడింది. టీచర్‌గా సేవలు అందిస్తూనే పిల్లకు మంచి చదువులు చెప్పించుకుని, వారికి ఉద్యోగాలు కూడా వచ్చేలా చేసి వారికి పెళ్లిళ్లు సైతం చేసింది.

అటు భార్య ఇల్లు వదిలి వెళ్లిన తర్వాత లలన్ మిశ్రా తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. చుట్టుపక్కల గ్రామాలన్నీ వెతికినా నిర్మల ఆచూకీ దొరకలేదు. భార్య వియోగంలో లలన్ మిశ్రా తనకు ఉన్న మంచి ఉద్యోగాన్ని కూడా వదిలేశాడు. దాదాపు మూడు నెలల పాటు పిచ్చి వాడిలా రోడ్లపై తిరుగుతూ గడిపాడు. భార్య మీద ఉన్న ప్రేమతో రెండో పెళ్లి కూడా చేసుకోకుండా ఇంట్లోనే ఉండిపోయాడు. రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాల పాటు ఇంట్లోనే ఉంటూ ఎప్పుడూ భార్యా పిల్లల కోసం బాధ పడుతూనే ఉన్నాడు.

మొదట్లో కొన్నేళ్ల పాటు వెతికినప్పటికీ నిర్మల, పిల్లలు దొరక్కపోవడంతో.. ఏదో ఒక రోజు తన భార్యే తన ఇంటికి వస్తుందనే నమ్మకంతో ఎదురు చూస్తూనే ఉన్నాడు. కానీ ప్రస్తుతం అతడి జీవితం చరమాంకానికి చేరగా భార్య ఇంటికొస్తుందనే ఆశలు సన్నగిల్లాయి. కానీ అప్పుడే ఓ అద్భుతం జరిగింది. ముఖ్యంగా వృద్ధాప్యంలోకి అడుగు పెట్టిన నిర్మలాదేవికి కూడా తన భర్త మీద ప్రేమ చావకపోవడంతో ఇకనైనా ఆయన్ను చూడాలాని నిర్ణయించుకుంది. అందుకోసం ఆమె నేరుగా పట్నాలోని బఖ్తియార్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, పోలీసుల సాయంతో భర్త లలన్ మిశ్రా ప్రస్తుత వివరాలను తెలుసుకుంది. అనంతరం పోలీసులతో కలిసి నేరుగా తన మెట్టినింటి గుమ్మం ముందుకు వెళ్లి నిలబడింది. దాదాపు 48 ఏళ్లు గడిచిపోవడంతో శారీరక మార్పుల వల్ల ఇంట్లో ఉన్నవారెవరూ, చివరకు భర్త లలన్ కూడా ఆమెను గుర్తు పట్టలేకపోయారు. కానీ పెళ్లయిన కొత్తలో భర్త మీద ప్రేమతో నిర్మల ఓ టాటూ వేయించుకుంది. దాన్ని ఇప్పుడు లలన్ మిశ్రాకు చూపించింది. ఆ పచ్చబొట్టును చూడగానే లలన్‌కు పాత జ్ఞాపకాలన్నీ గుర్తొచ్చాయి. ఎదుట ఉన్నది తన భార్యేనని నిర్ధారించుకుని, ఒక్కసారిగా కన్నీరు మున్నీరయ్యాడు. ఐదు దశాబ్దాల విరహ వేదనను మరిచిపోతూ వృద్ధ దంపతు లిద్దరూ ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకుని ఏడ్చేశారు. వారి పునఃకలయికను చూసి గ్రామానికి వచ్చిన పోలీసుల కళ్లు కూడా చెమ్మగిల్లాయి. జీవిత ప్రయాణంలో కోల్పోయిన ఒంటరితనానికి భాగస్వామి దొరకడంతో మిశ్రా కుటుంబంలో మళ్లీ పండగ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

వార్త

చెవిటి వాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు. మంచి మాట వినని వాడు.

-ఆది శంకరాచార్యులు

# చిక్కుముడులు వీడినట్లేనా?

ఇల్లలకగానే కాదు ముందుంది ముసళ్ల పండుగ అన్న చందాన పశ్చిమాసియాలో శాంతి వీచికలకు ఇంకా టైం పట్టేట్టుంది. అయితే శాంతి ప్రక్రియ మొదలైంది కనుక కనుచూపు మేరలో యుద్ధానంతర ప్రభావాలు ఒక్కటొక్కటీ కనుమరుగై యుద్ధ విరమణ పర్యవసానాలు వెలుగులోకి వస్తాయని ఆశపడ్తుంటారు. యుద్ధ విరమణకు సానుకూల ఒప్పందం తుదిరూపు దిద్దుకుందనగానే భారతీయుల్లోనే కాదు యుద్ధ ప్రభావిత దేశాల్లో కూడా ఎంతో సంతోషం వ్యక్తమైంది. హార్మూజ్‌జలసంధి మార్గంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు సాఫీగా జరిగితే బావుంటుందనే ఆలోచన మదిలో మొలకెత్తుతుంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 4.7 శాతం తగ్గి 84 డాలర్లకు దిగువకు చేరింది. యుద్ధ నేపథ్యంలో క్రూడాయిల్ ధర 125 డాలర్లకు తాకడమే చెప్పుకోదగిన విపరిణామం. యుఎఇ, ఖతార్, కువైట్, బహ్రెయిన్ సౌదీ అరేబియా దేశాలపై ఇరాన్ దాడులకు తెగబడడంతో ముడి చమురు, సహజవాయులు తయారీ, సరఫరాకు ఆటంకమేర్పడింది. చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి తెరుచుకుంటోందంటేనే ప్రభావిత దేశాలు సంబరపడ్డాయి. అమెరికా ఇరాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందానికీ తమకూ సంబంధం లేదంటూ లెబనాన్‌పై ఇజ్రాయిల్ విరుచుకుపడటమొక్కటే ఈ ఒప్పందం ఎంతవరకు అమలులోకి వస్తుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయినా స్వయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన భరోసాతో ఒప్పందాలు సంతకాల వరకు వచ్చాయి. చమురు ధరలు దిగిరావడంతో మదుపరుల్లో కాస్తంత ఊరట కలిగింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు బ్యారెల్ ముడిచమురు ధర 70 డాలర్ల వద్ద ఉండేది. మళ్లీ ఆ రేటును చేరుకుంటే తప్ప మార్కెట్ల మాయాజాలం నుంచి బయటపడడం. అలా జరిగినా రిటైల్ ధరలు తక్షణమే అదుపులోకి వస్తాయని కానీ, అనేక కారణాల చేత ప్రభావితమైన ధరలన్నీ ఆగమేఘాల మీద తగ్గిపోయే పరిస్థితి ఉంటుందని కానీ చెప్పలేం. యుద్ధం వెంబడి నిత్యావసర వస్తువులు ఆకస్మికంగా కొండెక్కాసాయి. అలా అని యుద్ధ విరమణ తర్వాత అంతే స్పీడ్‌లో ధరలు తగ్గించే యంత్రాంగమేదీ లేదు. అంతే వేగంగా పనిచేసే పరిస్థితి ఏర్పడదు. ఇంకా ధరలు పెరిగినా పాత స్టాక్‌లున్నాయి కనుక మరి కొన్నాళ్లు ధరలు తగ్గించలేరు. మరికొంత కాలం వినియోగదారుని నెత్తిన ధరల భారం తప్పదు. ఈలోగా ఈనాటి శాంతి ఒప్పందం నరపపంచ ఇంధన మార్కెట్లకు శుభపరిణామమే కావచ్చు కాని సామాన్య వినియోగదారునికి మాత్రం తీవ్ర మనోవేదనే. ఈ ఒప్పందాలన్నీ సజావుగా అమల్లోకి వచ్చినా హార్మూజ్ జలసంధి తెరచుకోవడమే కాదు. అక్కడ జలాల్లో దాచిన మందుపాతరలు (సీమైన్స్) తొలగించడం, డ్రోన్ భద్రతలను ఉపసంహరించుకుంటే తప్ప, అక్కడే ఆగి ఉన్న 500 నౌకలు జలసంధి మార్గం నుంచి తమ సొంతదేశ సముద్ర జలాల్లోకి మరలవు. దానికీ దీర్ఘకాలమే పట్టొచ్చు. గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న ఆ వాణిజ్య నౌకలన్నీ ఆయా దేశాలకు 'చేరిపోతే తప్ప' అలజడి తగ్గదు. భారత్ తన చమురు అవసరాలకు గల్ఫ్ దేశాల మీదనే ఆధారం. హార్మూజ్ తెరవగానే మరో మూడు నెలలకైనా చమురు తగ్గినా పాత ధరల అమల్లో ఉంటాయి. క్రమేపీ రవాణా ఖర్చులు తగ్గుతాయి. దానిపై ఎంతో కొంత ధరల తగ్గింపు ఉంటుంది. సామాన్యుడి వంటింటి ఖర్చు తగ్గుతుంది. చమురు విరివిగా, చౌకగా దొరికే అవకాశముంటే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. అదే జరిగితే 'కిచెన్ బడ్జెట్' తేలికవుతుంది. ఇంధన ధరలపై ప్రతికూల ప్రభావం కూడా తగ్గుతుంది. మొత్తానికి దిగుమతుల వ్యయం తగ్గడం వినియోగదారునికి ఊరటే. ఇరాన్ అణ్వాయుధీకరణపై ఇంకా అనిశ్చితి ఉండనే ఉంది. ప్రతిష్టంభనలో ఉన్న ఇరాన్ నిధులను అమెరికా డీఫ్రీజ్ చేయడం కూడా ముఖ్యమే. అసలు సిసలు 'పీఠముడి' ఈ రెండు అంశాలపైన ఉంది. ఈవ్యవహారంలో ఒప్పందం నాటి షరతుల మేరకు సజావుగా సాగితేనే పరిష్కారాలు ఫలవంతమౌతాయి. శాంతి వచనాలు వినేందుకు 19న స్విట్జర్లాండ్‌లోని జెనీవా అధికారిక కార్యక్రమంలోనే బయటపడతాయి. దాదాపు నాలుగు నెలల పశ్చిమాసియా కల్లోలానికి అంతిమఘడియలు సమీపించాయి. కానీ అన్నిదేశాలు, అన్నిషరతుల పాటింపు వంటిఅంశాలు కొలిక్కి వచ్చేసరికి మరికొన్ని నెలలు పట్టొచ్చు. తాజా అవగాహన అమలు జరిగితే పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాల పునరుద్ధరణ, నౌకాయాన, స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశమేర్పడ్తుందని భారత్ తరపున ప్రధాని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శాంతియుత పరిష్కారం ద్వారా ఓ కీలకమైన అడుగుపడటం పట్ల ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ గుటెరస్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రాంతీయ స్థిరత్వానికి ప్రస్తుత శాంతి ఒప్పందం దోహదపడగలదని భావిస్తున్నట్లు యూరోపియన్ కమిషన్‌అధ్యక్షురాలు ఉరులాఅభిభాషణ. ప్రస్తుతం ఒప్పందవిశేషాలకు వర్చువల్ సంతకాల ద్వారా ఆమోద ముద్ర పడింది. హార్మూజ్ జలసంధిపై ఇరాన్ ఒమన్ దేశాలకున్న సార్వభౌమాధికారం విషయంలో అమెరికా స్పష్టతనివ్వడంలో ఇరాన్ కాస్త మెతకబడినట్లు ఉంది. ఒప్పందంపై డిజిటల్ సంతకాలు చేసినమరునాడు చమురుతో ఆయా దేశాల నౌకలు కదలికలు ప్రారంభమయ్యాయి. ఆది నుంచి అంతంవరకు శషభిషలు లేకుండా, ఒప్పందాలను చిక్కుముడులు పడకుండా అమలు చేయగలిగితే ప్రపంచానికే శుభపరిణామం కాగలదు.



అంధుని చేతికి ఆసరాగా ఊతకర్ర ఎంత అవసరమో, ఆపదలో ఉన్న వారికి ధైర్యం అంత అవసరం.

రామకృష్ణ పరమహంస



ఏ విషయమైనా కొత్తగా ఉన్నప్పుడే బాగుంటుంది. కాని స్నేహం మాత్రం పాతబడిన కొద్దీ బాగుంటుంది.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య

# సామాన్యుడికి భారంగా ప్రైవేట్ చదువు!

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం వంటి అవకాశాలను పెంచితే ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇలాంటి కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల నియంత్రణకు ముక్కు తాడు వేసినట్టు అవుతుంది. 'విద్యవ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత' అనే భావనతో ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేస్తేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల మోతకు అడ్డుకట్ట పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ కాపాడే విధానాలు అవసరం. విద్య వ్యాపార వస్తువు కాదు. అది సమాజాన్ని తీర్చిదిద్దే శక్తి. విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రైవేటు పాఠశాలల ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది.**



డా.మోటె చిరంజీవి

విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి విద్యే పునాది. అయితే నేటి పరిస్థితుల్లో విద్య హక్కు కంటే వ్యాపారంగా మారిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. కానీ కాలక్రమేణా ప్రైవేటు విద్యాసంస్థల సంఖ్యపెరిగింది. నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ మాధ్యమం, ఆధునిక సదుపాయాల పేరుతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొన్ని విద్యాసంస్థలు ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల పెంపు తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా ఛార్జీలు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో వేల నుంచి లక్షల రూపాయల వరకు వసూలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడంతా జనాలు అమ్మో జూన్ నెల అనుకుంటున్నారు. ఇటు స్కూల్ ఫీజుల మోత మొదలైంది. ఇప్పటికిప్పుడు పాఠశాలల్లో ఎంతో కొంత ఫీజు కట్టాల్సి ఉంటుంది. మరోవైపు రైతన్నలకు పెట్టుబడి ఖర్చుల దిగులు పట్టుకుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఏటా 10 శాతం నుండి 15 శాతం వరకు ఫీజులను పెంచుతూ తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ నెలలో పాఠశాలల పునఃప్రారంభం వేళ అడ్మిషన్ల పేరుతో, పుస్తకాలు, డ్రెస్సుల పేరుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను నిలువునా దోచుకుంటున్నారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి, పొదుపులను ఖర్చుచేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉంటే ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతోంది. కొంతమంది తల్లిదండ్రులు ఫీజుల కోసం వ్యక్తిగత రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సగటు వార్షిక ఫీజు రూ. 41,475 దాటిపోయింది. ఇది రాష్ట్రంలోని కనీస బీటెక్ ఫీజు (రూ.36,000) కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. గ్రామాల్లో సైతం సగటు స్కూల్ ఫీజు రూ. 35,104గా నమోదవుతోంది. పట్టణాలకు, గ్రామాలకు తేడా కేవలం ఆరువేల రూపాయలు మాత్రమే. ఎల్‌కేజీ, యూకేజీ చదువులకే కనీసం రూ.30,000 నుండి రూ. 50,000 వరకు వసూలు చేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులకైతే ఈ భారం రూ.80,000 పైమాటే. అదనపు వసూళ్ల దోపిడీ పుస్తకాలు, యూనిఫాంలదందా కనిపిస్తుంది. నిబంధనల ప్రకారం స్కూళ్లలో పుస్తకాలు అమ్మకూడదు. కానీ, ఐటీఐ ఒరియంటెడ్, ఐఐటీ లేదా నీట్ సిలబస్ పేరుతో ప్రైవేట్ పబ్లికేషన్ల పుస్తకాలను రూ. 10,000 నుండి రూ.12,000కు విక్రయిస్తున్నారు. కేవలం ట్యూషన్ ఫీజే కాకుండా యూనిఫాం, షూస్ కోసం రూ.4,000, స్కూల్ బస్సు ఛార్జీల కింద నెలకురూ.2,000 నుండిరూ. 3,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. జూన్ నెలలో ఇద్దరు పిల్లలున్న ఒక మధ్యతరగతి కుటుంబం కేవలం చదువుల కోసమే ఒకేసారి రూ. 1,00,000 నుండి రూ.1,50,000 వరకు సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ చట్టంపై ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత కరవైంది. దీనివల్ల సుమారు 11వేల ప్రైవేటు స్కూల్స్‌లోని 32 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈభారాన్ని మోయాల్సి వస్తోంది. బోర్డుల ప్రదర్శన లేదు. పాఠశాలలో ఎంత ఫీజు వసూలు



చేస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలున్నాయి అనే వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలనే విద్యాశాఖ నిబంధనలను ఏ పాఠశాల పాటించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని బడులు కూడా తామేం తక్కువకాదంటున్నాయి. ఈ స్కూళ్లల్లో సగటు ఫీజు రూ.35,104గా ఉంది. అంటే పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ బడుల ఫీజులకు తేడా ఆరువేలే కావడం గమనార్హం. ఈ వివరాలు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించినవే. అసెంబ్లీకి సమర్పించిన సోషియో ఎకనామిక్ సర్వేలో ఈ వివరాలు సర్కార్ పొందుపరిచింది. ప్రాంతాలవారీగా, యాజమాన్యాల వారీగా సగటు ఫీజుల వివరాలు సర్కార్ ఈ నివేదిక ద్వారా వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వబడుల్లో తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు రూ.2,286మాత్రమే. అదే ఎయిడెడ్ బడుల్లోని తల్లిదండ్రులు రూ.28,420, ఇతర బడుల్లో రూ.4,907, నాన్‌గవర్నమెంట్ స్కూళ్లల్లో రూ.34,012 చొప్పున ఖర్చుచేస్తుండగా అదే ప్రైవేట్ బడుల్లోని తల్లిదండ్రుల వ్యయం రూ.35,104గా ఉంది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లోని సర్కార్ స్కూళ్ల్లో తల్లిదండ్రులు చేస్తున్న ఖర్చు రూ.3,963 మాత్రమే. అదే ఎయిడెడ్ బడుల్లోని తల్లిదండ్రులు రూ. 32,951, ఇతర బడుల్లో రూ.3,260, నాన్ గవర్నమెంట్ స్కూళ్లల్లో రూ. 38,884 చొప్పున ఖర్చుచేస్తుండగా అదే ప్రైవేట్ బడుల్లోని తల్లిదండ్రుల వ్యయం రూ.41,475గా ఉంది. విద్యాసంస్థలు కూడా తమవైపు నుంచి కొన్ని కారణాలను చెబుతున్నాయి. ఉపాధ్యాయుల వేతనాలు, భవన నిర్వహణ, విద్యుత్, సాంకేతిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు వంటి ఖర్చులు పెరిగాయని పేర్కొంటున్నాయి. అయితే ఈ ఖర్చుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడం సమంజసమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ఈ అంశంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరంఉంది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణకు స్పష్టమైన విధానం రూపొందించాలి. ఫీజుల పెంపుపై పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా పెరుగుతున్న ఫీజులను నియంత్రించడానికి ప్రభుత్వం పలు కఠినమైన పారదర్శకమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర స్థాయిలో స్వతంత్ర ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేసి, ప్రతి పాఠశాల వసూలు చేసే ఫీజులను పరిశీలించి ఆమోదించాలి. ప్రతి సంవత్సరం ఫీజుపెంపునకు గరిష్ఠ పరిమితి నిర్ణయించాలి. నిర్దిష్టశాతం కంటే ఎక్కువ పెంపు చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలి. పాఠశాలలు తమ ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డులోతల్లిదండ్రులకు ముందుగానే వెల్లడించేలా నిబంధనలు అమలు చేయాలి. అడ్మిషన్ ఫీజు, డొనేషన్, డెవలప్‌మెంట్ ఫండ్, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేయకుండా కఠినచర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు పాఠశాల సూచించిన దుకాణాల నుంచే కొనాలనే బలవంతాన్ని తొలగించి, ఎక్కడైనా కొనుగోలు చేసే స్వేచ్ఛ కల్పించాలి. జిల్లా స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. ప్రైవేటుపాఠశాలల ఆదాయం వ్యయాలపై ప్రతి సంవత్సరం ఆర్థిక ఆడిట్ నిర్వహించి, నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై జరిమానాలు విధించడం, గుర్తింపు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఫీజుల నిర్ణయంలో తల్లిదండ్రుల ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం వంటి అవకాశాలను పెంచితే ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇలాంటి కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటేనే ప్రైవేటు బడుల్లో ఫీజులనియంత్రణకు ముక్కు తాడు వేసినట్టు అవుతుంది. 'విద్యవ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత' అనే భావనతో ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేస్తేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల మోతకు అడ్డుకట్ట పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ కాపాడే విధానాలు అవసరం. విద్య వ్యాపార వస్తువు కాదు. అది సమాజాన్ని తీర్చిదిద్దే శక్తి. విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రైవేటు పాఠశాలల ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థికస్థితి రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. ●

# స్పష్టతే న్యాయానికి నిజమైన బలం

తరిగోపుల నారాయణస్వామి

భారత పార్లమెంటు ద్వారా రూపొందించబడే ప్రతి చట్టం ప్రజల జీవన విధానంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అయితే ఆ చట్టం ఎప్పటి నుంచి అమలులోకి వస్తుంది? 'ఎవరికి వర్తిస్తుంది?', గత ఘటనలకు కూడా వర్తిస్తుందా లేదా?' వంటి అంశాలు స్పష్టంగా చట్టంలో పొందుపరచబడకపోతే న్యాయవ్యవస్థలో, పరిపాలనలో, ప్రజల జీవితాలలో అనేక గందరగోళాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు మూలకారణం చట్ట నిర్మాణ సమయంలో ప్రారంభ తేదీ, వర్తింపు పరిధులను అత్యంత స్పష్టంగా పేర్కొనకపోవడమే. ప్రజాస్వామ్యంలో చట్టం రూపొందించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత. అందువల్ల ప్రతి చట్టంలో ఈ చట్టం ఫలానా తేదీ నుంచి అమలులోకి వస్తుంది. ఈ తేదీ తర్వాత జరిగే నియామకాలు, సంఘటనలు లేదా లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది అనే అంశాలను స్పష్టంగా పేర్కొనడం తప్పనిసరి చేయాలి. ఇది కేవలం సాంకేతిక అంశం కాదు, ప్రజల న్యాయ హక్కుల రక్షణకు సంబంధించిన మౌలిక అవసరం. చట్టంలో స్పష్టత లేకపోతే న్యాయస్థానాలు చట్ట ఉద్దేశ్యాన్ని విశ్లేషించి వ్యాఖ్యానించాల్సి వస్తుంది. కొన్ని సందర్భాలలో ఆ వ్యాఖ్యానాలు చట్టం అమలులోకి రాకముందు ఉన్న పరిస్థితులకు కూడా వర్తించేలా మారవచ్చు. దీనివల్ల ప్రజలు, ఉద్యోగులు, సంస్థలు అనిశ్చితికి గురవుతారు. ఉదాహరణకు విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ అర్హత పరీక్ష అంశంపై అనేక న్యాయ వివాదాలు తలెత్తాయి. కొత్త అర్హతలు పాత నియామకాలకు వర్తిస్తాయా లేదా అనే ప్రశ్న కోర్టుల ముందుకు వెళ్లింది. చట్టం వర్తింపు పరిధి మరింత స్పష్టంగా ఉండి ఉంటే ఇలాంటి వివాదాలు చాలా వరకు నివారించబడేవి. అలాగే సమాచార హక్కు చట్టం, వస్తు సేవల పన్ను చట్టం, దివాలా చట్టం ఆధార్ చట్టం, వివిధ భూ సంస్కరణ చట్టాలు వంటిఅనేక చట్టాల అమలులో కూడా ప్రారంభదశలో వ్యాఖ్యాన భేదాలు, అమలు గందరగోళాలు, న్యాయ వివాదాలు కనిపించాయి. ఈ ఉదాహరణలన్నింటిలో ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. చట్టం ప్రారంభ తేదీ, వర్తింపు పరిధి, గతానికి వర్తింపు అంశాలు ఎంత స్పష్టంగా ఉంటే అంత తక్కువ వివాదాలు ఉంటాయి. స్పష్టత లేకపోతే కోర్టులు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. దీనివల్ల సంవత్సరాల పాటు కేసులు కొనసాగి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటికే అమలులో ఉన్న కొన్ని చట్టాలలో ఈ విధమైన అనిశ్చితి లేదా సందిగ్ధత ఉంటే, ప్రజాప్రతినిధులు వాటిని అలాగే వదిలేయకుండా సవరణలు చేయాలి. అవసరమైతే చట్ట సవరణ ద్వారాఈ చట్టం ఫలానా తేదీ నుంచి అమలులో ఉన్నవారికే వర్తిస్తుంది, లేదా ఈ తేదీకి ముందు జరిగిన సంఘటనలకు వర్తించదు అనేస్పష్టమైన నిబంధనలను చేర్చాలి. ఇలా చేస్తే సంబంధిత వర్గాల ప్రజలు, ఉద్యోగులు, సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయి. అంతేకాకుండా న్యాయస్థానాలపై పడుతున్న భారం కూడా తగ్గుతుంది. ప్రజాస్వామ్యంలో మంచి చట్టం అంటే కఠినమైన చట్టంకాదు, స్పష్టమైన చట్టం. ప్రజలు, అధికారులు, న్యాయస్థానాలు ఒకే విధంగా అర్థం చేసుకునే చట్టమే ఉత్తమ చట్టం. అందువల్ల భవిష్యత్తులో రూపొందించే ప్రతి చట్టంలో ప్రారంభ తేదీ, వర్తింపు పరిధి, గతానికి వర్తింపుపై స్పష్టమైన నిబంధనలు తప్పనిసరి చేయాలి. అలాగే ఇప్పటికే ఉన్నసందిగ్ధ చట్టాలను సవరించి స్పష్టత తీసుకురావాలి. చట్టం ప్రజల కోసం ఉండాలి, ప్రజలను అయోమయంలో పడేయడానికి కాదు. స్పష్టతే న్యాయానికి నిజమైన బలం. ●

# 'కాక్రోచ్'ల అపర సృష్టి మస్క్‌దేనా?



సరికొండ రవీంద్రనాథ్

భారతదేశంలోనే కాదు యూరప్‌తోసహా అనేక దేశాల్లో కాక్రోచ్ పుట్టలను సృష్టించిన చరిత్ర ఎలాన్ మస్క్‌ది. పారిస్ నుంచి ఢిల్లీ వరకూ, బ్రస్సెల్స్ నుంచి మలేషియా వరకూ అన్నిదేశాలూ మస్క్‌వల్ల ఎదోరకమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అనేక దేశాలు మస్క్ ఆన్‌లైన్ ఫ్లాట్ ఫాంలను నిషేధించాయి. ఎఐ వేదిక గ్రోక్ ద్వారా ప్రముఖుల అశ్లీల వీడియోలు చేసి అపఖ్యాతిపాలు చేయడం. ఇదే ఎలైన్ మస్క్ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల అజెండా. ప్రముఖులు ఎప్పుడు తన దుష్ప్రచారానికి దొరుకుతారా అని ఎదురుచూస్తున్న మస్క్‌కు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ 'కాక్రోచ్' వ్యాఖ్యలు అవకాశంగా దొరికాయి. అయితే ఆయన తన ఉద్దేశ్యం గురించి వివరణ కూడా ఇచ్చారు. ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే అకౌంట్ ఓపెన్ చేయడం రెండు లక్షల ఫాలోవర్స్ రావడం రాత్రికి రాత్రి జరిగిపోయింది. మొదట ఎక్స్‌లో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో అభిజీత్ దీప్కే అకౌంట్ ఓపెన్ చేయగానే ఫాలోయర్లు రెండు లక్షల మందికి పెరిగిపోయారు. అసాధారణంగా ఫాలోయర్లు పెరగడం, మరో వైపు, వివాదానికి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కేంద్ర బిందువు కావడంతో భారత దేశ హోం శాఖ అప్రమత్తమై ముందు జాగ్రత్తగా అకౌంట్‌ను తాత్కాలికంగా సీజ్ చేయించింది. తర్వాత దీని వివరాలు తెలుసుకుని అకౌంట్‌ను కొనసాగించడానికి అనుమతించారు. కాక్రోచ్ జనతా పార్టీ సీజ్ కావడంతో కాక్రోచ్ ఈజ్ బ్యాక్ అనే పేరుతో ఎక్స్‌లోనే మరో అకౌంట్‌ను అభిజీత్ ప్రారంభించాడు. మస్క్ ఎక్స్ వ్యవహార శైలిపై ఇప్పటికే దేశంలో అనేక ఫిర్యాదులున్నాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించే పోస్టులను తొలగించాలని సహాయోగ్ సెన్సార్ విభాగం కోరినా మస్క్ ఎక్స్ ఖాతరు చేయలేదు. దీనితో మస్క్ ఎక్స్‌కు హోం శాఖ ఈ ఏడాది జనవరి రెండోతేదీన నోటీసులు జారీ చేసింది. ఆ కడుపు మంటతోనే మస్క్ కాక్రోచ్ ఉద్యమానికి భారీ ప్రచారాన్ని ఇచ్చినట్టు అనుమానిస్తున్నారు. భారత హోంశాఖ 'ఫేక్' ఫాలోయర్స్ పై విచారణ మొదలు పెట్టడంతో ఎక్స్‌పై ప్రభుత్వ చర్య ప్రారంభం అవుతుందన్న అనుమానంతో కావచ్చు. అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌కు మార్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పది రోజుల్లో రెండు కోట్ల మంది ఫాలోయర్స్ చేరారు. ఇది అసాధారణమైన పెరుగుదలగానే సైబర్ నిపుణులు భావిస్తున్నారు. సాధారణంగా కంపెనీల మార్కెటింగ్ కుట్రలు, కుతంత్రాలకు ఉపయోగించే బోట్ నెట్ వర్క్‌లు, ఎక్స్‌మేటా డేటా సెంటర్లు అల్ గోరథమ్స్ ప్రమోషన్ ద్వారా ఫేక్‌లతో ఫాలోయర్ల సంఖ్య అసాధారణంగా పెంచుతారు. ఎలాన్ మస్క్, ట్రంప్ లాంటి వారు కావాలనుకుంటే డేటా సెంటర్లలోనే ఆలోరిథమ్స్‌లో మాయ చేయడం కష్టమేమీ కాదు. ఇటువంటి కుట్రల కోసమే సోషల్ మీడియా ఫ్లాట్ ఫాంలను అమెరికా ఉపయోగించుకుంటోంది. బోట్ నెట్ వర్క్‌లు, ఆటో కంప్యూ టరైజ్డ్ ప్రాసెస్ లేకపోతే పది రోజుల్లో కోటి నలభై



లక్షల 'వర్టికల్ గ్రోత్' సాధ్యం కాదని సైబర్ నిపుణుల అంచనా. దేశ రాజధానిలో జరిగిన కాక్రోచ్‌ల నిరసన ప్రదర్శన రెండు వాస్తవాలను తేటతెల్లం చేస్తోంది. ఒకటి ఇండిగో, నీట్ లాంటి జాతీయ విపత్తులు సంభవించినా భాధ్యులైన మంత్రులపై చర్యలు తీసుకోని ప్రధాని నరేంద్ర మోడీ మొండి స్వభావం. రెండు దేశంలోని కీలకమైన, సమస్యలను ఆధారం చేసుకుని అస్థిరత సృష్టించడానికి విదేశీ శక్తుల ప్రయత్నం. కోట్లాది మంది ప్రజలను క్షోభకు గురిచేసే పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం తప్పున్నర. భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం, ఇతర దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం, రాజకీయ నాయకులకు సంబంధించి, ప్రజలకు సంబంధించిన డేటా చోరీలు చేయడం ఎలాన్ మస్క్ అసలు వ్యాపారం. ఈ కారణంగానే ఆయన నడుపుతున్న ఎక్స్‌ఎఐ గ్రోకో నును అనేక దేశాలు నిషేధించాయి. భారత ప్రభుత్వంతో కూడా మస్క్ ఎక్స్‌కు తీవ్రమైన విభేదాలున్నాయి. సోషల్ ప్రపంచ వ్యాప్తంగా ఎలెన్ మస్క్ హీనమైన, అరాచకమైన చర్యల గురించి కొంచెం మీడియాలతో బాటు అన్ని ఆన్ లైన్ ఛానల్స్‌లో ప్రసారం చేసే సమాచారాన్ని భారత ప్రభు త్వ సంస్థ సహాయోగ్ సెన్సార్ చేస్తుంది. చట్ట, ప్రజావ్యతి రేక సమాచారం ఉంటే దీన్ని వెంటనే తొలగించమని సహ యోగ్ కోరుతుంది. సోషల్ మీడియాలకు, ఇతర సంస్థలకు నోటీసులు ఇస్తుంది. ఇలా నిబంధనలు విధించడం మస్క్‌కు ఇష్టం లేదు. ఎలాన్ మస్క్ టెస్లా, స్టార్లింక్ వంటి తన ఇతర వ్యాపారాలను భారత దేశంలోకి విస్తరించాలని భావిస్తున్నాడు. భారత రాజ్యాంగాన్ని గౌరవించని ఏ డిజిటల్ ఫ్లాట్ ఫాంను అనుమతించబోమని భారత్ తెగేసి చెప్పింది. భారత చట్టాలకు లోబడి పని చేస్తామని హామీ ఇచ్చిన తర్వాతనే మెటా, గూగుల్ వంటి ఇతర టెక్ దిగ్గజాలకు అనుమతు లొచ్చాయి. బ్లూటిక్ ప్రీమియం బాడ్జిల పేరుతో యూజర్లను మోసం చేస్తూండటంతో డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ (డిఎస్ ఎ) కింద యూరోపియన్ యూనియన్ మస్క్‌కు 1500 కోట్ల రూపాయల జరిమానా విధించింది. వినియోగదారుల అనుమతి తీసుకోకుండా 6కోట్ల మందికి పైగా యూరోపియన్ వినియోగదారుల వ్యక్తిగత పోస్టులను మస్క్ గ్రోక్ చౌర్యం చేసింది. దీనిపై విచారణ జరుగుతోంది. ఎక్స్ అల్గారిథమిక్ మోసాలు, డీప్ ఫేక్లపై ఫ్రాన్స్, భారతదేశం, మలేషియా, టర్కీలలో విచారణ జరుగుతోంది. బాలల పోర్న్ వీడియోలు, ఎఐతో బ్లూ ఫిలింలు చేసి ప్రసారం చేయడం, హింసాత్మకమైన తీవ్రవాద సంస్కృతిని ప్రోత్సహించే వీడి యోలు ప్రసారం చేయడంపై కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఎంతో స్నేహితు లమని చెప్పుకునే అరబ్ దేశాలు కూడా మస్క్‌ఎక్స్‌ను తమ దేశాల్లో అడుగుపెట్లనీయడం లేదు, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రత్యక్షంగానే మస్క్ పాల్గొంటాడనే కారణంగానే అనేక దేశాలు ఎక్స్‌ను బహిష్కరిస్తున్నాయి. ●

# ప్రజావాక్కు



## గృహిణుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

ఇంటిని సక్రమంగా నడిపించడం, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆహారం, పిల్లల సంరక్షణ, వృద్ధుల అవసరాలు చూసుకోవడం వంటి బాధ్యతలను నిర్వర్తించే గృహిణుల సేవలకు ఇప్పటికీ సరైన గుర్తింపు లభించడం లేదు. వేతనం లేకుండా వారు చేసే గృహకార్యం దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తున్నప్పటికీ, వారికి సామాజిక భద్రత మాత్రం అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో గృహిణులకు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం అత్యంత ప్రాధాన్యంగా మారింది. గృహకార్యానికి విలువ ఇవ్వాల్సిన అవసరాన్నిసుప్రీంకోర్టు కూడా ప్రస్తావించడం గమనార్హం. గృహిణులు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని న్యాయస్థానం పేర్కొనడం సమాజ దృష్టికోణంలో పెద్ద మార్పుకు సంకేతం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మోసాలను నియంత్రించలేమా?

ఆధార్ పేరు పెట్టి ప్రభుత్వాలు ప్రజలతో ఆడుకుంటూ ఉన్నారు. డేట్ ఆఫ్ బర్త్ చేంజ్ ఒకసారి, నేమ్ చేంజ్ లేదా స్పెల్లింగ్ కరెక్షన్స్ రెండుసార్లు పరిమితి పెట్టారు. టుయెర్ ఈజ్ హ్యూమన్ అంటారు. మానవ తప్పిదాలు సహజంగా జరుగుతాయి. స్పెల్లింగ్ మిస్టేక్స్ రావడం ప్రింట్ పొరపాట్లు జరగడానికి అవకాశాలుంటాయి. దేశం బోర్డర్లో ఉన్న ప్రజలకు కఠినమైన నిబంధనలు ఉండడం అర్థం ఉంటుందేమో కానీ అందరికీ ఇలా ఇబ్బంది పెట్టడం తగదు. అన్నింటికీ ఆధార్ ఉపయోగిస్తున్నారు. అన్నింటితో ఆధార్‌ని లింక్ చేస్తున్నారు. నిజానికి ఓటు వేయడానికి చేతి వేలి ముద్రలు, కన్నులు ఐరిష్ మ్యాచ్ అయితేదొంగఓట్లు వేయడానికి అసలుఅవకాశం ఉండదు.

- వి. రూపవతి, బొబ్బిలి

## వేతనాలు పెంచాలి

విద్యుత్‌శాఖలో గత రెండు దశాబ్దాలుగా ఎందరో విద్యావంతులు ప్రభుత్వం తమను పర్మినెంట్ చేస్తుందనే ఆశతో మీటర్‌రీడింగ్ పనులు చేస్తూవున్నారు. వారికి ఇప్పటికీ ఎదుగూ బొదుగూ లేకుండా కేవలం నెలకి పది వేల రూపాయలే ఇస్తున్నారట. వారు రోజుకు 8గంటలు పైగా డ్యూటీలు చేస్తున్నారు. సెలవులు కూడాతక్కువ. పదివేల రూపాయలతో లక్ష రూపాయల జీతం పొందే పర్మినెంట్ ఉద్యోగితో సమానంగా ఫుల్ టైం డ్యూటీలు చేస్తున్నారు. పెరిగిపోతున్న ధరలకుపదివేల రూపాయలు సరిపోవు.

- టి. సాంబశివరావు, గుంటూరు

## పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలుఏర్పాటు చేయాలి. గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారాచాలా ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినమైన జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల ఎటువంటి మినహాయింపు ఉండకూడదు.

- కె. నారాయణస్వామి, హైదరాబాద్

## రైతుల కష్టాలు తీరేదెలా?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు రైతులు పండించిన మొక్కజొన్న, వరి వంటిపంటలు కలలాల్లో కొనుగోలు చేయక తడిసిపోతుంటే మరోపక్క ప్రగతిపేరిట 99 రోజుల సంబరాలు చేస్తుంది. రైతులు తాము పండిచ పంటను కలలాల్లో పెట్టుకొని రోజులు తరబడి ఎదురు చూస్తున్న అధికారులు రావడం లేదంటూ కొనుగోలు చేయక రైతులు ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరోవైపు ఈదురు గాలుల వల్ల మామిడి రైతులు నష్టపోతున్నారు. వారికి భరోసా కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పవచ్చు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది.

- ఎం. సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## సమాన పనికి సమాన వేతనం

భారతదేశంలో ఆర్థిక, సాంకేతిక రంగాలు వృద్ధి చెందుతున్నప్పటికీ లింగ వివక్ష రూపం మార్చుకుని కొనసాగుతోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు భిన్నమైన వాస్తవాలను చూపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలున్నాయి. వ్యవసాయ రంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు.

-పి.రాజేష్, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రూ.75వేల సహకార రుణాలు మాఫీ

## తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

### పంటరుణాలు తీసుకొన్న రైతులకు భారీ ఊరట



**చెన్నై,జూన్ 16:** తమిళనాడు రైతాంగానికి ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న అన్నదాతలకు పెద్ద ఎత్తున ఊరటనిస్తూ రుణమాఫీ పథకంలో సవరణలు చేస్తూ మంగళవారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన నిబంధనలపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, నిరసనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అందరికీ ప్రయోజనం చేకూరేలా ఈ పథకం పరిధిని మరింతగా విస్తరించింది. తాజా మార్పుల ప్రకారం సహకార బ్యాంకుల నుంచి రూ. 75,000 వరకు పంట రుణాలు తీసుకున్న సన్న, చిన్న, పెద్ద రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ వర్తింపజేయనున్నారు. రూ. 75,000 కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు కలిగి ఉన్న రైతులకు సైతం ప్రభుత్వం అండగా నిలిచింది. అలాంటి రైతులకు ఒక్కొక్కరికి రూ. 35,000 చొప్పున రుణ విముక్తి కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. నిజానికి గత నెలలోనే విజయ్ ప్రభుత్వం రుణమాఫీపై ప్రాథమిక ప్రకటన చేసింది. ఆ నిబంధనల ప్రకారం సన్నకారు రైతులకు రూ. 50 వేల వరకు పూర్తి మాఫీ, చిన్న రైతులకు రూ. 50 వేల లోపు రుణాలపై 50 శాతం మాత్రమే మాఫీ ఇవ్వాలని భావించారు. అలాగే రూ. లక్ష వరకు రుణాలున్న పెద్ద రైతులకు కేవలం రూ.5వేల వరకు మాత్రమే రాయితీ ఇస్తామన్నారు. అయితే ఈ అరకొర మాఫీపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ముఖ్యమంత్రి విజయ్ సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రైతుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పాత నిబంధనలను పక్కనబెట్టి మరింత ఉదారంగా కొత్త మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ తాజా సవరణల నిర్ణయం వల్ల తమిళనాడు వ్యాప్తంగా దాదాపు 14.43 లక్షల మంది రైతు కుటుంబాలకు అపారమైన ఆర్థిక లబ్ధి చేకూరనుంది. కాగా ఈ నిర్ణయంతో రాష్ట్రప్రభుత్వ ఖజానాపై రూ. 5,932కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడనుంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్షుణ్ణంగా అంచనా వేసిన తర్వాతే రైతుల సంక్షేమాన్ని కాంక్షించి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు ఎక్కడా విఘాతం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. రుణమాఫీకి సంబం ధించి సహకార బ్యాంకులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పూర్తి మొత్తాన్ని రాబోయే 45 నుంచి 60 రోజుల్లోగా పూర్తిగా చెల్లిస్తామని అధికారికంగా ప్రకటించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళనాడు రైతు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### విడాకుల కేసు ఆగస్టు 7కు వాయిదా



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఆయన భార్య సంగీత స్వర్ణలింగంల విడాకుల వ్యవహారంలో న్యాయస్థానంలో మరోసారి ప్రతిష్టంభన ఎదురైంది. వీరిద్దరి వివాహ రద్దు పిటిషన్‌పై సోమవారం చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం లో జరగాల్సిన విచారణ మళ్లీ వాయిదా పడింది. ఈ విచారణకు అటు ముఖ్యమంత్రి విజయ్ కానీ, ఇటు సంగీత కానీ వ్యక్తిగతంగా హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నాటి కోర్టు విచారణకు విజయ్, సంగీత ఇద్దరూ రాలేదు. వారి తరఫు న్యాయవాదులు మాత్రమే కోర్టుకు హాజరై ప్రస్తుత పరిస్థితులను న్యాయమూర్తికి వివరించారు. ఇరుపక్షాల ముఖ్య వ్యక్తులు అందుబాటులో లేకపోవడంతో విచారణ ప్రక్రియ ఆశించిన విధంగా ముందుకు సాగలేదు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయమూర్తి కేసు తదుపరి విచారణను ఆగస్టు నెలకు పొడిగించారు. ఈ కేసులో ఇలాంటి ఆలస్యం జరగడం ఇదే మొదటిసారి కాదు. గత కొన్ని నెలలుగా ఈ విడాకుల పిటిషన్ వరుస వాయిదాలతో నలుగు తోంది. అంతకుముందు జరిగిన పలు విచారణల సందర్భాల్లోనూ విజయ్, సంగీత కోర్టుకు రాలేదు. ప్రతిసారీ వారి లీగల్ రిప్రజెంటేటివ్స్ మాత్రమే హాజరవుతూ వస్తున్నారు. అంతకుముందు ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం కేసును జూన్ 15వ తేదీ అంటే సోమవారం రోజుకు వాయిదా వేసింది. అయితే ఈసారి కూడా వారిద్దరూ రాకపోవడంతో కేసు మరింత కాలం ముందుకు పడేలా చేసింది.

# హార్ముజ్‌ను దాటిన ఐదు నౌకలు




## జలసంధిపై పట్టు సడలించిన అమెరికా

### అంతర్జాతీయ జలాల్లోకి రాకపోకలు

**వాషింగ్టన్, జూన్ 16:** అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం అధికారికంగా ఖరారు కానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇంతకాలం హార్ముజ్ జలసంధిని దిగ్బంధించిన అమెరికా పట్టు సడలించింది. దాంతో కనీసం ఐదు ఇరాన్ నౌకలు ఆ జలసంధిని దాటి, అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత ఆ ప్రభావం హార్ముజ్ జలసంధిలో రాకపోకలపై పడింది. అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలను ఇరాన్ అడ్డుకోగా ఇరాన్ పోర్టుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను అడ్డగిస్తూ అమెరికా దిగ్బంధనం ప్రకటించింది. అటు ఇరాన్, ఇటు అమెరికా హార్ముజ్‌ను దిగ్బంధించడంతో ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. ఇప్పుడు శాంతి ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఇరాన్ బృం దానికి నాయకత్వం వహించిన ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ ఘాలిబఫ్ సంతకాలు చేశారు. డిజిటల్ రూపంలో ఈ సంతకాలు జరగ్గా, శుక్రవారం స్విట్జర్‌లాండ్‌లోని జెనీవాలో అధికారిక కార్యక్రమం ఉంటుంది. ఈ వరుస పరిణామాలు వేళ ఇరాన్ నౌకలు హార్ముజ్‌ను దాటాయి. శాంతి ఒప్పందంపై ప్రకటన చేసినప్పుడే హార్ముజ్ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడది వాస్తవ రూపం దాల్చినట్లు కనిపిస్తోంది.

**రెండు దశలుగా అమెరికా-ఇరాన్ చర్చలు..**

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు రెండు దశల్లో జరుగుతాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. తొలి దశలో ప్రధాశాంశం హార్ముజ్ జలసంధి అని వెల్లడించారు. దాంతో పాటు అమెరికా దిగ్బంధనం, ఇరాన్ పునర్నిర్మాణం గురించి చర్చలు ఉంటాయని చెప్పారు. అణు సంబంధిత అంశాలు, ఆంక్షల నుంచి ఉపశమనం వంటివి రెండో దఫాలో చర్చిస్తామని పేర్కొన్నారు. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలే ఈ ఒప్పంద చర్చలు ఎటు వెళ్లాలో నిర్ణయిస్తాయని, ఈ విషయం ట్రంప్ యంత్రాంగానికి బాగా తెలుసునని అన్నారు. ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాల్సిన బాధ్యత అమెరికాపైనే ఉందని, అది ట్రంప్‌నకు పెద్ద సవాల్‌గా మారబోతోందని వ్యాఖ్యలు చేశారు.

# శాంతి చర్చల్లో ఇద్దరు ఇరాన్ సైకాలజిస్టులు!



**ఇరాన్, జూన్ 16:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిని ఎదుర్కోవడానికి ఇరాన్ ఒక అసాధారణమైన మార్గాన్ని అనుస రించినట్లు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ మానసిక స్థితిని అంచనా వేయ డానికి, ఆయన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఇరాన్ ఇద్దరు సీనియర్ సైకాలజిస్టుల సహాయం తీసుకున్నట్లు ఒక కథనం వెల్లడించింది. ట్రంప్ ఎప్పటికప్పుడు మారే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చర్చల ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇరాన్‌కు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ ట్రంప్ ప్రవర్తనలో మానసిక రుగ్మత ధోరణులు ఉన్నాయని మేము భావించాము. అందుకే చర్చలకు సంబంధించిన సలహాదారుల బృందంలో ఇద్దరు సీనియర్ సైకాలజిస్టులను చేర్చాము. వారి సహాయంతో ట్రంప్‌నకు పంపే సందేశాలను జాగ్రత్తగా రూపొందించాము అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఈ మానసిక నిపుణుల సలహాలు తీసుకోవడం ప్రారంభించినట్లు సమాచారం. ఈ వ్యూహం ఫలించిందని, తమ సలహాదారుల సిఫార్సులను పాటించడం మొదలుపెట్టినప్పటి నుంచి ట్రంప్ స్పందనలో స్పష్టమైన మెరుగుదల కనిపించిందని ఆ అధికారి వివరించారు. భవిష్యత్తులో ఈ చర్చల వివరాలు బయటకు వస్తే, తమ పద్ధతులు ఎంత పకడ్బందీగా ఉన్నాయో స్పష్టమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ట్రంప్ ప్రవర్తనపై అమెరికాలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ ఏడాది మొదట్లో ఇప్సోస్ నిర్వహించిన ఒక సర్వేలో 10 మంది అమెరికన్లలో 6 మంది ట్రంప్ వయసు పెరిగేకొద్దీ ఆయన ప్రవర్తన అస్థిరంగా మారిందని అభిప్రాయపడ్డారు. వీరిలో 89 డెమోక్రాట్లు, 30 రిపబ్లికన్లు ఉండటం గమనార్హం.

# పార్టీని వీడే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చు

## శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరే

**ముంబయి,జూన్ 16:** పార్టీని వీడాలనుకునే వారిని తాను బలవంతం చేయబోనని శివసేన అధినేత ఉద్ధవ్‌థాకరే స్పష్టం చేశారు. శివసేనను వీడాలనుకునే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చన్న స్పష్టం చేశారు. పార్టీలో ఉండమని ఎవరిపైనా ఒత్తిడి చేయొద్దని నిర్ణయించు కున్నానని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన చీలిక గురించి ప్రస్తావిస్తూ బాలాసాహెబ్ థాకరే స్థాపించిన పార్టీని వీడిన వారు తమ నిర్ణయం పట్ల చివరికి పశ్చాత్తాపపడతారని థాకరే అన్నారు. ఈ రోజు నాది కాకపోవచ్చు, కానీ రేపు కచ్చితంగా నాదే. అప్పటి వరకు మనం ఇలాంటివి భరించాల్సి ఉంటుందని థాకరే అన్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేన ఎంపీలు షిండే వర్గంలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఏడుగురు ఎంపీలు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని, వచ్చే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోపు వారంతా షిండే వర్గంలో చేరే అవకాశం ఉందని శివసేనకు చెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే క్రిపాలు మానె వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొంత మంది పార్టీ ఎంపీల విధేయతపై వస్తున్న ఊహాగానాలపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే మౌనం వీడారు.

# అది ట్రంప్ తీసుకొన్న నిర్ణయం

## మా ప్రయోజనాలు వేరు..

### శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



**జెరుసలేం, జూన్ 16:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయని అంగీకరించారు. ఓ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందానికి సంబంధించి ఎదురైన ప్రశ్నకు నెతన్యాహు బదులిస్తూ.. 'నాకు, ట్రంప్‌నకు మధ్య కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయి. అమెరికాతో సంబంధాల విషయంలో ఇజ్రాయెల్ తన సొంత ప్రయోజనాలకు కట్టుబడి ఉంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని ట్రంప్ కుదుర్చుకున్నారు. అది ఆయన నిర్ణయం. మాకు మా సొంత ప్రయోజనాలు ఉన్నాయి' అని వ్యాఖ్యానించరు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చూడటమే తన లక్ష్యమన్నారు. తాను అధికారంలో ఉన్నంత కాలం అది జరుగుతుందన్నారు. శాంతి ఒప్పందం ఉన్నా.. లేకున్నా ఇరాన్ వద్ద అణ్వాయుధాలు మాత్రం ఉండవని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సైనిక ఘర్షణల్లో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పతనమైందని నెతన్యాహు పేర్కొన్నారు. దాని సైనికులకు, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టం విలువ వందల బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఘర్షణ ఇంకా ముగియలేదంటూ నెతన్యాహు హెచ్చరికలు చేశారు. ఇరాన్ దాని మిత్ర దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ రక్షణ వ్యయానికి అదనంగా 350 బిలియన్ షెకెళ్లను (ఇజ్రాయెల్ కరెన్సీ) కేటాయిస్తున్నట్లు నెతన్యాహు ప్రకటించారు.

# రెండుకోట్ల బీమా కోసం భర్తను చంపిన భార్య



**బెళగావి,జూన్ 16:** కర్ణాటకలోని బెళగావి జిల్లాలో జరిగిన ఒక మాజీ సైనికుడి మృతి కేసు సంచలనం సృష్టిస్తోంది. సాధారణ బైక్ ప్రమాదంగా భావించిన ఈ ఘటన రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బుకోసం భార్య, ఆమె ప్రియుడు కలిసి పన్నిన దారుణ హత్యగా పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో మృతుడి భార్య, ఆమె ప్రియుడితో పాటు వైద్యులు, ఫోరెన్సిక్ సిబ్బంది సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మాజీ సైనికుడు సందీప్ మంజర్గి మార్చి 13న బైక్‌పై నుంచి జారిపడి స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అతని భార్య సుమ మంజర్గి, మొదట హుక్కేరి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఘటప్రభలోని జేజీ ఆసుపత్రికి మార్చింది. మార్చి 15న సందీప్ గుండెపోటుతో మరణించి నట్లు వైద్యులు ప్రకటించారు. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని బీఐఎంఎస్ ఆసుపత్రికి తర లించగా, ప్రాథమిక ఫోరెన్సిక్ నివేదికలో కూడా ఎలాంటి విష ప్రయోగం జరగలేదని, గుండెపోటు వల్లే మరణం సంభవించిందని పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రగాయాలు కాకపోవడం ఆరోగ్యంగా ఉన్న సందీప్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంపై పోలీసులకు అనుమానం కలిగింది. ఈ క్రమంలో సుమ ప్రియుడుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పుండలీక్ దొంబార్ పెట్టిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ కేసును కీలక మలుపు తిప్పింది. ప్రమాదానికి గురైన వ్యక్తి అకస్మాత్తుగా ఎలా చనిపోయాడు. అంటూ తనకు అంతా తెలిసినట్లుగా అతను పోస్ట్ పెట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు కుట్ర మొత్తం బయట పడింది. పోలీసుల కథనం ప్రకారం సందీప్, పుండలీక్ గతంలో కలిసి హోటల్ వ్యాపారం చేశారు. ఈ క్రమంలోనే సందీప్ భార్య సుమతో పుండలీక్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదే సమయంలో సందీప్ పేరు మీద మూడు వేర్వేరు కంపెనీల నుంచి సుమారు రూ.2కోట్ల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నారు. ఆ డబ్బును కాజేయాలనే దురుద్దేశంతోనే ఈ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు గుర్తిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమ యంలో సుమ, పుండలీక్ కలిసి సెలైన్ బాటిల్ ద్వారా విషాన్ని, నిద్రమాత్రలను ఇచ్చి సందీప్‌ను హత్య చేశారు. అనంతరం ఈ హత్యను గుండెపోటుగా చిత్రీకరించేందుకు వైద్య, ఫోరెన్సిక్ సిబ్బందికి రూ.3లక్షలకు పైగా లంచం ఇచ్చి నివేదికలను తారుమారు చేయించారు. నిందితుల నుంచి విషం సీసాలు, సిరంజిలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సందీప్ భార్య సుమ, ప్రియుడు పుండలీక్‌తో పాటు డాక్టర్ బసవరాజ్, ఎఫ్‌డీఏ అధికారి అశోక్, ఎఫ్ఎస్ఎల్ క్లర్క్ అప్పాసాహెబ్ సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేశారు.

# రాహుల్ గాంధీ వెన్నుపోటుదారుడు: డిఎంకె ఫైర్

**చెన్నై, జూన్ 16:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై డిఎంకె ఐటీ సెల్ తీవ్ర విమర్శలు గుప్పించింది. తమిళనాడులో కాంగ్రెస్, డిఎంకె కూటమి విడిపోవడంతో విమర్శలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుడిని 'ఎ బిగ్ జోక్' అని అభివర్ణించింది. కాంగ్రెస్ అవసరాల కోసం తమను వాడుకుని, ఆ తర్వాత కొత్త పొత్తుల కోసం వెళ్లిపోయారని విమర్శించింది. కాంగ్రెస్ రాజకీయ మనుగడ కోసం పోరాడుతున్నప్పుడు తాము వారిని




భుజాలపై మోసాము, కానీ కొత్త మెరిసే బొమ్మను చూడగానే వారు పడవ నుండి దూకేశారని మండిపడ్డారు. ఇదే సమయంలో డిఎంకె పత్రిక 'మురసోలి'లో తన సంపాదకీయంలో ఇండియా కూటమి సమావేశం తర్వాత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. ప్రతిపక్ష పార్టీల మధ్య చీలికలకు కాంగ్రెస్ నాయకుడే కారణమని ఆరోపించింది. అయితే ఇండియా కూటమిలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అంశాలకు తాము మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ ప్రతిపక్షాల ఐక్యత గురించి బోధిస్తూనే, దానిని బలహీనపరుస్తున్నారని మండిపడింది. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే తమ అవకాశాలను దెబ్బతీస్తోందని కూటమి భాగస్వాములే ఆరోపించినప్పుడు, కాంగ్రెస్ ఇప్పుడు ప్రతిపక్షాల ఐక్యత గురించి ఎలా మాట్లాడగలదని ప్రశ్నించింది. ఇండియా కూటమి సమావేశంలో వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ సహా పలు ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలు కాంగ్రెస్‌ను విమ ర్శించాయని పేర్కొంది. రాహుల్ గాంధీ రాజకీయ వైఖరి ప్రతిపక్ష కూటమిలో పదేపదే ఘర్షణలకు దారితీసిందని వాదించింది.

# చైనా, జపాన్, ఇండోనేసియాల్లో భూకంపం

## డ్రాగన్ కంట్రీలో ఒకరి మృతి, నలుగురికి గాయాలు

**న్యూఢిల్లీ/బీజింగ్, జూన్ 16:** చైనా, జపాన్, ఇండోనేషియాలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం భూకంపాలు సంభవించాయి. అత్యధికంగా 6.7 తీవ్రతతో ఇండోనేషియాలోని సులవేసి ద్వీపంలో భూకంపం సంభవించగా, ఆ తర్వాత చైనాలోని క్వింగ్‌హైలోని హైక్సీ ప్రిఫెక్చర్‌లో 6.3 తీవ్రతతో, జపాన్‌లోని హోన్షు తూర్పు తీరానికి సమీపంలో 6 తీవ్రతతో ప్రకంపనలు సంభవించాయి. చైనాలో భూకంపం కారణంగా ఒక వ్యక్తి మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఇండోనేషియాలో ఎనిమిది మంది



గాయపడ్డారు. జపాన్‌లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానిక మీడియా కథనం ప్రకారం, ఇండోనేషియాలోని పాలుకు తూర్పు ఆగ్నేయంగా స్థానిక కాలమాన ప్రకారం ఉదయం 10:27 గంటలకు ప్రకంపనలు సంభవించినట్లు మొదట నివేదికలు వెలువడ్డాయి. దాదాపు 4 లక్షల జనాభా ఉన్న పాలు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లోకి ఈ ప్రకంపనలు ప్రజలను పరుగులు పెట్టించాయి. పైకప్పులు కూలిపోవడం, గోడలు బద్దలవడం, శిథిలాలు వీధులపై చెల్లాచెదురుగా పడటంతో భారీ నష్టం వాటిల్లింది. నష్టం, నిరాశ్రయులైన ప్రజల గురించిన సమాచారం ఇంకా సేకరిస్తున్నట్లు ఇండోనేషియాలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. భూకంప కేంద్రం 43 కిలోమీటర్ల ఎత్తులో, సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత అనేక ప్రకంపనలు సంభవించాయి, వాటిలో అత్యంత బలమైనది 5.2 తీవ్రతతో నమోదైంది. ఇండోనేషియాలో మాదిరిగానే, క్వింగ్‌హైలో కూడా 4.9 తీవ్రతతో సహా అనేక ప్రకంపనలు సంభవించాయి.

# రెండు ట్రక్కులు ఢీ


## ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం



**భువనేశ్వర్, జూన్ 16:** ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైవేపై ఝార్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపు తప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# డాక్టర్ చీటీ ఉంటేనే దగ్గు సిరప్

## కేంద్రం కఠిన ఆదేశాలు




**న్యూఢిల్లీ, జూన్ 16:** దగ్గు మందు విక్రయాల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కాఫ్‌సిరప్ విక్రయాలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను తప్పనిసరి చేస్తూ డ్రగ్స్ రూల్స్ 1945 కింద నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో కాఫ్ సిరప్‌లు షెడ్యూల్ కే డ్రగ్స్ జాబితాలోని క్లాస్ ఆఫ్ డ్రగ్స్ సెక్షన్‌లో 7వ ఎంట్రీగా ఉండేవి. దీంతో, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా మెడికల్ షాపులు వినియోగదారులకు కాఫ్‌సిరప్‌లను విక్రయించే అవకాశం ఉండేది. ఈ షెడ్యూల్‌కు కేంద్రం తాజాగా మార్పులు చేసింది. కాఫ్ సిరప్‌లను షెడ్యూల్‌రేలోని మినహాయింపు జాబితా నుంచి తొలగిస్తున్నట్టు తెలిపింది. ఈ కొత్త రూల్‌కు సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్రం గతేడాది డిసెంబర్‌లోనే విడుదల చేసింది. ప్రజల అభిప్రాయాన్ని సేకరించింది. అనంతరం, తుది మార్గదర్శకాలను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తాజాగా జారీ చేశారు. ఈ నేపథ్యం లో దేశవ్యాప్తంగా మెడికల్ షాపులన్నీ ఇకపై మెడికల్ ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికే సిరప్‌లను విక్రయించాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతి చెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# అయోధ్య రాముడికి ఖరీదైన ప్రసాదం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 16:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడి పండును అయోధ్య బాల రాముడికి నైవేద్యంగా పెట్టారు. జపాన్‌కు చెందిన మియాజాకీ అనే ప్రత్యేకమైన మామిడిపళ్ల కిలో రూ.2.5 నుంచి రూ.3 లక్షల వరకు ఉంటాయి. ఒక్కో పండు ధర దాదాపు రూ.లక్షకు పైగానే ఉంటుంది. ఓం ప్రకాశ్ సింగ్ అనే రైతు వీటిని పండించగా.. అతడి నుంచి కొనుగోలు చేసిన సీజన్‌లోని మొట్టమొదటిగా పండిన పండును స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా తులసి ఆకుల్లో పెట్టి బాలరాముడికి నైవేద్యంగా సమర్పించారు.

# సంక్షిప్త వార్తలు

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: ఖర్గే



**న్యూఢిల్లీ, జూన్ 16:** నీట్ పేపర్ల లీకేజీ, సిబిఎస్ఇ పరీక్షల అక్రమాలు జరిగినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. సదరు మంత్రిని రాజీనామా చేయమని కోరకపోవడం ద్వారా మోడీ సర్కార్ జవాబుదారీతనం అనే పరీక్షలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ మేరకు ఖర్గే మంగళవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఎన్‌డియే సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. జూన్ 21న జరగనున్న నీట్ యూజీ 2026 రీఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్ పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని కూడా ఖర్గే తప్పుపట్టారు. పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల దాదాపు అరడజను మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.

## భవానీపూర్ ఫలితాలపై హైకోర్టులో మమత పిటిషన్

**కోల్‌కతా, జూన్ 16:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బిజెపి నేత సువేందు అధికారి చేతిలో ఓటమి పాలైన మమతా బెనర్జీ, ఆ ఫలితాలను సవాల్ చేస్తూ కోల్‌కత్తా హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపిస్తున్నారు. దీనిపై న్యాయవిచారణ జరపాలని, సంబంధిత ఎన్నికల రికార్డులను భద్రపరచాలని కోరుతూ మమతా బెనర్జీ మంగళవారం హైకోర్టులో స్వయంగా పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేరుగా కోల్‌కతా హైకోర్టుకు హాజరవడం ఇది రెండోసారి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం నుంచి సువేందు అధికారి మమతా బెనర్జీపై 15,105 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఫలితంపై మమత అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## చర్చించాకే టిఎంసి రెబెల్ ఎంపిల విలీనంపై నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 16:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వర్గీయులతో చర్చించాకే ఆ పార్టీ రెబల్ ఎంపిలు విలీనంపై లోక్‌సభ స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. టిఎంసి రెబల్ ఎంపిలు తాము ఎన్‌సిపిఐలో విలీనమయ్యామంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇటీవల లేఖ అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపిల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి ఎంపిల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఇ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి.

## ఎయిరిండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్




**న్యూఢిల్లీ, జూన్ 16:** కన్నూర్‌నుంచి జెడ్డా బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో సమస్య ఉన్నట్లు వార్నింగ్ లైట్స్ వెలగడంతో పైలట్లు వెంటనే అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త గా గాల్లోనే రెండుగంటల పాటు చక్కర్లు కొట్టించి ఇంధనాన్ని పూర్తిగా ఖర్చు చేశారు. తర్వాత కన్నూర్ ఎయిర్ పోర్టులోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు.దీంతో అందులోని 180 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇంజిన్ ఫ్యూయల్ ఫిల్టర్‌లో లోపమే దీనికి కారణమని అధికారులు గుర్తించారు.

## జస్పాల్ రాణా తల్లి కన్నుమూత



**న్యూఢిల్లీ, జూన్ 16:** దివంగత భారత షూటింగ్ దిగ్గజం, కోచ్ జస్పాల్ రాణా తల్లి శ్యామా దేవి రాణా కన్నుమూశారు. జస్పాల్ రాణా మరణించిన నాలుగు రోజులకే ఆయన తల్లి కూడా మరణిం చటంతో వారి కుటుంబంలో విషాదఛా యలు అలుముకున్నాయి. కుమారుడి ఆకస్మిక మరణాన్ని శ్యామా దేవి తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైనట్టు వారి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచారు.

# వరదల నివారణకు క్షేత్రస్థాయి పరిశీలన.. పరిష్కార చర్యలు

## వర్షాకాల సన్నద్ధతపై పౌర, పోలీసు విభాగాల సమీక్షలో ప్రభుత్వసలహాదారు సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** వర్షాకాలం మొదలైన నేపథ్యంలో రాష్ట్రంలో వరదల నివారణకు, వర్షం నీటి నిలువకు సంబంధించి పౌ ర, పోలీసు విభాగాల మధ్య మంగళవారం మొదటి సమావేశం సైబరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డితోపాటు కూకట్‌పల్లి ఎంఎల్ఏ గాంధీ, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, డిజిపి ఆనంద్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, పోలీసు కమిషనర్ రమేష్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహా దారు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వరదల నివారణకు సంబంధించి క్షేత్రస్థాయిలో పలు విభాగాల అధికారులతో పర్యటించామని, అయా ప్రాంతాల్లో వరదలకు సంబం ధించిన సమస్యలను పరిశీలించామని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకునే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఏడాది వరదల నివారణలో కచ్చితంగా మెరుగైన ఫలితాలు వుంటాయని ఆయన అన్నారు. వరదల నివారణలో అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఆయన కోరారు. డిజిపి ఆనంద్ మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చూ సేందుకు పౌర విభాగాలతో కలిసి పోలీసు శాఖ సమన్వయంగా ముందుకు సాగుతుందని తెలిపారు. వర్షాలు కురిసిన సమయంలో నీరు నిలువ వుండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాటిని సరిచేయడంతో పాటు ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. అవసరం అయితే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచు కుంటామని ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు వున్న ప్రాంతాలలో నిర ంతర పర్యవేక్షణ వుంటుందని ఆయన తెలిపారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు పోలీసు శాఖ అప్రమత్తంగా వుండాలని ఆయన ఆదేశించారు. అ నంతరం సుదర్శన్ రెడ్డితో పాటు అధికారుల బృందం మల్కం చెరువు, ఖాజాగూడ సరస్సు, మండికుంటచ గురునాథ్ చెరువు, మియాపూర్, కొండాపూర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక ఇంజనీరింగ్ బృందాల ను ఏర్పాటు చేశారు. వరద సమస్యకు శాశ్వత పరిష్కారానికి సర్కారుకు ఒక నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.



వర్షాకాల సన్నద్ధతపై సైబరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో డిజిపి ఆనంద్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, పోలీసు కమిషనర్ రమేష్, హైడ్రా కమిషనర్ రంగనాథ్

## మెట్రోను ప్రభుత్వరంగ సంస్థగా రూపొందించడానికి సహకరించని కేంద్రం

### ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్న ప్రస్తుత బిజెపి పాలకపక్షం విధానానికి భిన్నంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేటు సంస్థను ప్రభుత్వరంగ సంస్థగా రూపొం దించి లాభాల దిశలోకి తీసుకెళుతుంటే కేంద్రప్రభుత్వం సహకరించకపోగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రుణాలు రాకుండా అడ్డుకోవడం బాధకరమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవేదన చెందారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణ ప్రాజెక్టును ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం చారిత్రాత్మకమని ప్రభుత్వ విప్ వేముల వీరేశం కొని యాడారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం గా మారుస్తుంటే తెలంగాణలో మాత్రం ప్రైవేట్‌సంస్థ నష్టాల్లో ఉన్న ప్రాజెక్టును ప్రభుత్వ పరిధిలోకి తెచ్చి ప్రజలకు మేలు చేయాలని సిఎం భావించడం విప్లవాత్మక అడుగు అని వేముల వీరేశం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును తట్టుకోలేక కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ నిధుల విడుదలను అడ్డుకుంటున్నారని వీరేశం తీవ్రంగా విమర్శించారు.



వి.హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చిత్రంలో లక్ష్మణ్‌యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

## విహెచ్‌కు బండారు దత్తాత్రేయ అభినందనలు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు 77వ జన్మదిన వేడుకలు మంగళవారం అంబర్‌పేటలోని అయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహి ళలకు చీరెలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్, కోదండరెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, రాష్ట్ర బిసి వెల్ఫేర్ కమిషనర్ బాల మాయదేవి, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, పిసిసి నేతలు ఆర్.లక్ష్మణ్‌యాదవ్,శంభుల శ్రీకాంత్‌గౌడ్, లక్‌పతియాదగిరిగౌడ్,దిడ్డి రాంబాబు, మోతె రోహిత్, తదితరుల నేతలు పెద్దఎత్తున పాల్గొని విహెచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర ప్రజలకు డబుల్ షాక్

### నూనెల ధరలు పెరిగాయ్

### అల్లాడిస్తోన్న టమాటా, అల్లం

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** తెలంగాణలో ద్రవ్యోల్బణం ప్రభావం ప్రజల వంటింటిపై తీవ్రంగా పడుతోంది. నిత్యం వినియోగించే కూరగాయలు, వంట నూనెల ధరలు ఒకేసారి పెరగడం వల్ల కుటుంబాలపై తక్షణ ఆర్థిక భారం పడుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. దేశంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో నమోదవుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా టమాటా, అల్లం, వంట నూనెల ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ అమాంతం పెరిగిపోతోంది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ధరల భారం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ స్థానిక మార్కెట్లలో టమాటా కిలో ధర సుమారు రూ.40గా ఉండగా, అల్లం కిలో రూ.100 వరకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా కూడా మే నెలలో అత్యధికంగా ధరలు పెరిగిన ఆహార ఉత్పత్తుల్లో టమాటా, అల్లం ముందంజలో నిలిచాయి. టమాటా ద్రవ్యోల్బణం 48.43 శాతంగా, అల్లం ద్రవ్యోల్బణం 32.49 శాతంగా నమోదైంది. కాగా అధిక డిమాండ్, తక్కువ సరఫరా, ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు పెరుగుతాయని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో తలసరి ఆదాయం అధికంగా ఉండటం వల్ల వినియోగం పెరిగిందని, డిమాండ్‌కు తగిన సరఫరా లేకపోతే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే, ఎల్పీజీ ధరల పెరుగుదల కూడా దీనికి ఒక కారణమని పేర్కొన్నారు. కాగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం వస్తువుల వారీగా ద్రవ్యోల్బణ గణాంకాలను విడుదల చేస్తోంది. ఈ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా టమాటా, అల్లం ధరల పెరుగుదల కొనసాగుతోంది. తెలంగాణలో వంట నూనెల ద్రవ్యోల్బణం సుమారు 18 శాతానికి చేరుకోవడంతో పట్టణ, గ్రామీణ కుటుంబాల రోజువారీ వంట ఖర్చులు మరింత పెరుగుతున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. గత నెల మేలోనూ దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా తెలంగాణ రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డయింది. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తెలంగాణలో నమోదైన ద్రవ్యోల్బణం గణాంకాలే రాష్ట్రాలవారీగా చూసినట్లయితే టాప్‌లో ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఆహారోత్పత్తుల ధరలు తారెత్తిస్తున్నాయి. దీంతో సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్ తలకిందులై పోతున్నది.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఉపవాస దీక్షకు జెఎసి సంపూర్ణ మద్దతు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఉపవాస దీక్షకు జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు గత కొన్ని ఏండ్ల నుండి రావాల్సిన అన్ని బకాయిలను ఆర్‌టీసీ సంస్థ చెల్లించక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, దినదిన గండంగా ఎల్లదేస్తున్నారని, అందుకు నిరసనగా 18న విశ్రాంత ఉద్యోగుల సారధ్య కమిటి ఆధ్వర్యంలో తలపెట్టిన ఉపవాస దీక్షకు జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మోలానా, కో కన్వీనర్స్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బియాదగిరి తెలిపారు. జేఏసీ భాగస్వామ్య సంఘాల విశ్రాంత ఉద్యోగులు కూడా ఈ దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభు త్వ, యాజమాన్యం వెంటనే స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల దీర్ఘకాలిక బకా యిలను చెల్లించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ బకాయిలు విశ్రాంత ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని, తార్నాక ఆసుపత్రిలో విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించి, రెండు నెలలకు సరిపడా మందులు ఒకేసారి పంపిణీ చేయాలన్నారు.

## జివికె విద్యుత్ సంస్థకు రూ.లక్ష జరిమానా

### రిట్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** విద్యుత్ నియంత్రణ కమిషన్లు సివిల్ కోర్టులకు ప్రత్యా మ్నాయంగా పనిచేసే సంస్థలని హైకోర్టు స్పష్టం చేసింది. విద్యుత్ నియంత్రణ కమిషన్లకు తమ ఉత్తర్వులను అమలు చేసే సర్వాధికారాలు ఉన్నాయని, వాటిని కాదని నేరుగా హైకోర్టును ఆశ్రయించడం సమంజసం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో జీవీకే గౌతమి పవర్ లిమిటెడ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఒక దిగువ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వును అమలు చేయించేందుకు రిట్ పిటిషన్ వసూళ్ల ప్రక్రియగా ఉపయోగించుకోలేరని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌లో ఎలాంటి మెరిట్స్ లేవని తేల్చిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం జీవీకే సంస్థకు రూ. 1 లక్ష జరిమానా విధించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జీవీకే సంస్థ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టుకు ప్రాదేశిక అధికార పరిధి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సంస్థకు సంబంధించిన అంశాలపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయడాన్ని తప్పుపట్టింది. అదే సమయంలో, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిన అంశంపై లోతైన విచారణకు ఆదేశించింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందు భారీ క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, వాటిని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ముందు ఎందుకు ప్రస్తావించలేదో తేల్చాలని ఆదేశించింది. దీనిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో), విద్యుత్ పంపిణీ సంస్థల సిఎండిల బాధ్యతను గుర్తించి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది.

కాగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు తమకు రూ.24.28 కోట్ల కనీస ప్రత్యామ్నాయ పన్నుతో పాటు, వడ్డీని చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ జీవీకే గౌతమి పవర్స్ హైకోర్టును ఆశ్రయించింది. 1997లో అప్పటి ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డుతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం ఆదాయపు పన్నులు తదితర వాటిని విద్యుత్ పంపిణీ సంస్థలే భరించాలని కంపెనీ వాదించింది. దీనిపై గతంలో ఏపీఈఆర్సీ, అప్పీలేట్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టులు కూడా కంపెనీకి అనుకూలంగా తీర్పులిచ్చాయని పేర్కొంది. అయితే, ఈ పిటిషన్‌ను విద్యుత్ పంపిణీ సంస్థలు వ్యతిరేకించాయి. జీవీకే గౌతమి పవర్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, ఈ వ్యవహారంతో తెలంగాణ హైకోర్టుకు సంబంధం లేదని వాదించాయి. అంతేకాకుండా, సదరు కంపెనీ గతంలో లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా భారీ మొత్తాలను అక్రమంగా వసూలు చేసిందని, ఆ రికవరీ కోసం విద్యుత్ నియంత్రణ కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం ఆ బకాయిల మొత్తం రూ.1,109 కోట్లకు పైగా ఉందని వెల్లడించాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పిటిషనర్ విన్నపాన్ని తోసిపుచ్చడమే కాకుండా, అధికార పరిధి లేని చోట పిటిషన్ వేసినందుకు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

## సకాలంలో సంక్షేమ సామాగ్రి

### మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన నిత్యవసర వస్తువులను సకాలంలో అందించాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఆదేశించారు. యూనిఫాంలు, స్కూల్ బ్యాగులు, బూట్లు, సాక్సులు, వెల్కమ్ కిట్లు, స్టేషనరీ సామాగ్రి, డైనింగ్ సెట్లు, పరుపు సామాగ్రి మరియు ఇతర నిత్యావసర వస్తువులను సకాలంలో సరఫరా చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో 2026-27 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లకు సంక్షేమ సామగ్రి పంపిణీని సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో నివాస విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు యూనిఫాంలు, స్వాగత కిట్లు, ఇతర అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, చివరి నిమిషంలో పనులను చేపట్టవద్దని అధికారులకు స్పష్టం చేశారు.



గుర్తింపుకార్డులు పొందిన కళాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు, జి.వి.వెన్నెల, ఎ.నరసింహారెడ్డి తదితరులు

## సామాజిక రుగ్మతల నుండి ప్రజల్ని చైతన్యపరచాలి : మంత్రి జూపల్లి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూన్ 16, ప్రభాతవార్త :** అత్యాధునిక ఆవి ష్కరణలతో ఒకపక్క సమాజం అందుకోలేని శిఖరాగ్రాలను అధిగ మిస్తుంటే మరోపక్క ప్రజల్లో అనాదిగా వస్తున్న సామాజిక రుగ్మతలు పట్టిపీడిస్తూనే ఉన్నా యని, వాటిని అధిగమించి ప్రజల్ని చైతన్య పరచాల్సి బాధ్యత మనందరిపైనా ఉందని, అందుకు అవగాహనతో కూడిన సందేశాత్మక కళారూపాలకు రూపకల్పన చేయాలని సాంస్కృ తిక, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఈ దిశతో తెలంగాణ సాంస్కృతిక సారథులు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల కళాకారులతో ఒక్కరోజు అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 18మంది ముఖ్యమంత్రులుగా 65వేల కోట్లు అప్పులుచేస్తే, తెలంగాణ రాష్ట్రమేర్పడి పదేళ్లలో టిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వ హయాంలో 8లక్షల కోట్లు అప్పుచేశారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తూ పాటలు, మాటల ద్వారా కళాకారులు అవగాహన కల్పించాలని కోరారు. కళలకు, కళాకారులకు ప్రభుత్వం ఎంతచేసినా తక్కు వేనని అభిప్రాయపడ్డ మంత్రి జూపల్లి కళాకారుల అభ్యున్నతికి చేయాల్సింది ఎంతో ఉందని, ఆదిశలో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ముద్రించిన కళాకారుల గుర్తింపు కార్డులను తెలంగాణ సాంస్కృతిక సారధి అధ్యక్షురాలు డా. జి.వి.వెన్నెల, సాంస్కృ తిక శాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డిలతో కలిసి ముందస్తుగా కృష్ణారావు 10 మంది కళాకారులకు అందజేసి శుభా భినందలు తెలిపారు. పలు అవగాహనా సదస్సులు, శిక్షణా శిబిరాలు నిర్వ హించి కళాకారుల్లో నైపుణ్యాన్ని పెంచి వారిలో ఆత్మస్థయిర్యాన్ని పెంపొం దింపజేస్తుందని సారధి అధ్యక్షురాలు జి.వి.వెన్నెల తెలిపారు. డా. ఏనుగు నరసింహారెడ్డి పాఠశాల, కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం పథకాలను విస్తృత ప్రచారంతో ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కళాకారులను ఆదేశించారు. ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ బెల్లం నాయక్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాకారులకు ముందుగా అవగాహన కల్పించాలన్నారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ కళలు, కళా కారులు అనే అంశంపై, రెండున్నరేళ్లలో ప్రజాపాలనా అభివృద్ధిపై సాంస్కృ తిక శాఖ సలహామండలి సభ్యుడు దినకర్ మాట్లాడారు. కార్యక్రమం లో అడ్మినిస్ట్రేటివ్ అధికారి డా. పి.విజయ్‌కుమార్, సారధి రచయితలు అభి నయ్ శ్రీనివాస్, యశ్‌పాల్, కె.శ్రీనివాస్, అంబటి వెంకన్న, చంద్రప్రకాశ్, వేముల పుష్ప తదితరులు పాల్గొన్నారు. కళాకారులుగా గుర్తింపు కార్డులు పొందిన వారిలో శ్రవణ్‌కుమార్, విశ్వకర్మ డి.కె., రాజేశ్వరి, జానమ్మ తదితరులున్నారు.

## సిఎం రేవంత్‌చే తెలంగాణ వ్యవసాయం-2047 నివేదిక విడుదల

**హైదరాబాద్ (అత్తాపూర్) జూన్ 16, ప్రభాతవార్త :** సిఎం రేవంత్ రెడ్డి వ్యవ సాయ శాఖపై నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వ్యవసాయ రంగ అంతర్జాతీయ నిపుణులు సమరేందు మహంతితో కలసి రచించిన తెలంగాణ వ్యవసాయం-2047 సవాళ్లు, విధాన మార్గదర్శకాల నివేదికను సిఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసారు. అదే విధంగా అల్దాస్ జానయ్య రచించిన ఇందిరా గాంధీ యన్ అర్చిటెక్ట్ ఆఫ్ గ్రీన్ రివల్యూషన్ అనే పుస్తకాన్ని కూడా ముఖ్యమంత్రి విడుదల చేశారు. అల్దాస్ జానయ్యని ముఖ్య మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఖాళీగా ఉన్న సుమారు 550 బోధనా సిబ్బంది పోస్టులని భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారని, తదనుగుణంగా సంబంధిత దస్త్రాలని వెంటనే ఆమోదించవలసిందిగా సిఎం ఆర్థిక శాఖని ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉప కులపతి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. రాత పరీక్ష ఆధారంగా, ఎటువంటి మౌఖిక పరీక్షలు లేకుండా పారదర్శకంగా పోస్టుల భర్తీ ప్రక్రియని నిర్వహిస్తామని ఉపకులపతి అల్దాస్ జానయ్య ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు.



తెలంగాణ వ్యవసాయం -2047 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉపకులపతి అల్దాస్ జానయ్య

## వర్షాకాలంలో అంతరాయం లేని విద్యుత్

### సరఫరా లైన్లలో లోపాలు లేకుండా చర్యలు

### దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** వర్షాకాలంలో విద్యుత్ అంత రాయాలను తగ్గించడానికి, ఫీడర్లు, పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టి, హెచ్‌టి నెట్‌వర్క్‌లపై నిర్వహణ పనులను వేగవంతం చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలను ఎదుర్కోవడానికి, క్షేత్రస్థాయి తనిఖీలలో సిఎండి పరిశీలించారు. విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను లైన్ టు లైన్ సర్వే నిర్వహించి, విద్యుత్ లైన్లు, స్తంభాలు, పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, జంపర్లు, సర్వీస్ కనెక్షన్‌లు, ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాల పరిస్థితిని సమగ్రంగా సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరాయ, విశ్వసనీయ విద్యుత్ సరఫరాను నిర్ధారించడానికి చెట్ల కొమ్మల కత్తిరింపు, లైన్ క్లియరెన్స్, నివారణ, నిర్వహణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

తమతమ నెట్‌వర్క్ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షి ంచి, సమస్యలు తలెత్తక ముందే నివారణ చర్యలు తీసుకోవాలని, తద్వారా వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించాలన్నారు. గుర్తించిన నెట్‌వర్క్ లోపాలు, పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులు, లైన్ క్లియరెన్స్ సమస్యలు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ సరఫరా నాణ్యత, విశ్వసనీయతను ప్రభావితం చేసే ఇతర అంశాలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

క్షేత్రస్థాయి సిబ్బంది అన్ని వేళలా వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, వారి ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు నిర్దేశించిన దుస్తుల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ), లైన్ టూల్స్, ఇతర భద్రతా పరికరాలను తప్పనిసరిగా ఉపయోగిం చాలని కూడా ఆయన నొక్కి చెప్పారు.



విద్యుత్ సరఫరా లైన్లలో లోపాలను గుర్తించడానికి చేపట్టిన హైపర్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రెండో రోజు మంగళవారం వివిధ ప్రాంతాలను





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి. చిత్రంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సామ్రాజ్యం తదితరులు

## హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు: మంత్రి వివేక్

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 16, ప్రభాతవార్త:** కేవలం శ్రమశక్తిపై ఆధారపడి జీవిస్తున్న హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చెప్పారు. ఇందుకోసం ఒక కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు-సాధన సమావేశం'లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గిగ్ కార్మికుల కోసం తాను ప్రత్యేకంగా ఒక చట్టాన్ని తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. హమాలీల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ హమాలీలు తమ శ్రమతో సమాజానికి సేవలు అందిస్తున్న కార్మికులని కొనియాడారు. వారి అశలను ప్రభుత్వం వమ్ము చేయకుండా చర్యలు తీసుకుంటుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## 23 నుండి ఉద్యమకారుల గుర్తింపునకు సంప్రదింపులు

### ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సలహాలు, సూచనలు స్వీకరిస్తాం

### తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ స్పష్టీకరణ

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23 నుండి దశలవారీగా ఉద్యమకారుల గుర్తింపుకు సంప్రదింపులు చేపడతామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ప్రకటిం చింది. ఆన్‌లైన్‌లో ఆఫ్ లైన్ ద్వారా సలహాలు సూచనలు స్వీకరిస్తామని తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా అమరజ్యోతి ప్రాంగణంలో నిర్మించిన వివిధ గదులను పరిశీలించిన కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఆడియో విజువల్ రూమ్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కమిటీ చైర్మన్ కే. కేశవరావు నేతృత్వంలో అమరజ్యోతి కేంద్రంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ నెల 23 నుండి అమరజ్యోతి కేంద్రంగా వివిధ వర్గాలతో సంప్రదింపులు నిర్వహిం చాలని కమిటీ నిర్ణయించింది. ఇందులో విద్యార్థి జేఏసీ ప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అడ్వకేట్లు, డాక్టర్లు తదితర వర్గాలతో సమా వేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నారు. 2001 నుండి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ప్రజా సంఘాల ఉద్యమకారులు, ఉద్యమకారుల సంక్షేమ కమిటీలు ఇతర వర్గాలతో రాజకీయాలకు అతీతంగా విస్తృత స్థాయిలో చర్చలు జరిపి ఉద్యమకారుల గుర్తిం పునకు అవసరమైన సూచనలు, సలహాలను దశలవారీగా సేకరించాలని కమిటీ నిర్ణయించింది. ఈ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సూచనలు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ఆఫ్‌లైన్ విధానంలో ఉద్యమకారులు తమ ప్రాతినిధ్యాలు సమర్పించేందుకు ప్రత్యేక అధికారులను నియమించింది. తద్వారా అందిన అభిప్రాయాలు, వివరాలను నమోదు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ పనుల పరిశీలన

సెక్రటేరియట్ ముందు నిర్మిస్తున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. విగ్రహ నిర్మాణ పనులు, కాంపౌండ్ వాల్, విగ్రహ ఎత్తు గద్దెల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆగస్టు మొదటి వారంలోపు పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ల్యాండ్ స్కేపింగ్, గార్డెన్ పనులు చేయాలని అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు

# సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో గోల్‌మాల్ జరగలేదు

## సంక్షేమ గురుకుల సొసైటీ సెక్రటరీ

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సంబంధించి ఫుడ్ ప్రొవిజన్ (కిరాణా సామగ్రి) వస్తువుల టెండర్లలో గోల్‌మాల్ జరిగిందనేది అబద్ధమని వీటిని పర్యవేక్షి స్తున్న ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ వెల్లడించింది. ఈ మేరకు ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ చైర్మన్, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ సెక్రటరీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఫుడ్‌ప్రొవిజన్ టెండర్లలో రూ.200 కోట్ల మేర గోల్‌మాల్ జరిగిందంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లకు సంబంధించి ఇప్పటికీ ఫుడ్ ప్రొవిజన్ టెండర్‌ను ఖరారు చేయలేదని తెలిపారు. గురుకులాలకు వసువుల సరఫరా నిమిత్తం ఇప్పటి వరకూ దాఖలైన బిడ్ల పరిశీలన కొనసాగుతోందని వివరించారు. ఇప్పటికీ ఫుడ్ ప్రొవిజన్ వస్తువుల ధరలను ఖరారు చేయలేదని వివరించారు. అలాగే మార్కెట్ ధరలకు, హోమ్ డెలివరీ చేసే సంస్థల ధరలకు తేడా ఉండటం సర్వసాధారణమని పేర్కొన్నారు. టెండర్ ధరల్లోనే మారుమూల గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు సహా, రాష్ట్రంలోని 33 జిల్లాలో విస్తరించిన 3వేలకు పైగా సంస్థలకు జీఎస్టీ, రవాణా, లోడింగ్, అన్ లోడింగ్, డోర్ డెలివరీ చార్జీలు అన్ని కలిపి ఉంటాయని వెల్లడించారు. అన్ని ఖర్చులతో కూడిన, ఇంటి వద్దకే డెలివరీ చేసే సంస్థాగత ధరలను మారెట్ ధరతో పోల్చడం సరికాదని పేర్కొన్నారు.



# శాంతి ఒప్పందంపై ట్రంప్ బృందంలోనే చీలికలు!

**వాషింగ్టన్, జూన్ 16:** ఇరాన్ అమెరికాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బృందంలోనే చీలికలు కనిపిస్తున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ఇరాన్‌కు చాలా ఎక్కువ స్వేచ్ఛ ఇచ్చినట్లు సీఐఏతో పాటు ట్రంప్ టీమ్‌లోని కొందరు భావిస్తున్నారు. 2015లో ఇరాన్‌తో ఇలాంటి ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామాపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం, ఇరాన్ శాంతి ఒప్పందం విషయంలో ట్రంప్‌కు వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, ట్రంప్ రాయబారులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ మద్దతు ఇస్తున్నారు. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ వ్యతిరేకిస్తున్న వారిలో ఉన్నారు. ఈ విషయాన్ని అమెరికన్ వెబ్‌సైట్ ఆక్సియోస్ ఒక నివేదికను ప్రచురించింది. ఇరాన్‌లోని సీఐఏ ఏజెంట్ల ద్వారా అందిన సమాచారంలో అమెరికా మరోసారి ద్రోహానికి గురవుతున్నట్లు సీఐఏ చెబుతోంది. అమెరికా కోరిన విధంగా ఇరాన్ అణు రాయితీలపై సందేహాలు వ్యక్తమవుతున్నట్లు సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, ట్రంప్ ఇతర ఉన్నతాధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. అమెరికా డిమాండ్ చేస్తున్నట్లు అణు కార్యక్రమాలను ఇరాన్ నిలిపివేస్తుందనే విషయంలో సందేహాలు ఉన్నట్లు సీఐఏ, మార్కో రూబియో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ ఒప్పందంలో అత్యంత కీలకమైంది, ఇది ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను కలిగి ఉండదని, అత్యంత సుసంపన్నమైన యురేనియంను నిల్వ చేయలేదని, ప్రపంచ ఇంధన సరఫరాను అడ్డుకోకూడదన్న అంశాలపై అమెరికాలోని ఒక వర్గం సందేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తదుపరి చర్యలపై చర్చించేందుకు జేడీ వాన్స్, విట్కాఫ్, కుష్నర్‌లు శుక్రవారం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్‌బఘేర్ ఘాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీలతో పాటు పాకిస్థాన్, ఖతార్‌ల మధ్యవర్తులతో సమావేశం కానున్నారు.

# బోనస్‌ను పూర్తిగా ఎత్తివేసే కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 16:** పంట బోనస్‌కు కోతలు, రైతన్నకు వాతలు పెట్టేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ సమీక్ష నిర్వహించినట్లా? బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. పంట బోనస్ నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు సన్న రకాల సంఖ్యను తగ్గిస్తున్నారని, ఏ రకం ధాన్యం వేయాలని సర్కారు నిర్ణయించడం అంటే రైతన్న మెడపై ప్రభుత్వం కత్తి పెట్టడమేనని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. మేనిఫెస్టోలో అన్ని రకాల పంటలకు రూ. 500 బోనస్ అని, తర్వాత 33 రకాల సన్నాలకు పరిమితం చేసారు, ఇప్పుడు దాన్ని 7 రకాలకు తగ్గించారు. 7 రకాల పంటలకే బోనస్ ఇస్తాం అంటే, ఇప్పటికే నారు వేసిన రైతుల పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. ఇంత నిర్బంధంగా, కఠినంగా రైతులతో వ్యవహరించాల్సిన అవసరం ఏముంది? రైతులంటే ఈ ప్రభుత్వానికి ఎందుకు అంత కోపం? అని ప్రశ్నించారు. రైతు బంధు, పంట బోనస్, పంట బీమా, రైతు బీమా గురించి సమీక్ష చేయకపోవడం అంటే రైతు సంక్షేమాన్ని విస్మరించడమేనని ఆరోపించారు. గత మూడు సీజన్లకు రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగికి రెండు ఎకరాలకు రైతుభరోసా ఇచ్చి చేతులు దులుపుకుంది. 45 రోజుల్లో ఇస్తామని సిద్దిపేట వేదికగా సీఎం చెప్పి 85 రోజులు దాటింది. మాటలు కోటలు దాటితే సీఎం చేతలు గడప దాటదు అనడానికి ఇది మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. ఆత్రుతగా రైతు భరోసా కోసం ఎదురుచూసిన రైతుల ఆశలపై సీఎం సమీక్ష కుండెడు నీళ్ళు చల్లింది. ఎన్నికలు లేకుంటే రైతు భరోసా ఇవ్వరా? గత 5 నెలల నుండి రైతు బీమా కిస్తీ కట్టక, రైతు కుటుంబానికి కేసీఆర్ ఇచ్చిన భద్రతను, భరోసాను లేకుండా చేశారు అని ఆరోపించారు.

# అశ్వినీవైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించండి

## మెట్రో ఫేజ్-2 కేంద్రం, రాష్ట్రం 50:50 జాయింట్ వెంచర్‌గా ఆమోదించాలి

## ఐఆర్ఎఫ్‌సి ద్వారా రుణం విడుదల చేయించాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సిఎం రేవంత్ బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 16:** హైదరాబాద్ మెట్రో ఫేజ్2 విస్తరణకు అవసరమైన కేంద్రం అనుమతులతో పాటు ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదల మరింత జాప్యం చేయవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఈ అంశంపై చర్చించేందుకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం సాయంత్రం లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు ప్రయాణికులకు విశేష సేవలు అందిస్తోంది. పెరిగిన జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. మొత్తం 7 కారిడార్లు, 122.9 కిలోమీటర్ల మార్గం, సుమారు రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనలు ఇచ్చింది. ఫేజ్-1 ప్రైవేటు నిర్వహణలో ఉండటం, ఫేజ్-2 వేరే సంస్థాగత విధానంలో అమలు చేయటంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తెలిపిన అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మకంగా స్వీకరించిందని సీఎం ఈ లేఖలో వివరించారు. మొత్తం మెట్రో వ్యవస్థ ఒకే నెట్ వర్క్‌లో నడిచేందుకు వీలుగా ఫేజ్-1ను స్వాధీనం చేసుకునే అసాధారణ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఫేజ్-1 స్వాధీనం ప్రక్రియలో ఈక్విటీ కొనుగోలుకు రూ. 1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15,000 కోట్ల లావాదేవీలున్నాయి. ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ పారదర్శకంగా నిర్వహించింది. ఈ కమిటీకి కేంద్ర ప్రభుత్వం తరఫున యూపీఎంఆర్‌సీఎల్ ఎండీ సుశీల్‌కుమార్‌ను సభ్యుడిగా నామినేట్ చేసిందని గుర్తుచేశారు. ఐఆర్ఎఫ్‌సీ ప్రాజెక్టును పూర్తిగా పరిశీలించి, డ్యూ డిలిజెన్స్ పూర్తి చేసి రుణ మంజూరు ఒప్పందం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. ఆర్‌బీఐ ద్వారా డైరెక్ట్ డెబిట్‌కు అంగీకరించింది. ఐఆర్ఎఫ్‌సీ షరతుల ప్రకారం మొదటి విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.84.32 కోట్ల అప్‌ఫ్రంట్ ఫీజు చెల్లించింది. ఈక్విటీ రూ.1,461.47 కోట్లు ఇప్పటికే ఎస్క్రో ఖాతాలో జమ చేసింది. ఈ ఒప్పందాలన్నీ పూర్తయ్యాక, అన్ని షరతులు నెరవేర్చాక, 2026 జూన్ 15న రావాల్సిన మొదటి విడత రుణం విడుదల కాలేదని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి దానం అడగటం లేదని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఒప్పందం ప్రకారం ఐఆర్ఎఫ్‌సీ రుణాన్ని విడుదల చేయించాలని కోరుతున్నామని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కేంద్రంలో సీనియర్ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఈ విషయంలో బాధ్యత తీసుకుని ఐఆర్ఎఫ్‌సీ ద్వారా మంజూరైన రుణం విడుదలయ్యేలా చూడాలని కోరారు. మెట్రో ఫేజ్-2ను కేంద్రం-రాష్ట్రం 50:50 జాయింట్ వెంచర్‌గా ఆమోదించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందని సీఎం ఈ లేఖలో వివరించారు. ఒకవేళ అనుమతులు ఆలస్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరులు, సంస్థాగత రుణాల ద్వారా ఫేజ్-2ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన ముందస్తు అనుమతులను ఆలస్యం లేకుండా కేంద్రం నుంచి ఇప్పించాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం కిషన్‌రెడ్డిని కోరారు. సంబంధిత ఒప్పందాలు, ఆధార పత్రాలతో తాను అధికారులతో కలిసి ఆ సమావేశానికి హాజరై అన్ని వివరణలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.



# పారదర్శకంగా ఎరువుల పంపిణి

## ఇంటి వద్ద నుంచే యూరియా బుకింగ్

## అందుబాటులో 90.22 లక్షల బస్తాలు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులను పంపిణీ చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు హామీ ఇచ్చారు. యూరియాతో సహా అన్ని ఎరువులను సకాలంలో అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులకు యూరియా పంపిణీని సులభతరం చేయడానికే ఫెర్టిలైజర్ యాప్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు. పారదర్శకత, వేగవంతమైన సేవలు, విశ్వసనీయత, సులభతరం చేయడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రిటైల్‌గా 22.67 లక్షల బస్తాలు, సొసైటీల వద్ద 5.56 లక్షల బస్తాలు, మార్క్‌ఫెడ్ వద్ద 59.56 లక్షల బస్తాలు, గోడౌన్లలో 3.56 లక్షల బస్తాలు కలిపి మొత్తం 90.22 లక్షల బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 4.06 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 13.22 లక్షల యూరియా బస్తాలు బుక్ చేశారని చెప్పారు. స్మార్ట్‌ఫోన్లు లేని, చదువుకోని లేదా యాప్ వినియోగంపై అవగాహన లేని రైతుల కోసం ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవ అందుబాటులో ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతు భరోసా లబ్ధిదారులకు సమాచారం చేరేలా అన్ని రైతు వేదికలలో టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్, పరిశ్రమలకు మళ్లింపు వంటి దుర్వినియోగాలను అరికట్టడానికే ఈ డిజిటల్ విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. యూరియా సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, కేంద్రంతో సమన్వయం చేసుకొని రాష్ట్రానికి అవసరమైన కోటాను సాధిస్తున్నామని తెలిపారు. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే బుక్ చేసుకుని అవసరమైన సమయంలో పొందే అవకాశం కల్పించడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. వాతావరణ కేంద్రాల నివేదికల ప్రకారం ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. జూన్, జూలై నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ప్రత్యామ్నాయ పంటల సాగుపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, లాభసాటి పంట అయిన ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించాల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరక్టర్ డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తప్పదని తెలిసి

# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లక్ష్యంగా రాజకీయాలు

## సిఎం రేవంత్‌రెడ్డిపై బిజెపి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆరోపణ

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో అపాయింట్‌మెంట్ తెచ్చుకోలేని మీరు, మీ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కిషన్‌రెడ్డిని ఎందుకు నిందిస్తున్నారని బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని ప్రశ్నించారు. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నిర్ణయాలకు కిషన్ రెడ్డికి ఏం సంబంధం? అంటూ ప్రశ్నించారు. ప్రతి విషయాన్ని రాజకీయంగా చూడటం మానుకోవాలన్నారు. మెట్రోకు ఇప్పటివరకు పూర్తి డిపిఆర్ సైతం కాలేదన్నారు. కానీ కేంద్రాన్ని నిందించడం మాత్రం మొదలుపెట్టారన్నారు. హైదరాబాద్ మెట్రోను నిలబెట్టింది, మొదటి దశకు నిధులు ఇచ్చింది మోడీ ప్రభుత్వమేనన్నారు. మొదటి దశలోనే కేంద్రం రూ.1,200 కోట్లు ఇచ్చిందన్నారు. మీ అవినీతి ప్రాజెక్టులకు అనుమతులు రాకపోతే, మీ డిపిఆర్‌లు ఆమోదం పొందకపోతే, దానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని బాధ్యుడిని చేయడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర మంత్రిపై అవాకులు, చెవాకులు మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు అంటూ దశాబ్దాలుగా మోసం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. రీజినల్ రింగ్ రోడ్‌కు కేంద్రం ఆమోదాలు, నిధులు ఇచ్చింది. మరి సౌత్ అలైన్‌మెంట్‌ను ఎందుకు మార్చాలని చూస్తున్నారు? మీ మంత్రులు, మీకు సంబంధించిన వ్యక్తులు ముందుగానే భూములు కొనుగోలు చేశారా? అందుకే అలైన్‌మెంట్ మార్చాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు, మెగా డిఎస్సీ అంటూ యువతను మోసం చేశారు. రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యోగాలు ఎక్కడ? అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేక, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. అధికారులు మాట వినడం లేదని మీరే చెబుతున్నారు. మరి రాష్ట్ర పరిపాలన మీద మీకు పట్టు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. అసెంబ్లీలో కేంద్రానికి ధన్యవాదాలు చెబుతారు, బయటకు వచ్చి కేంద్రం సహకరించడం లేదంటారు. ఇది ద్వంద్వ వైఖరి కాదా? అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.1,000 కోట్లున్న రైల్వే బడ్జెట్‌ను రూ.5,500 కోట్లకు పెంచింది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. బిబినగర్ ఎయిమ్స్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, జాతీయ రహదారులు, ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు.. ఇవన్నీ కేంద్రం ఇచ్చినవేనని, కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు భరోసా, రుణమాఫీ, సన్నబియ్యం బోనస్‌ప హామీని పూర్తిగా అమలు చేయలేదు. 75 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, 25 లక్షల మందికే చేసి 50 లక్షల మంది రైతులను మోసం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై, కేంద్ర ప్రభుత్వంపై, బిజెపిపై ఇకనైనా తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ దాడులు



## గంజాయి సేవిస్తూ పట్టుబడిన 14 మంది యువకులు

## డ్రగ్స్ రాకెట్‌తో సంబంధాలు

**హైదరాబాద్, జూన్ 17: ప్రభాతవార్త:** హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనరేటతో పాటు నిజామాబాద్, మెదక్లలోని పలు ప్రాంతాలలో ఈగల్ పోలీసులు సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించిన దాడుల్లో గంజాయి సేవిస్తూ 19 మంది యువకులు దొరికిపోయారు. వీరికి రాష్ట్రంలో పలు కేసుల్లో సంబంధం వున్న డ్రగ్స్ స్మగ్లర్లతో సంబంధం వుందని తేలింది. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా మంగళవారం మీడియాకు వెల్లడించారు.

రాష్ట్రంలో పలుచోట్ల డ్రగ్స్ స్మగ్లర్లు యువకులకు పలురకాల మాదకద్రవ్యాలు అమ్ముతున్నట్లు, వారిని వ్యసనపరులుగా మారుస్తున్నట్లు ఈగల్ పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు జరిగాయి. చక్రపాణి అలియాస్ చక్రి, హర్షిత్ రెడ్డి అనే ఇద్దరు స్మగ్లర్లు గోవాకు వెళ్లి ఒక హాస్టల్‌లో వుంటూ జల్సాగా గడపడం, కొకైన్, ఎండిఎంఎ, గంజాయి, హాష్ ఆయిల్, ఎల్ఎస్‌డి సహా పలురకాల మాదకద్రవ్యాలను కొంటూ వాటిని తెలంగాణతో పాటు ఏపి, కర్నాటక వ్యాప్తంగా అనేకచోట్ల స్మగ్లింగ్ ద్వారా అమ్ముతున్నారు.

వీరిద్దరు ఏయే ప్రాంతంలో అమ్ముతున్నారనే దానిపై పక్కా సమాచారం సేకరించిన ఈగల్ పోలీసులు సోమవారం సాయంత్రం 15 బృందాలతో జంట నగరాలు, శివార్లలో గల నాలుగు పోలీసు కమిషనరేట్లతో పాటు నిజామాబాద్ , మెదక్‌లోని పలు అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు చేబట్టారు. ఈ సందర్భంగా 19 మంది యువకులు విపరీతంగా ప్రవర్తించడంతో వీరం దరికి డ్రగ్స్ పరీక్ష నిర్వహించారు.

ఈగల్ పోలీసుల పరీక్షలో నాగోల్‌కు చెందిన తన్నీరు వెంకటరావు (34), కొప్పుల నాగ రాజు (32), పరిటాల రోహిత్ (33), మణికొండకు చెందిన క్రాంతి సాగర్, మెదక్ జిల్లా గుమ్మడిదలకు చెందిన అభిలాష్ (29), వనస్థలిపురంలో గంటి భరత్ (32), యశ్వంత్ సాయి (35), సిగుర్ల అరుణ్ కుమార్ (28), కర్మాన్‌ఘాట్‌లో వంశీ ధర్ రెడ్డి (29), బోయిన్‌పల్లిలో గంజుపల్లి సందీప్ (31), సంతోష్ నగర్‌కు చెందిన సాత్విక్ రెడ్డి (20), నిజామాబాద్‌లో సందీప్ రెడ్డి, రామాయంపేట బిసి కాలనిలో మేకల ప్రవీణ్ (28)లకు పాజిటి వ్ వచ్చింది. వీరిని విచారించగా తాము చక్రి అనే స్మగ్లర్‌కు మాదకద్రవ్యాల కోసం లక్షా 46 వేల 950 రూపాయలు, హర్షిత్ రెడ్డి అనే ఇంకో స్మగ్లర్‌కు లక్షా 66 వేల 150 రూపాయలు చెల్లించినట్లు వెల్లడించారు. కాగా చక్రి, హర్షిత్ రెడ్డిలు వనస్థలిపురంలో వెలుగు చూసిన డ్రగ్స్ కేసు లో నిందితులు. వీరి కోసం గాలింపు చేబట్టారు.

కాగా డ్రగ్స్ సేవించి పట్టుబడ్డ 14 మందిని ఆయా ప్రాంతాలలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. మాదకద్రవ్యాల విషయంలో సర్కారు కఠినంగా వుందని, స్మగ్లర్ల భరతం పడతామని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా హెచ్చరిం చారు. డ్రగ్స్ సంబంధించి ఎటువంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# ఫ్యూచర్‌సిటీలో రైల్వేస్టేషన్

## బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్టుపై

## సమీక్ష జరిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 16:** రాష్ట్రంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్టు అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు హైదరాబాద్- పుణె రైల్వే మార్గంలో వికారాబాద్ అనంతగిరి దగ్గర స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అనంతగిరి నుంచి ఐటీ హబ్‌కు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. హైదరాబాద్ టు బెంగళూరు హై స్పీడ్ రైల్వే లైన్ భారత్ ఫ్యూచర్ సిటీ లో స్టేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఎంసీఆర్ హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్ లో బుల్లెట్ రైలు ప్రాజెక్ట్,వరంగల్ ఎయిర్ పోర్టు పైన సిఎం సమీక్ష చేశారు. మన్ననూర్ దగ్గర నల్లమల స్టేషన్,సోమశిల సమీపంలో స్టేషన్ ప్లాన్ చేయాలని సూచించారు. టూరిజం ప్రాంతాలను దృష్టి లో ఉంచుకొని రైల్వే లైన్ ఉండాలని పేర్కొన్నారు..హైదరాబాద్ (శంషాబాద్)బుల్లెట్ ట్రైన్ హబ్ గా పిలవాలని చెప్పారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ డిజైన్ లపైన చర్చించిన ముఖ్యమంత్రి ..వరంగల్ ఎయిర్పోర్ట్ కాకతీయ సామ్రాజ్యం వారసత్వ సంపద అడుగడుగునా ఉట్టి పడేలా ఉండాలని చెప్పారు. ఎయిర్ పోర్టు ముందు భారీ ఐలాండ్ ఉండాలి..ఐలాండ్‌లో రాణి రుద్రమ విగ్రహం ,రుద్రదేవుడు విగ్రహాలతో పాటు భారీ నంది విగ్రహం ఏర్పాటు చేయాలని చెప్పారు..వరంగల్ ఎయిర్ పోర్ట్ డిజైన్స్ పైన ఢిల్లీ వెళ్లి ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులతో చర్చలు జరపాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశానికి ఎంపీ వేం నరేందర్ రెడ్డి ,స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, టిజిఐఐసి కమిషనర్ శశాంక,రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ ప్రావీణ్య తదితరులు హాజరయ్యారు.



# కాలిఫోర్నియా ఎయిర్‌బేస్‌లో కుప్పకూలిన బి-52 బాంబర్ విమానం

**కాలిఫోర్నియా, జూన్ 16:** అమెరికా వైమానిక దళంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాలిఫోర్నియాలోని ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో బీ52 స్ట్రాటోఫోర్ట్రెస్ అనే భారీ వ్యూహాత్మక బాంబర్ విమానం కుప్పకూలింది. సోమవారం ఉదయం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో విమానంలో ఉన్న ఎనిమిది మంది సిబ్బంది దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనతో ఎయిర్‌బేస్ పరిసరాలు భయానకంగా మారాయి. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:20 గంటలకు, రొటీన్ టెస్ట్ మిషన్‌లో భాగంగా టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే ఈ దుర్ఘటన జరిగింది. రన్‌వే సమీపంలోనే కూలిపోయిన విమానం వెంటనే మంటల్లో చిక్కుకుంది. దీంతో మొహావే ఎడారి ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. 412వ టెస్ట్ వింగ్ డిప్యూటీ కమాండర్ కల్నల్ జేమ్స్ హేస్ ఈ ప్రమాదాన్ని ధ్రువీకరించారు. ఇది అత్యంత తీవ్రమైన ప్రమాదమని, దీని నుంచి ఎవరూ ప్రాణాలతో బయటపడే అవకాశం లేదని స్పష్టం చేశారు. మరణించిన వారిని ఎనిమిది మంది గొప్ప అమెరికన్లుగా అభివర్ణించారు. మృతుల్లో సైనిక సిబ్బందితో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కాంట్రాక్టర్లు ఉన్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విమానం ఎయిర్ ఫోర్స్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక రాడార్ మోడరనైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో కొత్తగా అమర్చిన యాక్టివ్ ఎలక్ట్రానికల్లీ స్కాన్డ్ అర్రే రాడార్ వ్యవస్థ పనితీరును పరిశీలిస్తుండగా ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రమాదానికి గల కారణాలపై ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

# చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అండ

## దశలవారీగా పెండింగ్ బిల్లుల క్లియర్: డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

## 18న చలో హైదరాబాద్ వాయిదా: సివిల్ కాంట్రాక్టర్లు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం డిప్యూటీ సిఎంతో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు భేటీ అయ్యారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. దానికి సానుకూలంగా స్పందించిన ఆయన చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతినెలా నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని తెలిపారు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని వివరించారు. రాష్ట్రంలో దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు మధ్యాహ్నం కాంట్రాక్టర్ల ప్రతినిధులు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చలు జరిపారు. అనంతరం మంత్రితో జరిగిన చర్చల సారాంశాన్ని డిప్యూటీ సీఎం విక్రమార్కకు వివరించారు.

**చలో హైదరాబాద్ వాయిదా: రవీందర్‌రెడ్డి**

పెండింగ్ బిల్లుల చెల్లింపులపై డిప్యూటీ సీఎం విక్రమార్క గారు ఇచ్చిన సానుకూల హామీతో తాము ఎంతో సంతృప్తి చెందామని, ఈ నెల 18న చేపట్టదలచిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్‌రెడ్డి ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చి అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి అసోసియేషన్ తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డి.వి.ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆధార్ దుర్వినియోగంపై సుప్రీం సీరియస్..



**న్యూఢిల్లీ,జూన్ 16:** భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ జారీ చేసే ఆధార్ కార్డుల దుర్వినియోగంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆధార్ కార్డును కేవలం వ్యక్తిగత గుర్తింపు కోసమే పరిమితం చేయాలని, దానిని పౌరసత్వం, స్థానికత, లేదా శాశ్వత నివాస ధృవీకరణగా పరిగణించరాదంటూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం మంగళవారం కీలక అడుగు వేసింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రముఖ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ తరఫున అడ్వకేట్ అశ్విని దూబే దాఖలు చేసిన ఈ పిల్ లో ఆధార్ చట్టంలోని లొసుగులను ఎత్తిచూపారు. ఆధార్ చట్టం2016 లోని సెక్షన్ 9 స్పష్టంగా ఆధార్ అనేది పౌరసత్వానికి లేదా స్థానికతకు నిరూపణ కాదని చెపుతోంది. ఆగస్టు 22, 2023 నాటి యూఐడీఏఐ నోటిఫికేషన్ కూడా ఆధార్‌ను కేవలం గుర్తింపు పత్రంగానే పేర్కొంది తప్ప, బర్త్ సర్టిఫికెట్ లేదా నివాస ధృవీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయినప్పటికీ.. స్కూల్ అడ్మిషన్లు, ఆస్తుల కొనుగోళ్లు, జనన ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల జారీలో ఆధార్‌ను ఏజ్, పౌరసత్వ నిరూపణగా విచ్చలవిడిగా వాడుతున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. అన్నిటికంటే ముఖ్యంగా, కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫామ్6 దరఖాస్తులో ఆధార్ కార్డును డేట్ ఆఫ్ బర్త్, నివాస ధృవీకరణగా ఆమోదించడంపై పిటిషనర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం (1950) లోని సెక్షన్ 23(4) మరియు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు పూర్తి విరుద్ధమని వాదించారు. ప్రస్తుతం ఉన్న ఫామ్6 వెరిఫికేషన్ విధానం అత్యంత బలహీనంగా ఉందని, సరైన ఆధారాలు లేని వారు కూడా దీని ద్వారా ఓటర్ల జాబితాలోకి చేరిపోతున్నారని పేర్కొన్నారు. ఈ లొసుగులను ఆసరాగా చేసుకుని విదేశీ చొరబాటుదారులు, అక్రమ వలసదారులు దేశంలో ఆధార్ కార్డులు పొంది, వాటి ద్వారా ఓటర్లుగా నమోదవుతూ భారత పౌరులుగా చలామణీ అవుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల గుర్తింపు, వెరిఫికేషన్ విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని సుప్రీంకోర్టును పిటిషనర్ అభ్యర్థించారు. దేశ భద్రత, ఓటింగ్ వ్యవస్థ పారదర్శకతను కాపాడేందుకు గాను.. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో సైబర్ సెక్యూరిటీ ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ద్వారా ఎన్నికల సంస్కరణలు చేపట్టేలా కేంద్ర ఎన్నికల సంఘానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకరించిన సుప్రీంకోర్టు బెంచ్ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇలాంటి ఇతర కేసులతో జత చేసింది.

# చైనా జలాల్లోకి స్పైతాబేళ్లు,స్పైచేపలు

**బీజింగ్,జూన్ 16:** విదేశీ గూఢచార సంస్థలు సరికొత్త పద్ధతుల్లో తమపై నిఘా పెడుతున్నాయని చైనా సంచలన ఆరోపణలు చేసింది. చైనా సముద్ర జలాల్లోకి స్పై తాబేళ్లు, స్పై చేపలు వంటి జంతువులను ప్రవేశపెట్టి కీలక సమాచారాన్ని దొంగిలిస్తున్నట్లు ఆ దేశ స్టేట్ సెక్యూరిటీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సముద్ర జీవులకు అత్యాధునిక సెన్సర్లు అమర్చి, వాటి ద్వారా తమ సైనిక మరియు పర్యావరణ రహస్యాలను సేకరించేందుకు విదేశీ నిఘా సంస్థలు కుట్ర పన్నాయని ఆరోపించింది. జూన్ 12న తన అధికారిక వీచాట్ ఖాతాలో లోతైన నీలి సముద్రం కింద, అంతర్గత ప్రవాహాలు ఉధృతంగా ఉన్నాయి అనే శీర్షికతో ఈ వివరాలను వెల్లడించింది. తమ తీరప్రాంతాల్లోని నిర్దిష్ట ప్రదేశాల్లో కొన్ని పెద్ద సముద్ర జీవులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నాయని, అవి నీటి ఉష్ణోగ్రత, లవణీయత, సముద్ర ప్రవాహాలు వంటి సమాచారాన్ని సేకరించి, శాటిలైట్ ద్వారా విదేశాలకు చేరవేస్తున్నాయని చైనా పేర్కొంది. కేవలం జంతువులే కాకుండా, గూఢచర్యం కోసం సోలార్ పవర్డ్ వేవ్ గ్లైడర్లు, సెన్సర్ బాయ్‌లను కూడా వినియోగిస్తున్నారని తెలిపింది. ఈ చర్యల ద్వారా సముద్ర గర్భ పటాలను రూపొందించి, చైనా తీరప్రాంత రక్షణ వ్యవస్థలోని లోపాలను గుర్తించేందుకు విదేశాలు ప్రయత్నిస్తున్నాయని, ఇది జాతీయ భద్రతకు పెను ముప్పు అని ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, ఈ ఆరోపణల్లో చైనా ఏ దేశం పేరునూ కూడా నేరుగా ప్రస్తావించలేదు. చైనా ఆరోపణల అంతర్జాతీయ మీడియాలో ప్రాధాన్యత సంతరించుకున్నప్పటికీ, స్వతంత్ర వర్గాలు మాత్రం వీటిని ధ్రువీకరించలేదు.

# బ్యాండ్ కళాకారులకు మేలు చేస్తాం

## వాయిద్య కళాకారుల సదస్సులో మంత్రి జూపల్లి హామీ




ప్రసంగిస్తున్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణా రావు

**హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్న డప్పు, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. అర్హులైన కళాకారులకు పెన్షన్ కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జి. నాగరాజు అధ్యక్షతన జరిగిన తెలంగాణ బ్యాండ్, వాయిద్య కళాకారుల రాష్ట్ర సదస్సు లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పండుగలు, జాతరలు, వివాహాలు, సామాజిక ఉద్యమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వాయిద్య కళాకారుల పాత్ర ఎంతో విశిష్టమైనదని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో బ్యాండ్ కళాకారుల కృషి మరువలేనిదని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా కళాకారులకు తగిన గుర్తింపు అందలేదని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని పెన్షన్, గుర్తింపు కార్డులు, శిక్షణ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, సంఘ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బ్యాండ్ వాయిద్య కళాకారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్ పర్సన్ విమలక్క, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, జాతీయ కవి సుద్దాల అశోక్ తేజ, భూపతి వెంకటేశ్వర్లు, పైళ్ల ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, గౌడ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ , రాష్ట్ర అధ్యక్షుడు చాంద్ పాషా, హనుమంతు, సురేందర్, రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన బ్యాండ్ వాయిద్య కళాకారులు, సంఘాల ప్రతినిధులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ రిచ్ కిడ్స్ కేసులో 'సిట్'

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 16, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ రిచ్ కిడ్స్ కేసులో మరింత లోతైన విచారణకు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఇద్దరు డీసీపీ అధికారులతోపాటు ఒక ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బందితో ఈ బృందాన్ని ఏర్పాటు చేసింది. రిచ్‌కిడ్స్ కేసుకు సంబంధించిన లోతైన దర్యాప్తు చేపట్టేందుకు పలు విభాగాలను ఇందులో సమన్వయం చేస్తూ ఈ బృందాన్ని ఏర్పాటుచేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి సంపన్న కుటుంబాలకు చెందిన బాలికలను వీరు లక్ష్యంగా చేసుకొన్నారు. ఈ వ్యవహారంలో కోడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్, అతని సోదరుడు రాజీవ్, తల్లి మీనా కుమారి, బంధువులు, స్నేహితులైన ప్రశాంత్, వినీల్‌చౌదరి, జితిన్ అలియాస్ జితేందర్‌రెడ్డి, హేమంత్, కార్తిక్‌లతోపాటు బెంగళూరుకు చెందిన మరో ఇద్దరు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించి వీరందరిని అరెస్ట్ చేశారు. వీరితోపాటు ఒక బాలిక నివాసంలో పనిమనిషిగా పనిచేస్తూ బాలిక వ్యవహారాన్ని అడ్డుగా పెట్టుకొని దాదాపు రూ. 9లక్షలు వసూలు చేయడంతో పనిమనిషిని సైతం అరెస్ట్ చేశారు. ఖరీదైన కార్లు, గడియారాలు ధరించి విలాసవంతమైన జీవితం చూపుతూ చంద్రశేఖర్ ఆజాద్‌తోపాటు అతని సోదరుడు, స్నేహితులు ఈ వ్యవహారంలో పలువురు బాలికలను లైంగికంగా ఉపయోగించుకొని ఫొటోలు, వీడియోలు తీసి వారిని బెదిరింపులకు గురిచేసి డబ్బులు వసూలు చేసేవారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు బెంగళూరులో ఉన్న ఇద్దరు నిందితులు మినహా మిగిలిన 9మందిని అరెస్ట్ చేశారు. పలువురు బాలికలు ఇచ్చిన ఫిర్యాదులు, డబ్బులు కోసం బెదిరింపులు తదితర వ్యవహారాల కింద పోలీసులు ఈముఠాపై దాదాపు అయిదు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ జరపడం ద్వారా కీలకమైన విషయాలు తెలిసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు భావించారు. దీనికితోడు నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఈకేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగానే జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ సిట్ బృందాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో మానవ అక్రమ రవాణా విభాగ అధికారులను సైతం భాగస్వాములను చేసి కేసును విచారిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కేసు ఫైల్స్‌ను సైతం ఇప్పటికే దర్యాప్తు బృందం సేకరించింది.

**పోలీసు కస్టడీలో రాజీవ్**

బాలికల సెక్స్‌టార్షన్ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరిగా ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ సోదరుడు రాజీవ్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు మూడు రోజుల కస్టడీలో భాగంగా సోమవారం తమ కస్టడీలోకి తీసుకొన్నారు.

# రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

## ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 16:** హైదరాబాద్ రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును పెట్టే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఉపసంహరించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేచర్యలను సహించబోమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ సమీప రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును పెట్టాలనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజా నాయకుల త్యాగాలతో ముడపడిన ఈ నేలపై ప్రజలకు ఎలాంటి సంబంధం లేని విదేశీ పాలకుల పేర్లను రోడ్లకు పెట్టడం సమంజసం కాదన్నారు.



విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

## పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఎబివిపి

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 16 ప్రభాతవార్త:** పాఠశాల విద్యలో లక్షలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఎబివిపి విద్యార్థులు చేపట్టిన ధర్నా కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. కార్యాలయాన్ని ముట్టడించి లోపలికిచొచ్చుకుని పోవడానికి గేట్లు ఎక్కి ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. గేటు వద్ద ఇద్దరూ విద్యార్థులు సాయి, సంపత్ కింద పడటంతో స్వల్ప గాయాలకు గురైనారు. తొలుత సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం గేటు ఎదుట ఆనేక మంది ఎబివిపి విద్యార్థులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అధికారులు స్పందించకపోవడంతో విద్యార్థులు గేట్లు ఎక్కి లోపలి వెళ్ళడానికి ప్రయత్నించారు. పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేశారు. ఇంటర్‌నేషనల్ స్కూల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేత ప్రతిపాదనను విరమించుకోవాలని, విద్యార్థులకు డ్రెస్సులు పంపిణి చేయాలని ఎబివిపి నాయకులు డిమాండ్ చేశారు.

విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయా లని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలను చేపడతామని వారు హెచ్చరించారు.

# గృహ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి: ఆర్ కృష్ణయ్య




**ధర్నాచౌక్, జూన్ 16, ప్రభాతవార్త:** గృహ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, తెలంగాణ గృహ కార్మికుల సంఘం అధ్యక్షులు అన్ జోసెఫ్, ఉపాధ్యక్షులు లిస్సీ జోసెఫ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా ఆర్.కృష్ణయ్యతో పాటు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బోయిన్‌పల్లి కార్పోరేటర్ ముద్దమ్ నర్సింహరావు, నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్, పీఓడబ్ల్యూ సంధ్య హాజరై గృహకార్మికులకు మద్దతుగా ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లల్లో ఎంతో నమ్మకంగా అన్ని పనులను అతి తక్కువ వేతనాలకే చేస్తున్న గృహ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయాలని, సొంత ఇల్లు లేని వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు లేదా ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి, గృహ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సామాజిక వేత్త సజయ, కే.రవి, అంబిక, ఉష, ఇందిర, శంకర్, పి.కల్పన, సంఘం నాయకులు నవనీత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే మూడేళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో ఎపి అభివృద్ధి

## మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవితమ్మ





**శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాబోయే మూడేళ్ళలో ఎవరు కనివిని ఎరుగని రీతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముక్తకంఠంతో ప్రజలకు భరోసా ఇచ్చారు. మంగళవారం పుట్టపర్తి లోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సంబరాలుజరుపుకున్నారు . ఈ కార్యక్రమానికివైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బిసి సంక్షేమం శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్, రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ నాయకులు పరిటాల శ్రీరామ్, మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. 201419 మధ్యలో అప్పుడే పురుడు పోసుకున్న రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యి ఎన్నో పరిశ్రమలను తీసుకువచ్చిన ఘనత దక్కిందన్నారు. 2019 నుండి 24 వరకు రాష్ట్రంలో ప్రజల బంగారు భవిష్యత్తును నాశనం చేశారని 5 సంవత్సరాల విధ్వంశకర పాలన నడిచిందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు శేఖర్, జనసేన నాయకులు ఉమేష్, టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి హనుమప్ప, రాష్ట్ర డైరెక్టర్లు, పాలకవర్గ సభ్యులు, కూటమి ముఖ్య నాయకులు, అధికార యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి కాలుష్యంపై అధ్యయనానికి కేంద్ర బృందం

## కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్‌తో ఎపి డి.సిఎం పవన్ భేటీ

## నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో బేస్ క్యాంపుల పెంపు

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** మిషన్ గోదావరి క్లీన్ ప్రాజెక్టు మద్దతుగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి రంగంలోకి దిగనుందని అటవీ పర్యావరణ శాఖ మంత్రిశాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పుష్కరాల నేపథ్యంలో గోదావరి కాలుష్య నివారణకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరిన వెంటనే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుల్ని పంపి కాలుష్య నివారణ చర్యలకు సహకరించేందుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ అంగీకారం తెలిపినట్టు చెప్పారు. అటవీశాఖ కామన్ ఫెసిలిటీ సెంటర్ నూతన అరణ్యారామం నిర్మాణంతోపాటు బేస్ క్యాంపుల పెంపు, గ్రేట్ గ్రీన్ వాల్ కి మద్దతు, ఒడిశా నుంచి కుంకీ ఏనుగులు, మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి 50 అడవి దున్నలు రాష్ట్రానికి రప్పించేందుకు సహకారం, తగ్గుతున్న ఆడ పులుల పెంపు చర్యలు తదితర 8 అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించినట్టు తెలిపారు. మంగళవారం ఉదయం కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ సమావేశం అయ్యారు. అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల అటవీ శాఖలో అరణ్యారామం పేరిట నిర్మించ తలపెట్టిన కామన్ ఫెసిలిటీ సెంటర్ అరణ్యంకు అనుమతులు మంజూరు చేసినందుకు భూపేంద్ర యాదవ్ కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చాం అన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో బేస్ క్యాంపులు పెంచుకునేందుకు అనుమతి కోరామని, ప్రస్తుతం 90 బేస్ క్యాంపులు ఉండగా ఆ సంఖ్యను 150కి పెంచుకోవాల్సి ఉంది. అందుకోసం 300 మంది గార్డ్స్ అదనంగా అవసరం అవుతారు. గార్డ్స్ గా స్థానిక చెంచు యువతే ఉంటారు. వారు అడవుల్లో సులభంగా తిరిగేందుకు ద్విచక్రవాహనాలు సహా బేస్ క్యాంపుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి మద్దతు ఇచ్చేందుకు భూపేంద్ర యాదవ్ అంగీకారం తెలిపారు. పవన్ కళ్యాణ్‌తో పాటు జనసేన పార్టీ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ , లింగమనేని రమేష్ , శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ , అటవీ పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే ,పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ తదితరులు ఉన్నారు.

# సెమీకండక్టర్ల తయారీకి ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం

## సెమీకాన్ ఎకోసిస్టమ్ సదస్సులో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** సెమీకండక్టర్ల తయారీకి ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 30రోజుల్లో ఏపీకి వచ్చి అమల్లో ఉన్న పాలసీలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. సింగపూర్‌లో సెమీకాన్ రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు భారత్ అత్యంత సురక్షితమైన ప్రాంతమని, అందులో ఆంధ్రప్రదేశ్ అనుకూలమైన రాష్ట్రమని వివరించారు.

# అమరావతి కోసం హడ్కో నుంచి రూ. 11,000 కోట్లు

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రపదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టంచేశారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందింది. అమరావతి కోసం హడ్కో నుంచి రూ. 11,000 కోట్లు ఇచ్చాం. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారన్నారు, ఒకరోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన నగరంలోని వాజ్‌పేయి పార్కులో స్వచ్ఛ భారత్ లో భాగంగా చీపురుపట్టి చెత్త ఊడ్చారు. అనంతరం బీజేపీరాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేసుజనాచౌదరితో కలిసి మొక్కలు నాటారు.



సాలార్‌జంగ్ మ్యూజియంలో గజల్స్ వినిపిస్తున్న తెలంగాణ డిజిపి సి.వి.ఆనంద్ సతీమణి లలిత ఆనంద్

# ఆకట్టుకున్న లలిత ఆనంద్ గజల్స్

**హైదరాబాద్ (చార్మినార్),జూన్16 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలు మూడవ సాలార్‌జంగ్ నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ జయంతి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం రాత్రి సాలార్‌జంగ్ మ్యూజియంలోని ఆడిటోరియంలో గజల్స్ కార్యక్రమం జరిగింది.రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్ సతీమణి లలితా ఆనంద్ వినిపించిన గజల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి,యాకుబ్ అలీ (హార్మోనియం),ఉస్తాద్ నజ్ముద్దీన్ జావిద్ (తబాల) అరుణ్ కుమార్ (కీబోర్డు) వాయిద్య సహకారాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్,సతీమణి లలిత ఆనంద్,కుటుంబ సభ్యులు,మీర్‌చౌక్ ఏసిపి శ్యాంసుందర్, మ్యూజియం క్యూరేటర్ ఆర్.బి. నాయక్, డిప్యూటీ కీపర్ జ్యోతిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# బడుల మూసివేత విరమించుకోవాలి

## కొత్తబడులను ఏర్పాటు చేసి బోధనా సిబ్బందిని నియమించాలి: తల్లుల సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 16 ప్రభాతవార్త:** లక్షలాది మంది విద్యార్థులు చదువుకుంటున్న బడులను బాగుచేయాలని, కొత్త బడులను తెరవాలని, ప్రభుత్వ బడులను మూసివేయరాదని, బడులను మూసివేసే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, తల్లుల సంఘం నాయకురాళ్ళు భాగ్య, సత్య, లావణ్య, సాయిలక్ష్మి, విజయలక్ష్మి, శోభ, లలిత డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం, ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బడులను మూసివేయాలనే ఆలోచనను సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే విరమించుకోవాలని, బడుల్లో మౌలిక సదుపాయలను కల్పించాలని, బోధనా సిబ్బందిని నియమించాలని, పట్టణ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన అన్ని డివిజన్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అభయ హస్తం పేరిట ఎన్నికల ప్రణాళికల్లో ప్రజలకిచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని, విద్యకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని వారు కోరారు.

# పరిశోధనాంశాలను పాఠ్యప్రణాళికలో చేర్చాలి: చక్రపాణి

**జూబ్లీహిల్స్, జూన్ 16, ప్రభాతవార్త:** నాణ్యమైన విద్యను అందించడానికి విద్యావేత్తలు నాణ్యమైన పరిశోధన చేసి దానిని తమ పాఠ్యప్రణాళికలో అంతర్భాగంగా చేర్చాలని అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఇన్‌ప్లిబ్‌నెట్ పరిశోధన సేవలు అనే అంశంపై పరిశోధక విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌ప్లిబ్‌నెట్ సహాయాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ప్లిబ్‌నెట్ డైరెక్టర్ ఆచార్య దేవికా పి. మాడల్లి ఆన్ లైన్ ద్వారా పాల్గొని ప్రసంగించారు. విశ్వవిద్యాలయ అకాడమిక్ ఇంచార్జ్ డైరెక్టర్ ఆచార్య సుధారాణి, సీఎస్టీడి డైరెక్టర్ ఆచార్య శ్రీదేవి, పరిశోధక విభాగం కో ఆర్డినేటర్ ఆచార్య సి.వెంకటయ్య, వర్క్ షాప్ కో ఆర్డినేటర్ ప్రొ.ఏఆర్డీ ప్రసాద్, ఇన్‌ప్లిబ్‌నెట్ సైంటిస్ట్ లు డాక్టర్ అభిషేక్ కుమార్, శోద్ చక్ర గురించి, కె. మనోజ్ కుమార్, డాక్టర్ సుర్బి, పల్లభ్ ప్రాధాన్ తదితరులు పాల్గొన్నారు.

## రఘురామ కేసులో కొత్త ట్విస్ట్

# మెడికల్ రిపోర్టులు సమర్పించాలని హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జూన్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి తెలుగుదేశం ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజుకి సంబంధించిన కస్టోడియల్ టార్చర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం ఈకేసుపై విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని మెడికల్ రిపోర్టులను తమ ముందుంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన మెడికల్ బోర్డు నివేదికలు, వైద్య పరీక్షల పూర్తి రికార్డులు, ఇతర సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. సీఐడీ అధికారులు తనను కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని రఘురామ గతంలో ఆరోపించిన విషయం తెలిసిందే.

# యోగా దినోత్సవానికి భారీ ఏర్పాట్లు

**విజయవాడ, జూన్ 16, ప్రభాతవార్త :** ఈనెల 21వతేదీ అంతర్జాతీయ యోగాదినోత్సవ వేడుకలను విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవేడుకలకు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యోగా గురువు రాందేవ్‌బాబా తదితర ప్రముఖులు హాజరు కానున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, ప్రభుత్వ సలహాదారులు మంతెన వెంకటసత్యన్నారాయణరాజు, మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర, సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాధన్, సెకండరీహెల్త్ డైరెక్టర్ కెవీఎన్.చంద్రధరబాబు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

# దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర కానుక

## నేడు సామూహిక ఉచిత అక్షరాభ్యాసాలు



పట్టుచీరను సమర్పిస్తున్న భక్తుడు

**ఇంద్రకీలాద్రి, జూన్ 16, ప్రభాతవార్త :** దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే పరిమాణంతో చీరను స్వయంగా నేసి బుధవారం కానుకగా భక్తులు అందించారు. వేములవాడ సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కళారత్న అవార్డు గ్రహీత నల్ల విజయ్‌కుమార్ ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి చేనేత శిల్పి అవార్డు గ్రహీత నల్ల పరంధాములు బాటలో తాను ప్రయాణిస్తూ ఇలా విలక్షణమైన 5.5 మీటర్లు, 48 అంగుళాల వేడల్పుతో అగ్గిపెట్టెలో పట్టే పరిమాణంతో పట్టు చీరను దుర్గమ్మవారి కోసం రూపొందించామన్నారు. ఈ సందర్భంగా ఇఓ వికె శీనా నాయక్ వారిని అభినందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటో అందించారు. వేద పండితులు వేదాశీర్వచనం పలికారు. ఆలయంలో నిజ జేష్ఠమాస శుద్ధతదియ బుధవారం ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మను మంగళవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్, బిజెపి రాష్ట్రాధ్యక్షుడు పివిఎన్ మాధవ్, విజయ వాడ ఎంపి కేశినేని శివనాథ్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరులు దర్శించు కున్నారు. నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన వల్లూరు భాస్కరరావు తమ కుటుంబ సభ్యులు మహేష్, శిరీషల పేరిట రు.1,01,116ల విరాళం అందించారు.

ఆట

## అల్జీరియాతో అర్జెంటీనా ఢీ
## నేటి ఉదయం 6.30గంటలకు
## భారత్‌లోనూ మెస్సీ మానియా

# వరల్డ్ ఛాంపియన్లకు తొలి పరీక్ష





**కాన్సాస్ సిటీ, జూన్ 16**

సాకర్ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తొలి పోరుకు సిద్ధమైంది. గ్రూప్-జెలో ఉన్న అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం ఆరున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్‌ప్లేయర్ లియోనెల్ మెస్సీ చేసే మ్యాజిక్ కోసం ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా తన వరల్డ్ కప్ యాత్రను విజయంతో ప్రారంభించాలని చూస్తుండగా.. చరిత్ర సృష్టించే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అండర్‌డాగ్ అల్జీరియా ఆశిస్తోంది. మెస్సీ మాయాజాలం, మహ్రెజ్ ప్రతిభ మధ్య జరిగే ఈ పోరు ఉత్కంఠ రేపుతోంది.

**హాట్ ఫేవరెట్‌గా మెస్సీ సేన**

లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే మెస్సీ ఫిట్‌నెస్ కాస్త ఆందోళన పరుస్తోంది. అతను ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గోల్ కీపర్ ఎమిలియానో మార్టినెజ్ కూడా అందుబాటులో ఉండడం అర్జెంటీనాకు ఊరటనిచ్చే అంశం. మెస్సీని ఎంతవరకు నిలువరిస్తారన్న అంశంపైనే అల్జీరియా విజయావకాశాలు ఉంటాయి. డ్రాగా ముగించినా గొప్పగానే భావించవచ్చు. అయితే ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకూడదని అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనీ హెచ్చరిస్తున్నాడు. 2022 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఎదురైన అనుభవాన్ని గుర్తుచేస్తూ... అల్జీరియా నైపుణ్యమైన జట్టని పేర్కొన్నారు. రియాద్ మహ్రెజ్ నాయకత్వంలోని అల్జీరియా మెరుపు దాడులతో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆటగాళ్లకు కోచ్ స్కలోనీ సూచించాడు.

**భారత్‌లోనూ మెస్సీ మానియా**

ఫిఫా ప్రపంచకప్ మానియా ఇప్పుడు భారత్‌లో కూడా టాప్ గేర్‌కు చేరుకుంది. లియోనెల్ మెస్సీ ఆడుతుండడంతో ఈ మ్యాచ్‌పై భారత్‌లో కూడా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కేరళ, గోవా, బెంగాల్‌లో ఫిఫా కళ వచ్చేసింది. ఆపై డిఫెండింగ్ చాంపియన్స్ హోదాలో అర్జెంటీనా బరిలోకి దిగుతుండడంతో కేరళలో సాకర్ ఫీవర్ ఊపేస్తోంది. ఇక కేరళలో అయితే మెస్సీతో పాటు రొనాల్డో, నెయ్‌మర్, ఎంబాపె, సాలా, లామినే యమాల్ వంటి ఆటగాళ్లకు కూడా విపరీతమైన ఆదరణ ఉంది. దీంతో ఇక్కడి ఇళ్లకు కూడా ప్రజలు తమ కిష్టమైన జట్ల రంగులను పెయింటింగ్ వేసుకున్నారు. ఇక బుధవారం ఒక్కరోజే ముగ్గురు బిగ్‌స్టార్స్ మ్యాచ్‌లు ఆడనుండడంతో ఫిఫాలో అసలు సమరం మొదలుకానుంది.

బుధవారం తెల్లవారుజామున ఫ్రాన్స్, సెనెగల్ మధ్య పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ ఎంబాపె బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత ఉదయం 6.30 గంటలకు మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా.. అల్జీరియాతో తలపడనుంది. ఇక రాత్రి 10.30 గంటలకు పోర్చుగల్.. కాంగో రిపబ్లిక్‌తో తలపడనుంది. ఇలా త్రిమూర్తులు ఒకే రోజు మ్యాచ్ ఆడనుండడంతో ఫుట్‌బాల్ అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.




# హాకీ సెమీస్‌లోకి దూసుకెళ్లిన భారత్

**ఆక్లాండ్, జూన్ 16:** నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నీలో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆక్లాండ్‌లోని నార్త్ హార్బర్ నేషనల్ హాకీ సెంటర్‌లో జరిగిన పూల్-ఎ రెండో మ్యాచ్‌లో భారత్ మహిళలు 2-1 గోల్స్‌తో జపాన్‌పై కంగుతినిపించింది. పూల్-ఎలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందిన భారత్.. సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. భారత్ తరఫున కెప్టెన్ సలీమా టెటే 33వ నిమిషంలో, ఫార్వర్డ్ లాల్‌రెమ్ సియామి 49వ నిమిషంలో గోల్స్ చేశారు. జపాన్‌కు లభించిన ఏకైక గోల్‌ను 35వ నిమిషంలో హిరామిత్సు అందించింది. వందో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన మిడ్‌ఫీల్డర్ జ్యోతికి ఇది చిరస్మరణీయ గేమ్‌గా మారింది.

మొదటి అర్ధభాగంలో ఇరుజట్లకు గోల్స్ అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాయి. 33వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను భారత్ గోల్‌గా మలిచింది. నవనీత్ కౌర్ ఇచ్చిన పాస్‌ను నిక్కీ ప్రధాన్ అద్భుతంగా సలీమా వైపు మళ్లించింది. కెప్టెన్ దాన్ని విజయవంతంగా గోల్‌పోస్ట్‌లోకి నెట్టింది. రెండు నిమిషాల తర్వాత హిరామిత్సు పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జపాన్‌ను 1-1తో సమవుజ్జీగా నిలిపింది. ఇక 49వ నిమిషంలో సుశీల చాను.. సర్కిల్ అంచు నుండి గోల్ వైపు అందించిన అద్భుత పాస్‌ను అందుకున్న లాల్‌రెమ్ సియామి బంతిని నెట్‌లోకి మళ్లించి భారత్‌కు విజయాన్ని అందించింది. 18న జరిగే పూల్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో ఉరుగ్వేతో భారత్ తలపడనుంది. పూల్-ఎ నుండి రెండో సెమీఫైనల్ స్థానం కోసం జపాన్-అమెరికా తలపడతాయి.

# అరౌజో గోల్‌తో గట్టెక్కిన ఉరుగ్వే

**మియామి:** సాకర్ ప్రపంచకప్‌లో చిన్న జట్లు పెద్ద ఆటతో మేటి జట్లకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కబొవెర్డెతో మ్యాచ్‌ను గోల్ లెస్‌గా స్పెయిన్ ముగించగా... బెల్జియం, ఈజిప్ట్ మ్యాచ్ 1-1తో డ్రా అయింది. ఇక రెండుసార్లు చాంపియన్స్ ఉరుగ్వే తృటిలో ఓటమి నుంచి తప్పించుకుంది. గ్రూప్ హెచ్‌లో భాగంగా సౌదీ అరేబియాతో జరిగిన మ్యాచ్‌ను ఉరుగ్వే 1-1తో డ్రా ముగించి ఊపిరి పీల్చుకుంది. గత ప్రపంచకప్‌లో అర్జెంటీనాను ఓడించిన సౌదీ.. ఈ మ్యాచ్‌లోనూ సంచలనం సృష్టించే ఊపులో కనిపించింది. 41వ నిమిషంలో అబ్దులేలాహ్ అల్ అమ్రి గోల్ చేసి సౌదీకి ఆధిక్యం అందించాడు. ఈ ఆదిక్యం 80వ నిమిషం వరకు కొనసాగింది. చివరకు మాక్సీ అరౌజో చేసిన గోల్‌తో ఉరుగ్వే గోల్స్ సమం చేసింది. డ్రాతో గటెక్కింది. అయితే ఉరుగ్వేకు పలు అవకాశాలు వచ్చాయి. 5వ నిమిషంలో బాక్స్ అంచు నుంచి మాక్సీ అరౌజో కొట్టిన కిక్‌ను సౌదీ గోల్ కీపర్ మొహమ్మద్ అలోవైస్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత ఉరుగ్వేకు కార్నర్ లభించినా, గోల్ చేయడంలో విఫలమైంది. 18వ నిమిషంలోనూ ఉరుగ్వే కొట్టిన షాట్ గోల్‌పోస్టు తగులుకుంటూ వెళ్లింది.

**ఈజిప్ట్‌ను ముంచిన సెల్ఫ్ గోల్: 1-1 గోల్స్‌తో బెల్జియం మ్యాచ్ డ్రా**

సియాటెల్‌లో జరిగిన మరో గ్రూప్-జి పోరులో బెల్జియం, ఈజిప్ట్ 1-1తో డ్రా అయ్యాయి. సలాహ్ పాస్‌ను అందుకున్న ఎమామ్ అషూర్ 19వ నిమిషంలో గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. మ్యాచ్ అంతా బెల్జియం ఆధిపత్యం ప్రదర్శించినా గోల్స్‌గా మలచలేకపోయింది. 65వ నిమిషంలో రొమెలు లుకా మైదానంలోకి అడుగుపెట్టిన 22 సెకన్లకే ప్రభావం చూపించాడు. థామస్ ఇచ్చిన క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఈజిప్ట్ ఆటగాడు మహ్మద్ హానీ సెల్ఫ్ గోల్ చేయ డంతో బెల్జియం సమం చేసింది. దీంతో ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని అందుకోవాలన్న ఈజిప్ట్ కల మరోసారి నెరవేరలేదు.





# ఇరాన్ గేమ్ భళా: న్యూజిలాండ్‌తో డ్రా

**కాలిఫోర్నియా, జూన్ 16:** ఫిఫా ప్రపంచకప్‌లో మేటి జట్లు ఉన్నా అందరి చూపు ఇరాన్‌పైనే. సాకర్ వరల్డ్ కప్‌లో పాల్గొంటుందా? లేదా? అన్న సందిగ్ధం నుంచి అమెరికాకు వచ్చిన ఇరాన్ అదిరే ఎంట్రీ ఇచ్చింది. గ్రూప్-జిలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసి ఆశ్చర్యపరిచింది. ఆరంభంలో న్యూజిలాండ్ ఆధిక్యం కనబరిచింది. ఆట ప్రారంభమైన ఏడో నిమిషంలోనే గోల్ చేసి ఆధిక్యంలో నిలిచింది. క్రిస్ వుడ్ అందించిన పాస్‌ను ఎలిజా జస్ట్ గోల్‌గా మలిచాడు. అటు తర్వాత అటాక్‌కు దిగిన ఇరాన్ చివరకు 31వ నిమిషంలో గోల్ చేసింది. రామిన్ రెజాయియన్ గోల్ సాధించి ఇరాన్‌ను సమవుజ్జీగా నిలిపాడు. రెండో అర్ధ భాగం 54వ నిమిషంలో ఎలిజా జస్ట్ మరోసారి గోల్ చేయడంతో న్యూజిలాండ్ 2-1తో ఆధిక్యం పొందింది. పది నిమిషాలకే ఇరాన్ మరో గోల్ చేసింది. 64వ నిమిషంలో రెజాయియన్ అందించిన క్రాస్‌ను ఈసారి మహమ్మద్ మొహెబ్బి గాల్లోకి ఎగిరి హెడర్‌తో గోల్‌గా మలచడంతో మ్యాచ్ 2-2తో సమంగా ముగిసింది.

**అమెరికా విడిచి వెళ్లాలన్నారు: ఇరాన్ కోచ్**

ఈ మ్యాచ్ ముగిసిన వెంటనే అమెరికా విడిచి వెళ్లిపోవాలంటూ తమకు ఆదేశాలు వచ్చాయని ఇరాన్ కోచ్ అమీర్ ఘలేనోయి అన్నారు. ఈ టోర్నీలో తాము అణచివేతకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచ్ ఆడిన తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు ఇరాన్ జట్టు రాత్రి కాలిఫోర్నియాలో ఉండాలనుకుంది. కానీ, మెక్సికోకు వెళ్లాలని ఆదేశాలు వచ్చాయన్నారు. లాస్‌ఏంజిల్స్‌లోనే ఇరాన్ తదుపరి మ్యాచ్ 22న బెల్జియంతో ఆడాల్సి ఉంది. అయితే అమెరికాలోనే మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా... మెక్సికోలోని టిజువానాలో ఇరాన్ జట్టుకు బస ఏర్పాటు చేశారు. మ్యాచ్ జరిగే రోజు అక్కడి ఉంచి మ్యాచ్ ఆడే వేదికకు ఇరాన్ జట్టును విమానంలో తరలిస్తారు. అమెరికా వీసాలు నిరాకరించడంతో కోచింగ్ సహాయక సిబ్బంది జట్టుతో లేకపోవడాన్ని ఇరాన్ కెప్టెన్ మెహ్దీ తరేమీ, కోచ్ అమీర్ ఘలేనోయి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ పరిస్థితి జట్టు సన్నద్ధతను మరింత క్లిష్టతరం చేసిందన్నారు.

## పెట్టుబడుల ఉపసంహారణతో భారీ ఆదాయం
# తొలి త్రైమాసికంలో 15వేల కోట్లకు పైగా వసూళ్లు




**న్యూఢిల్లీ, జూన్ 16:** కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పెట్టుబడుల ఉపసంహారణ (డిస్‌ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.15వేల కోట్లకు పైగా ఆదాయం సమీకరించనున్నది. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) లావాదేవీల ద్వారా ఈ ఆదాయం పెరిగి, ప్రభుత్వ పన్నేతర రాబడులకు ఊతం ఇస్తోంది. కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థల్లో వాటాల విక్రయాల ద్వారా ఈ వృద్ధి నమోదైంది. ప్రస్తుత త్రైమాసికంలోనే కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.14,000 కోట్లను సమీకరించింది. ఇంకా లెక్కల్లో చేరాల్సిన ఆదాయంతో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక వ్యయ భారం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక వ్యవస్థకు నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ కీలక ఆధారంగా మారుతున్నాయి.

పెట్టుబడుల ఉపసంహారణ, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా అధిక ఆదాయం సమకూరితే ఆర్థిక లోటు నియంత్రణకు తోడ్పడటంతో పాటు 2027 ఆర్థికసంవత్సరంలో లక్ష్యాలను చేరుకోవడంలో ప్రభుత్వానికి సహాయ పడుతుందని అంచనా. ముఖ్యంగా ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీ వ్యయం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఆదాయం ప్రాధాన్యం సంతరించుకుంది. 2027 ఆర్థికసంవత్సరంలో లో కేంద్ర ప్రభుత్వం రూ.80వేల కోట్ల విలువైన ఆస్తుల మోనిటైజేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో ఐడిబిఐ బ్యాంక్ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహారణతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీ వాటాల విక్రయాలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మరింత వాటా విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నాన్‌ట్యాక్స్ క్యాపిటల్ రిసీట్స్ రూపంలో మొత్తం రూ.21,732.23 కోట్లను సమీకరించింది. ఇందులో పెట్టుబడులు విత్‌డ్రా ద్వారా రూ.13,389.42 కోట్లు, ఆస్తుల మోనిటైజేషన్ ద్వారా రూ.6,367 కోట్లు, డివిడెండ్ ఆదాయం ద్వారా రూ.1,976 కోట్లు లభించాయి.




# కాసులు కురిపిస్తున్న గోల్డ్ బాండ్స్

**ముంబయి, జూన్ 16:** సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) 202021 సిరీస్‌లో పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లకు కనకవర్షం కురుస్తోంది. ఐదేళ్ల కాలపరిమితి పూర్తి కావడంతో, ఈ బాండ్లను గడువుకు ముందే అమ్ముకునేందుకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన విమోచన ధరను కూడా ప్రకటించడంతో ఇన్వెస్టర్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. రూ.4,627 పెట్టుబడిపై రూ. 14,774 రాబడి ఎస్‌జీబీ 202021 సిరీస్ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేశారు. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గ్రాముకు రూ. 4,627 ధరకు, ఇతర మార్గాల ద్వారా కొన్నవారికి రూ. 4,677 ధరకు బాండ్లను కేటాయించారు. ఇప్పుడు ఐదేళ్ల తర్వాత, ఆర్బీఐ ఈ బాండ్ల ముందస్తు విమోచన ధరను యూనిట్‌కు (ఒక గ్రాముకు) రూ. 14,774గా నిర్ణయించింది.

అప్పట్లో ఆన్‌లైన్‌లో గ్రాముకు రూ. 4,627 పెట్టి కొన్నవారికి ఇప్పుడు గ్రాముపై రూ. 10,147 లాభం వస్తుంది. దీనిని శాతాల్లో లెక్కిస్తే, రాబడి 219.30 శాతంగా ఉంటుంది. ఎవరైనా ఆ సమయంలో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, వారికి ఇప్పుడు వడ్డీ ఆదాయం కాకుండానే సుమారు రూ. 3.19 లక్షలు చేతికి వస్తాయి. ఈ ఐదేళ్ల పాటు ఏటా 2.5 శాతం చొప్పున వడ్డీ కూడా ఇన్వెస్టర్ల ఖాతాలో జమ అయింది. ఎస్‌జీబీ నిబంధనల ప్రకారం బాండ్ల జారీ తేదీ నుంచి 8 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో నిధులు అవసరమైన వారి కోసం, ఐదేళ్ల తర్వాత గడువుకు ముందే అమ్ముకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పిస్తుంది. ఈ బాండ్లను 2020 జూన్ 16న జారీ చేయడంతో, 2026 జూన్ 16 నాటికి ఐదేళ్ల లాక్ ఇన్ పీరియడ్ పూర్తయింది.


దీంతో ముందస్తు ఉపసంహారణకు మార్గం సుగమమైంది. ఆర్బీఐ ఈ విమోచన ధరను యాదృచ్ఛికంగా నిర్ణయించదు. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రచురించే ధరల ఆధారంగా, విమోచన తేదీకి ముందున్న మూడు పనిదినాల్లోని 999 స్వచ్ఛత కలిగిన బంగారం ముగింపు ధరల సగటును లెక్కించి ఈ ధరను ఖరారు చేస్తుంది. 219 శాతం లాభాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, బాండ్లను అమ్ముకోవాలా లేక మెచ్యూరిటీ వరకు ఉంచుకోవాలా అనేది ఇన్వెస్టర్ల వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలపై ఆధారపడి ఉంది.

# వార్ ఒప్పందంతో ఈక్విటీల ర్యాలీ



# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జూన్ 16:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ కొనుగోళ్లకు దిగడం వంటి అంశాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఒప్పందం కుదిరిందన్న వార్తలు ఇంధన సరఫరాపై ఉన్న ఆందోళనలను తగ్గించడంతో బ్రెంట్‌క్రూడ్ ధర బ్యారెల్‌కు 83 డాలర్ల కంటే దిగువకు చేరింది. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. మెటల్స్, హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు పెరిగి 76,808.48 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 135.25 పాయింట్లు శాతం లాభపడి 23,989.15 వద్ద స్థిరపడింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 4.03 శాతం, నిఫ్టీ 3.57 శాతం మేర ర్యాలీ తీశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.33 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.48 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,293 షేర్లు లాభపడగా, 1,967 షేర్లు నష్టపోయాయి. 169షేర్లు మార్పులేకుండా ముగిశాయి. రూపాయి కూడా డాలర్‌తో పోలిస్తే బలపడగా, 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ స్వల్పంగా తగ్గింది. బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్ప లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. రిటైల్ అమ్మకాలు తగ్గగా, పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి అంచనాలను మించి నమోదైంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేరు 3.68 శాతం ఎగిసింది. బెంగళూరుకు చెందిన ఏఐ స్టార్టప్ సర్వమ్ ఎఐలో రూ.1,427 కోట్ల వ్యూహాత్మక పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ ప్రకటించింది. సుజ్లాన్ ఎనర్జీ షేరు 4.25 శాతం లాభపడింది. దేశంలో విండ్ ఎనర్జీ సామర్థ్యాన్ని భారీగా పెంచే అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి పేర్కొనడం ఇందుకు కారణమైంది. 1500 మెగావాట్ల విండ్ టర్బైన్‌ల సరఫరా కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించడంతో షేరు లాభపడింది. ఇతర ప్రధాన షేర్లుఆదాని పోర్టులు ప్రత్యేక ఆర్థిక జోన్ 0.90 పెరిగింది. గోదావరి బయో రిఫైనరీస్ 5.56జంప్ చేసింది. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే ఆవిష్కరణకు జపాన్ పేటెంట్ లభించింది. బంధన్ బ్యాంకు 2.78 లాభపడింది. రూ.303.74 కోట్ల ఎన్‌పీఏలను విక్రయించేందుకు బోర్డు ఆమోదంతెలిపింది. మిని డైమండ్స్ ఇండియాషేరు9.77 పెరిగింది. 16.25 కోట్ల వజ్రాల సరఫరా ఆర్డర్ వచ్చిందన్న ప్రకటన షేర్లనుపెంచింది. ధనలక్ష్మిబ్యాంకు 1.77 నష్టపోయింది. మొత్తంగా, అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా మారడం, ఎఫ్ఐఐలు మళ్లీ కొనుగోళ్లకు రావడం, రూపాయి బలపడడం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజు కూడా లాభాల్లో ముగిశాయి.



# కిమ్స్ క్యూఐపి ఇష్యూ ఓపెన్

**ముంబయి, జూన్ 16:** కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్) మంగళవారం తన క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ క్యూఐపి ఇష్యూను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఒక్కో ఈక్విటీ షేర్‌కు ఫ్లోర్ ప్రైస్‌ను రూ.771.73గా నిర్ణయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల్లో తెలిపింది. కంపెనీ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ 16న ఇష్యూ ప్రారంభానికి ఆమోదం తెలిపి, నిధుల సమీకరణకు సంబంధించిన ప్రాథమిక ప్లేస్‌మెంట్ డాక్యుమెంట్స్‌ను ఆమోదించింది. అలాగే సంస్థాగత పెట్టుబడిదారులకు ఫ్లోర్ ప్రైస్‌పై గరిష్ఠంగా 5 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వడానికి కూడా కంపెనీకి అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి 2026 ఏప్రిల్ 15న పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారుల ప్రత్యేక తీర్మానం ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో గరిష్ఠ డిస్కౌంట్‌ను అమలు చేస్తే ఒక్కో షేర్ ధర రూ.733.14 వరకు ఉండే అవకాశం ఉంది. తుది ఇష్యూ ధరను క్యూఐపికు నియమించిన బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లతో సంప్రదించి నిర్ణయిస్తామని కిమ్స్ పేర్కొంది. ఈ ఇష్యూకు సంబంధించి 2026 జూన్ 16ను రిలెవెంట్ డేట్‌గా ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ నిర్ణయించింది. ఈ క్యూఐపికి సంబంధించి కిమ్స్ డైరెక్టర్ల బోర్డు 2026 మార్చి 11న జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ద్వారా వాటాదారుల అనుమతి కూడా లభించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ అనేది లిస్టెడ్ కంపెనీలు దీర్ఘకాలిక పబ్లిక్ ఇష్యూ ప్రక్రియ లేకుండానే సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి మూలధనం సమీకరించేందుకు ఉపయోగించే మార్గం. విస్తరణ ప్రణాళికలు, కొనుగోళ్లు, వ్యాపార వృద్ధి లేదా బ్యాలెన్స్ షీట్ బలోపేతం కోసం కంపెనీలు ఈ విధానాన్ని తరచుగా వినియోగిస్తుంటాయి.




# ఇంధన ఎగుమతులపై ఎక్సైజ్ సుంకం పెంపు

**న్యూఢిల్లీ, జూన్ 16:** పెట్రోల్, డీజిల్, విమానఇంధన (ఏటీఎఫ్) ఎగుమతులపై కేంద్రం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని (విండ్‌ఫాల్ ట్యాక్స్) పెంచింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. దేశీయ ఇంధన నిల్వలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడడంతో పాటు, ఎగుమతుల ద్వారా లభిస్తున్న అదనపు లాభాలపై నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13.50 నుంచి రూ.14కు పెంచారు. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై సుంకాన్ని 9.50 నుంచి రూ.12.50కు పెంచారు. పెట్రోల్ ఎగుమతులపై ప్రస్తుతం అమల్లో ఉన్న లీటరుకు రూ.1.50 సుంకంలో ఎలాంటి మార్పు చేయలేదు. కొత్త రేట్లు జూన్ 16 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయం దేశీయ వినియోగదారులపై తక్షణ ప్రభావం చూపదని కేంద్రం స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్‌కు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్‌పై ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని తెలిపింది. ఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో మార్చి 26న కేంద్రం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి అంతర్జాతీయ ముడిచమురు ధరలు, రిఫైనరీల లాభాల పరిస్థితిని బట్టి ప్రతి రెండు వారాలకు ఒకసారి సుంకాలను సమీక్షిస్తోంది.

## టిసిఎస్‌కు అమెరికా కోర్టులో షాక్
# రూ.1986 కోట్ల పరిహారం




**న్యూయార్క్, జూన్ 16:** భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌టీసీఎస్ కు అమెరికాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా నడుస్తున్న ట్రేడ్ సీక్రెట్స్ వ్యాపార రహస్యాలు చౌర్యం కేసులో అమెరికా సుప్రీంకోర్టులో ఆ సంస్థకు షాక్ తగిలింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో టీసీఎస్‌పై దాదాపు 220 మిలియన్ డాలర్ల భారత కరెన్సీలో సుమారు రూ.1,986 కోట్లు ఆర్థిక భారం పడుతుందని అంచనా. ఈ వివాదం మూలాలు అమెరికాలోని లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్ వ్యాపారంలో ఉన్నాయి. డీఎక్స్‌సీ టెక్నాలజీ అనే సంస్థకు చెందిన పూర్వ కంపెనీ అయిన కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ), 1990లలో తమ యాజమాన్యంలోని ఒక ప్రత్యేకమైన లైఫ్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్‌ను ట్రాన్స్‌అమెరికా అనే బీమా సంస్థకు లైసెన్స్ ఇచ్చింది. కొన్నేళ్ల తర్వాత ట్రాన్స్‌అమెరికాకు చెందిన 2,200 మందికి పైగా ఉద్యోగులను టీసీఎస్ నియమించుకుంది. ఈ ఉద్యోగుల ద్వారా సీఎస్‌సీకి చెందిన రహస్య సాఫ్ట్‌వేర్ సమాచారాన్ని, దాని పనితీరును తెలుసుకుని, దానికి పోటీగా ఒక కొత్త ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్‌ను టీసీఎస్ అభివృద్ధి చేసిందని డీఎక్స్‌సీ ఆరోపించింది. ఈ ఆరోపణలతో డీఎక్స్‌సీ, 2019లో డల్లాస్‌లోని ఫెడరల్ కోర్టులో టీసీఎస్‌పై దావా వేసింది. టీసీఎస్ తమ వ్యాపార రహస్యాలను దుర్వినియోగం చేసిందని, గోప్యమైన సమాచారంతో లబ్ధి పొందిందని ఆరోపించింది. టీసీఎస్ మొదటి నుంచి ఈ ఆరోపణలను ఖండిస్తూ వచ్చింది. తాము పొందిన సమాచారం రహస్యమైనది కాదని, చట్టబద్ధంగానే సాఫ్ట్‌వేర్‌ను యాక్సెస్ చేశామని వాదించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.